
శ్రీ చక్ర శాస్త్ర విజ్ఞానం



తెలుగు అనువాదం: శ్రీ ఖరిదేహాల్ వేంకటరావు



Mohan Publications

ఫేస్‌బుక్‌లో మోహన్ పబ్లికేషన్స్ పేజ్ - లైక్ చేయండి మేము పోస్టు చేసే
అనేక ఆధ్యాత్మిక పి.డి.ఎఫ్. లు ఉచితంగా పొందండి
మీకు నచ్చిన పోస్టులను షేర్ చేయండి

విషయసూచిక

		పుట
1	మంత్రము యంత్రము తంత్రవము	1
2	శ్రీచక్రముము	8
3	నవావరణలు	12
4	శ్రీచక్రము – శ్రీవిద్యద్య	36
5	శ్రీచక్రము – కుండలిని	46
6	త్రిపురసుందరీదేవి	55
7	మంత్రార్థము	64
8	శ్రీచక్ర పూజ	77
9	శ్రీసూక్తానుసారము శ్రీచక్రపూజా విధానము	81
10	దశముద్రలు	85
11	శ్రీచక్ర శాస్త్ర గ్రంథములు	88
12	దీక్షితార్ కమలాంబా నవావరణ కృతులు	91

అధ్యాయము 1

హిందూమతములో అనేక విషయములు మతములకు ప్రతీకలుగా గోచరించును. లౌకికముగా లేక అధ్యాత్మికముగా చేబట్టు ఏ కర్మలోనైనా ముఖ్యముగా మూడు అంశములుండును. అవి: (1) సాధనము (2) విధానము (3) లక్ష్యము. శాస్త్రీయముగా వీటిని ఈ క్రింది విధముగా పేర్కొనవచ్చును.

1. చిత్రపటము లేక రేఖా చిత్రము (design)
2. సూత్రము లేక సమీకరణము
3. ఆచరణ పద్ధతి లేక ప్రక్రియ

పై మూడును అధ్యాత్మిక పదజాలములో వరుసగా మంత్రము, యంత్రము, తంత్రములుగా పిలువబడుచున్నవి. ఈ మూడింటి మధ్య విడదీయరాని సంబంధము కలదు. వీటిని సరిగ్గా ఆకళింపుచేసికొనినపుడు అవి ముక్తికి దారి తీయును. ద్రష్టలు, స్రష్టలు దీర్ఘకాలము తపస్సు చేసి పొందిన ఆధ్యాత్మికానుభవముల ఫలితంగా పై మూడింటి ఆవిర్భావమునకు, వాటి ఎదుగుదలకు దోహదపడిరి.

మంత్రము

అక్షరములతో కూర్చబడినది మంత్రము. మననముచే సాధింపబడుటచేత ఇది మంత్రమని చెప్పబడుచున్నది. మననమనగా ఆలోచనా ప్రక్రియ. మంత్రము నుచ్చరించినపుడు ఆలోచనా ప్రక్రియ సాగును. 'త్ర' అనునది 'త్రై' ధాతువునుండి వచ్చినది. దీని అర్థము విముక్తి కలిగించుట. 'త్రాణ' అనగా ఇహలోక లేక సంసారబంధములనుండి విముక్తి. సూక్ష్మంగా 'రక్షణ' అనవచ్చును. దేనిని పఠించుట లేక ఉచ్చరించుట వలన రక్షణ కలుగునో అది మంత్రము. (మననాత్ త్రాయతే ఇతి మంత్రః).

మంత్రము శబ్దతరంగముల సమూహాశక్తి, అక్షరములతో కూడినది. సంస్కృతభాషలో అన్నియు అక్షరములే, అనగా నశించనవి యని అర్థము.

మంత్రము ఒక విధమైన శబ్దశక్తి స్వరూపము. శబ్దము శూన్యముయొక్క స్వభావము. శబ్దము ఆకాశము యొక్క గుణము. దీనిని శబ్దబ్రహ్మమని కూడ అందురు. శబ్దరూపములో వ్యక్తమగు పరబ్రహ్మము. శబ్దము రెండు రకములు – అక్షర శబ్దము, ఇతరము. రెండు వస్తువుల రాపిడి వలన కలుగు శబ్దము రెండవ రకము. అక్షర శబ్దము ఎటువంటి రాపిడి గాని శ్రమగాని లేకుండ జనించునది. దీనిని 'అనాహత' శబ్దమందురు. దార్శనికుల అభిప్రాయానుసారము ఇది శాశ్వతము. ఈ శబ్దము ఉచ్చరించుటకు ముందు, ఉచ్చరించిన తరువాత లేనిదని చెప్పవచ్చును. మరియు ఉచ్చరించుటకు చేయు ప్రయత్నమును గమనించవచ్చును. స్థూలముగా ఈ విషయములు అక్షరశబ్దము తాత్కాలికమను భావము కలిగించును. కాణాద, గౌతమ, శంకరమిశ్ర, వాచస్పతి మిశ్ర, ఉదయనాచార్య, తదితరులు పై విధంగా భావించినవారిలో కొందరు. ఈ అభిప్రాయమును ఇతర తత్త్వసిద్ధాంత పండితులు, వ్యాకరణశాస్త్ర పండితులు ఖండించిరి. అక్షరశబ్దము ఉచ్చరించుటకు పూర్వమే కలదని వారి వాదము. కాకపోతే దానిని వెలిబుచ్చుటకు ప్రయత్నము అవసరము. అక్షరశబ్దము శాశ్వతమైనప్పటికి, మానవ కర్ణేంద్రియము తాత్కాలికముగా గ్రహించును. శ్రవణానంతరము కూడ శబ్దతరంగములు శాస్త్రీయంగా ఎంతో దూరము ప్రయాణించగలవు. కాబట్టి అక్షరశబ్దము శాశ్వతమే కాని తాత్కాలికము కాదు. అక్షరశబ్దము యొక్క శాశ్వతత్వమును వేదములు ఆమోదించుచున్నవి.

'వాచా నిరూప నిత్యతా' – ఋగ్వేదము

ఒక నిర్ణీత పద్ధతిలో నుండు అక్షరముల పొందికయే మంత్రము. ఇది దేవి యొక్క సూక్ష్మరూపము. శబ్దశక్తి జీవులకు ప్రాణ మొసగును. నిత్యము ఉచ్ఛ్వాస నిశ్వాసములు తీసికొనునపుడు, మనకు తెలియకుండగనే గొప్ప మంత్రము నుచ్చరించుట జరుగును. దీనినే 'అజప మంత్రము' లేక హంసగాయత్రి అందురు. ఎందుచేతననగా యెటువంటి ప్రయత్నము లేకుండ సహజముగా తనకు తాను పదే పదే ఉచ్చరించబడును.

ఈ శబ్దశక్తి (ప్రణవనాదము) అన్ని జీవులలో 'ఎరుక'గను, మానవులో 'కుండలిని'గను ఉన్నది. వ్యక్తము చేయు సంకల్పము అతీతమైనదిగా చెప్పబడుచున్నది. ఇది మూలాధారమందు 'పరావాక్కు'గా ఉన్నది. ఇది ఉద్భవించి స్వాధిష్ఠానస్థాయి చేరుకొనినపుడు 'పశ్యంతి' (అనగా గ్రహించుట) అని పిలువబడుచున్నది. దానికి కొద్దిగా పైనున్న హృదయస్థాయికి చేరుకొనినపుడు 'అనాహత'మని, అంతకు పైని కంఠము దిగువ స్థాయి చేరినపుడు 'మధ్యమా' అని పిలువబడుచున్నది. కంఠస్థాయిలో 'విశుద్ధ'ముగను, చిట్టచివరకు ఉచ్చారణగా బహిర్గతమై వ్యక్తమైనపుడు 'వైఖరీ' యని తెలియుచున్నది.

మంత్రమునందు బీజాక్షరములు నిక్షిప్తమై ఉండుటచేత అనువదింప వీలులేదు. కాబట్టి అనువదించినపుడు, మంత్రము మంత్రముగా ఉండదు. కారణమేమనగా శబ్దము తీరు మారిపోవును.

కొన్ని ఉద్వేగములను సృష్టించుటకు గాని, లేక నశింపజేయుటకు గాని మాటలకు శక్తి కలదని మనమందరము ఎరిగినదే. సామాన్యమైన పరిణామముల కతీతమైన శక్తి మాటలకు కలదు. మనము గ్రహించు సామర్థ్యమునకు మించిన శక్తులు వాటికి కలవు. సాధారణమైన అక్షరశబ్దములు స్థూల స్వభావము కలవి. బీజాక్షరములతో నిక్షిప్తమైన మంత్రములు సూక్ష్మమైనవి. మంత్రములను సరియైన తీరులో ఉచ్చరించినపుడు శబ్దతరంగము లేర్పడును. ఈ శబ్దతరంగములనే మంత్రశక్తి అందురు. ఒక క్రమపద్ధతిలో కొంతకాలము మంత్రమును పఠించినపుడు 'సాధనాశక్తి' ఉద్భవించును. ఆ విధముగా మంత్రమునకు రెండు శక్తులున్నవి. ఒకటి మంత్రశక్తి, రెండవది సాధనాశక్తి. అదేపనిగా కొంతకాలము ఒక పద్ధతి ప్రకారము మంత్రము నుచ్చరించినపుడు సాధనాశక్తి కలుగును. ఈ రెండు శక్తుల సమ్మేళనమును 'మంత్రసాధన' అందురు. అనగా ఈ రెండు శక్తుల సమ్మేళన ఫలితంగా కలుగు శక్తి. అదియే ఆశించు ఫలితము.

మంత్రములు ఏకాక్షరము మొదలుకొని ఒక దేవి లేక దేవత యొక్క సహస్రనామముల వరకు ఉండవచ్చును. నిత్యాతంత్రము ప్రకారము మంత్రములు ఈ క్రింది విధముగా విభజించబడినవి.

– ఒకే ఒక అక్షరము గల ఏకాక్షర మంత్రము. దీనిని 'పిండ' అందురు.
– రెండు అక్షరములు గల మంత్రము. దీని 'కర్తరీ' అందురు.
– 3 నుండి 9 అక్షరములు గల మంత్రములను 'బీజ' మందురు.
– 10 నుండి 20 అక్షరముల గల మంత్రములను 'మంత్ర' మందురు.
– 20 అరములు మించిన మంత్రమును 'మాల' అందురు.

మంత్ర ఏకారాః పిండకాః కర్తర్యో ద్వ్యక్షరా మతాః
వర్ణత్రయం సమారభ్య నవర్ణావధి బీజకాః
తతో దశార్ణమారభ్య యావద్వింశతి మంత్రకాః
తత్ర ఊర్ధ్వాగతాః మాలాః తాసు భేదో న విద్యతే

(నిత్యాతంత్ర)

పులింగ దేవతలకు సంబంధించిన మంత్రములను 'మంత్ర' మనియు, స్త్రీలింగ దేవతలకు (దేవి) సంబంధించిన మంత్రములను 'విద్యా' అనియు అందురు.

పుంద్దైవత్యాః మంత్రాః స్త్రీదైవత్యా విద్యా ఇతి
(సౌభాగ్య భాస్కరం)

క్రమపద్ధతిలో మంత్రము నుచ్చరించకుండుట, అర్ధము తెలియకుండ మంత్రము నుచ్చరించుట కేవలము భౌతిక వ్యాయామమగును. మంత్ర పఠనములో అనేక దశలున్నవి. అవి: ఉపదేశము, సరియైన ఉచ్చారణ, ఉచ్చరించుటకు తగిన సమయము (కాలము), స్థలము, అనుసరించవలసిన ఇతర పద్ధతులు (మార్గములు). ఈ విషయములను అనేక గ్రంథములు విశదపరచి, మంత్రము పఠించుటకు ముందు తీసికొనవలసిన ప్రాథమిక చర్యలను కూడ సూచించెను. ఉదాహరణకు:

ముఖశోధన – అనగా ముఖము శుభ్రపరచుకొనుట
జిహ్వాశోధన – అనగా నాలుక, నోరు శుభ్రపరచుకొనుట

'ఓం'కారమును ఏయే మంత్రములకు ముందు చేర్చవలెను, ఏయే మంత్రములకు వెనుక చేర్చవలెనను విషయమ్మై కొన్ని నిబంధనలు గలవు. మంత్రశాస్త్రమునకు సంబంధించిన వివిధ గ్రంథములు ఇందుకు సంబంధించిన నిబంధనల నేర్పరచెను.

దానము, యజ్ఞము, తపస్సు, వేదవిద్యాభ్యాసము, ధ్యానము, ప్రాణాయామము, అగ్నిహోత్రము, పితృకర్మలు ఇత్యాది వాటికి ముందు ఓంకారము నుచ్చరించవలెనని శాకటాయన స్మృతి తెలుపుచున్నది.

దానయజ్ఞతపస్స్వాధ్యాయ జపాధ్యాన సంధ్యోపాసనా ప్రాణాయామ
హోమదైవ పిత్ర్యమంత్రోచ్చారణ బ్రహ్మారంభాదీని ప్రణవముచ్చార్య ప్రవర్తయేత్
(శాకటాయన స్మృతి)

మంత్రమే దేవత; ఆ రూపములో పరబ్రహ్మము వ్యక్తముకాగా, సాధకుడు మంత్రము నభ్యసించును. సాధకుని అభ్యాసము చేత మంత్రము జాగృతమగును. మంత్రము యొక్క అర్ధము, మంత్రపఠనము వలన కలుగు ప్రయోజనము తెలిసికొనుట చాల అవసరము. ఉదాహరణకు ఓంకారములో అ, ఉ, మ్ అను అక్షరములున్నవి. 'అ' అగ్నిని, 'మ్' చంద్రుని సూచించును. మనకు కావలిసినదాని ననుసరించి, అవసరమైన అక్షరముపై ఎక్కువ ఒత్తిడితో ఉచ్చరించవలసియుండును. అగ్ని అవసరమైనపుడు, 'అ' అక్షరముపై వత్తిడి ఎక్కువగా నుండవలెను. ఇది అగ్నియొక్క నాభిస్థానమైన మణిపూరమునకు చెందినది. సాధకునికి సాంత్వనము లేక శాంతి కావలసియున్నచో, శిరస్సునుండి 'మ్' అక్షరముపై వత్తిడి పెంచి ఉచ్చరించవలెను. అందుచేత ప్రతి మంత్రమునకు తులనాత్మక పరిణామము, ఉచ్చారణ పద్ధతి కలవు. సరియైన గురువు సహాయముతో వీటి నర్థము చేసికొనవచ్చును.

ఏ మంత్రమునందైన ఆరు భాగములుండును. అవి: ఋషి, ఛందస్సు, దేవి లేక దేవత, బీజము, శక్తి, కీలకము.

మంత్రము యొక్క ముఖ్య ప్రయోజనము సాధకుని లేక భక్తుని రక్షణ. కాబట్టి ఈ సందర్భములో అనేక ఉపాంగములు ప్రస్తావించదగినవి.

. కవచము
. అస్త్రము (రక్షణాయుధము)
. వర్మ (వస్త్రము)
. హృదయము

'అ' మొదలు 'క్ష' వరకుగల వర్ణమాలలో అన్నియు మాతృకలే. అవి శాశ్వతమైనందున వాటిని అక్షరములందురు. వాటికి ఆద్యంతములు లేవు. ఏకాగ్రతతో మంత్రము పఠించినపుడు కలుగు ఫలితమును 'మంత్రసిద్ధి' యందురు. సాధకుడు నిరంతరము ఒకేవిధముగా ఏకాగ్రతతో మంత్రపఠనము నభ్యసించినచో మంత్రసిద్ధి పొందగలుగును.

యంత్రము

అన్ని మతములందు అనాదికాలమునుండి నిరాకార పరబ్రహ్మమునకు ఒక రూపకల్పన చేయుట సంప్రదాయముగా ఉన్నది. చిత్రపటములు, విగ్రహములు, చిహ్నములు, క్షేత్రగణిత పటములు ఇందుకొరకు ఉపయోగింపబడుచున్నవి. 'యంత్ర' అను పదము 'యమ్', 'త్రై' అను రెండు ధాతువులనుండి ఏర్పడినది. 'యమ్' ధాతువున కర్థము నియంత్రణము. 'త్రై' ధాతువున కర్థము రక్షించుట. 'యమ్' ధాతువుకు 'గృహ'మను అర్థము కూడ కలదు. కాబట్టి 'యంత్ర' అను పదము నివాసము లేక గృహమును సూచించును. కొన్ని శక్తులతో నిక్షిప్తమైన పరికరము లేక క్షేత్రగణిత పటము. ఇది స్తబ్ధమైన చిత్రపటము కాదు, శక్తిపూర్వకమైన చిత్రపటము. యంత్రము ఒక ఆకారము లేక అంగము. అవసరమున కనుగుణముగా ఒక నిర్ణీత పద్ధతిలో మంత్రములోని శక్తులను నియంత్రించు పటము. మానవలక్షణములు ప్రతిబింబించు దేవి లేక దేవత కంటె సూక్ష్మమైనది, శక్తిమంతమైనది.

సాధకుడు ఆశించిన లక్ష్యమును మంత్రము యంత్రముల ద్వారా సాధించునని తంత్రశాస్త్రము తెలియజేయుచున్నది. యంత్రము ఒక విధమైన ఆకారము లేక శక్తి కావచ్చును. అంతేకాక, వాస్తవము, ప్రతీక, లేక ఆదర్శము కూడ కావచ్చును.

'యమ్' అనునది వాయుతత్త్వమునకు మూలము. వాయుతత్త్వముచే ఏర్పడు శక్తి చలనశక్తి, లేక భవిష్యత్తులో పెరుగు శక్తి (potential energy) కావచ్చును. ఇదియే విశ్వశక్తి లేక ప్రాణము. దీనిని పురస్కరించుకొని యంత్రమను పదము అనేక విధములుగా వర్ణింపబడుచున్నది. దేవతా విగ్రహము భౌతికమైన లేక బాహ్యమైన లక్షణములను సూచించగా, యంత్రము దేవత యొక్క సారమును ప్రతిబింబించు ప్రతీకగా చెప్పబడుచున్నది. సాధారణముగా యంత్రము ద్వారా దేవి లేక దేవతను పూజించుట, విగ్రహము లేక ప్రతిమను పూజించుటకన్న మిన్నగా పరిగణింపబడుచున్నది. విగ్రహము కన్న యంత్రమునకు ఇచ్చే ప్రాధాన్యత, దేవాలయములలో విగ్రహములను ప్రతిష్ఠించునపుడు స్పష్టముగా గోచరించును. విగ్రహము ప్రతిష్ఠించుటకు ముందు యంత్రము నేర్పరచి, దానిపై విగ్రహము ప్రతిష్ఠించెదరు.

సర్వసామాన్యంగా యంత్రములు క్షేత్రగణిత సరళరేఖలు, వృత్తములు, త్రిభుజములు, చతురస్రములు, దీర్ఘచతురస్రములు, పద్మదళములు కలిగియుండును.

యంత్ర చిత్రీకరణలో శక్తిని నిక్షిప్తము చేయు ప్రక్రియను 'మండల' మందురు. ***'మంత్రం లాతి ఇతి మండల'***. మండల మనగా ముఖ్యవివరములను ఒకచోట పొందుపరచుట. ఏకాగ్రతతో దృష్టి లగ్నము

చేయుట కిది యొక పరికరము లేక వాహనము. ఇది శక్తుల సమూహము, మరియు ఫలవంతమైన వివిధ శక్తుల సమాహారమునకు చిహ్నము. ప్రతి యంత్రము ఒక కేంద్రబిందువు కలిగియుండును. సంక్షిప్తముగా దీనిని 'బిందు'వందురు. యంత్రమంతట విస్తరించియున్న శక్తిసారమే బిందువు. అధ్యాత్మికశక్తి యంత్రమునకు మాత్రమే పరిమితము కాకుండ, యంత్రమున కావలనున్న సాధకుని యొద్దకు, అంతకుమించి కూడ విస్తరించి మార్పు చెందుచు, అనేక రెట్లు పెరుగుచు విలీనము చేయునో అదియే బిందువు. ఆ విధముగా బాహ్యాంతరములకు సంబంధించిన ఒక విధమైన విశ్వతత్త్వపు ప్రక్రియ. కొలతల కతీతముగా స్వేచ్ఛను ప్రతిబింబించు ప్రతీక బిందువు. కాబట్టి మండలము లేక యంత్రము కేవలము పటము మాత్రమే కాదు, విశ్వతత్త్వ చిత్రము. ఇది సాధకుని శక్తిని ఉత్తేజపరచి, బాహ్యాంతరములందు మార్గము నిర్దేశించును.

మండల తత్త్వము వివిధ పొరలు, ఆవరణలు గల విశ్వమును ప్రతిబింబించును. మూడుకొలతల (three-dimensional) యంత్రములు, మేరు చక్రము వంటివి కూడ కలవు. మానవశరీరము కూడ మూడుకొలతలు గల చైతన్యమనవచ్చును.

యంత్రము సాధకుని భౌతికశక్తులను నియంత్రించి రక్షించుటలో తోడ్పడుటేగాక, దివ్యశక్తితో విలీనము చేయును. ఇంతకు పూర్వము వివరించినట్లు, యంత్రమను పదములో రెండు అంశములు – నియంత్రణము (యమ్), రక్షణ (త్ర) – గలవు. ఒక విధముగా నియంత్రణే రక్షణ కదా!

తంత్రము

జ్ఞానమును వివరించి విశదీకరించునది తంత్రము. మంత్ర యంత్రములకు సంబంధించిన జ్ఞానము, వాటి నాచరించు విధానము తంత్రము. తంత్రమునందు నాలుగు అంగములు కలవు.

. తత్త్వము (జ్ఞానము)
. ధ్యానము
. క్రియ (వివిధ కర్మకాండలు)
. జీవించు తీరు లేక జీవన విధానము

తంత్రము గుప్తశాస్త్రము. మరియు గ్రాహక కళ.

తంత్రమనగా పూజించు లేక అర్చించు విధానము. 'తం' అనగా విస్తరింపజేయు అని యర్థము. 'త్ర' అనగా రక్షించుట. తంత్రమనగా జ్ఞానమును పెంపొందించు శాస్త్రము.

తన్యతే విస్తార్యతే ఇతి తంత్రః

తంత్రశాస్త్రము మంత్రయంత్రములతో అభ్యసించు విధానములను వివరించును. వామకేశ్వర తంత్రము అరువది నాలుగు వివిధ కౌలతంత్రములను వివరించుచున్నది. కేవలము భౌతికమైన సౌకర్యములను పొందు విధానములను తెలుపుటచేత, కొందరు దీనిని అవైదికమని భావించెదరు.

తంత్రము భౌతికమైనదని సామాన్య అభిప్రాయము. కాని యిది సరియైనది కాదు. తంత్రములు ఎల్లపుడు వైదికాచారములతో పెనవేసికొనియున్నవి. అయితే కట్టుబడియుండుటలోను, ఆచరణలోను కొన్ని భేదములు కలవు. సాధకుల వాంఛల ననుసరించి తంత్రశాస్త్ర సిద్ధాంతము, అభ్యాసము మారుచుండును.

త్రిగుణముల (సత్త్వ రజస్ తమస్) ఆధారంగా తంత్రములు విభజించబడెను. సాత్త్విక తంత్రములను 'తంత్రమని, రాజసిక తంత్రములను 'యామల'మని, తామసిక తంత్రములను 'దామర'లని పిలిచెదరు.

వివిధ తత్త్వసిద్ధాంతముల ఆధారంగా తంత్రశాస్త్రములు కలవు.

. బౌద్ధతంత్రము
. జైనతంత్రము
. శైవతంత్రము
. శాక్తతంత్రము
. వైష్ణవతంత్రము
. గాణాపత్యతంత్రము

శాక్తతంత్రములు మరల మూడుగా విభజించబడెను. అవి: కౌల, సమయ, మిశ్ర తంత్రములు.

కౌలమార్గము తనకు తాను ద్వైత, అద్వైతములు రెండును లేనిదిగా నిర్వచించుకొనెను.

అద్వైతం కేచిదిచ్ఛంతి ద్వైతమిచ్ఛంతి చాపరే
మమ తత్త్వం విజానంతో ద్వైతాద్వైత వివర్జితమ్

వివిధ తత్త్వ సిద్ధాంతముల ఆధారంగా తంత్రములు ఏడు తరగతులుగా విభజించబడెను.

. వేదాచారము
. వైష్ణవాచారము
. శైవాచారము
. సిద్ధాంతాచారము
. కౌలాచారము
. వామాచారము
. దక్షిణాచారము

వామాచారము లేక వామహస్త (ఎడమ) మార్గము ఆనందమార్గముగను, దక్షిణహస్త (కుడి) మార్గము శాంతిమార్గముగను చెప్పబడుచున్నది. దక్షిణాచార వామాచార మార్గములు వరుసగా 'సమయ', 'కౌల', వంశపరంపరలుగా కూడ తెలియుచున్నవి.

తాంత్రిక బోధలలోని మూడు ముఖ్య విషయములు మంత్రము, తంత్రము, యంత్రము. సామాన్యంగా ఈ మూడును కలసియుండును. అయితే ఇందుకు కొన్ని మినహాయింపులు లేకపోలేదు. కొందరు సాధకులు కేవలము మంత్రము పఠించెదరు. వారికి యంత్రజ్ఞానము గాని తంత్రజ్ఞానము గాని ఉండదు. అటులనే ఇందుకు భిన్నముగా అనేకులు యంత్రము నొక అలంకార వస్తువుగా భావించి పూజించుచుందురు. యంత్రమును పూజించునపుడు అనుసరించవలసిన ఆచారములను గాని, మంత్రములను గాని ఎరుగని వారు కూడ కలరు.

తంత్ర సిద్ధాంతమునకు మానవశరీరములోని చక్రనిర్మాణ వ్యవస్థకు సమన్వయ సంబంధము కలదు. మానవ శరీరములో ఆరు కేంద్ర స్థానములు కలవు. ఈ స్థానములను చక్రములందురు.

మూలాధార చక్రము – వెన్నెముక అట్టడుగున
స్వాధిష్ఠాన చక్రము – నాభి దిగువ ప్రాంతము
మణిపూర చక్రము – నాభి చుట్టూ ఉన్న ప్రాంతము
అనాహత చక్రము – హృదయ స్థానము
విశుద్ధ చక్రము – కంఠస్థానము
ఆజ్ఞా చక్రము – కనుబొమల నడుమ

ఆ ఆరు చక్రములు మానవ శరీర నిర్మాణములో భౌతికముగా కలవని భావించరాదు. ఇది చాల ముఖ్యము. అవి కేవలము భావనిర్మితములు. ఈ ఆరు చక్రముల కతీతముగా సహస్రపద్మదళములున్నవి. దీనిని సహస్రార చక్రమందురు. ఇది నాలుగు వ్రేళ్ల వెడల్పులో శిరస్సునందు ఉండును. దీనిని 'నిరాలంబపురీ' అనగా ఎటువంటి ఆలంబన లేని పురము అందురు.

తాంత్రిక అభ్యాసములలో మానవశరీరము యంత్రపూజల మధ్య సమ్మేళన సమన్వయ సంబంధము కలదు.

2 శ్రీచక్రము

శ్రీచక్రమనగా ఏమిటి?

తాంత్రిక కర్మకాండ ప్రకారము త్రిపురసుందరీదేవి పూజ కుపయోగించు క్షేత్రగణిత పటమును శ్రీచక్రమందురు. శక్తిపూజా సంప్రదాయములో దీనికి గొప్ప ప్రాముఖ్యము కలదు. అంతేకాక దివ్యశక్తులు కలదిగా పరిగణించబడుచున్నది. ఈ సంప్రదాయములో త్రిపురసుందరీదేవి విగ్రహము కన్న శ్రీచక్రము అధిక ప్రాధాన్యము కలదిగా భావించబడుచున్నది. అన్ని యంత్రములకన్న శ్రీచక్రము ఉత్తమోత్తమము. శ్రీచక్రమును శ్రీయంత్రమని కూడ అందురు. అయితే ఇది లక్ష్మీదేవి యంత్రముగా తలచి భ్రమించరాదు. శ్రీచక్రమునకు అనేక నామములు కలవు. ఉదాహరణకు నవయోని చక్రము, నవచక్రము, విద్యాచక్రము, శ్రీనగర, మాతృకాచక్రము మొదలైనవి. శ్రీచక్రము త్రిపురసుందరీదేవి నివాసస్థానము మాత్రమే కాదు. ఆమె యొక్క సకల శక్తులకు, వ్యక్తిత్వములకు నిలయము. అనేక తాంత్రిక గ్రంథములు శ్రీచక్రమును పలువిధములుగా వర్ణించెను. శ్రీచక్రము విశ్వమంతటిని ఆవరించియున్నదని భైరవ యామల తంత్రము తెలియజేయుచున్నది.

శ్రీచక్రః త్రిపురసుందర్యాః బ్రహ్మాండాకారమీశ్వరీ

అరుణోపనిషత్తు శ్రీచక్రమును ***'ఇమానుకం భువనాశీషధేవ'*** అని వర్ణించినది. అనగా విశ్వమంతయు శ్రీచక్రములో నిక్షిప్తమైయున్నది.

దేవీ చక్రముల వరుసక్రమము తెలిసిన వారెవరైనను ముక్తి పొందగలరని కామకలావిలాసము తెలియజేయుచున్నది.

ఇతి కామకలా విద్యా దేవీ చక్రమాత్మికా సేయమ్
విదితా యేన స ముక్తో భవతి మహాత్రిపురసుందరీరూపః

శివపార్వతుల శరీరమే శ్రీచక్రమని భైరవయామల తంత్రము ప్రకటించుచున్నది. ***'శ్రీచక్రః శివయోర్వపుః'***

శ్రీచక్రము పరమశక్తి స్వరూపముగా ఆవిర్భవించినట్లు భావించబడుచున్నది. శక్తియందు శివతత్త్వము కూడ కలదు. వారిరువురు పరస్పరము శక్తిమంతము గావించుకొనుచుందురు.

పరస్పర తపస్సంపత్ ఫలాయిత పరస్పరౌ

శబ్దము అర్థము వలె విడదీయరానివారు.

వాగర్థావివ సంపుక్తౌ

ఇది అర్ధనారీశ్వరత్వము. మాటలు వర్ణించలేని అత్యంత ఆత్మీయ సంబంధము. వారి ఐక్యశక్తి మాటల కందనిది, ఏకాత్మగా రూపొందునది.

శ్రీచక్రము మాతృకాచక్రముగా తెలియుచున్నది. ఎందుచేతననగా, ఉచ్చరించబడు వాక్కు, నాదము, అక్షరము, 'అ' నుండి 'క్ష' వరకు మొత్తము వర్ణమాలలను సూచించును.

వర్ణమాలలో మొదటి అక్షరము 'అ', చివరి అక్షరము 'హ'. ఈ రెండింటిని కలిపి ఉచ్చరించినచో 'అహం' అనగా 'నేను', అహం సాధకుడు పొందే శివశక్త్యాత్మానుభవమును సూచించును.

అతోఽకారహకారాభ్యామ్ అహమిత్యపృథక్తయా
ప్రపంచం శివశక్తిభ్యాం క్రోడీకృత్య ప్రకాశతే
(మాతృకాచక్ర సంబోధ)

త్రిపురసుందరికి సంబంధించిన మూడు విషయములను తెలిసికొనవలెనని యోగినీ హృదయము తెలుపుచున్నది. ఈ మూడు విషయములు ఏవనగా: (1) చక్రము (2) మంత్రము (3) పూజ. అనగా యంత్ర మంత్ర తంత్రములు.

చక్ర సంకేతకో మంత్రపూజాసంకేతకౌ తథా
త్రివిధః త్రిపురాదేవ్యాః సంకేతః పరమేశ్వరి

శ్రీచక్రమునందున్న రెండు పదములలో ఒకటి 'శ్రీ', రెండవది 'చక్ర'. 'శ్రీ' అను పదమునకు అనేకార్థములు కలవు. సంపద, తేజస్సు, కీర్తి, మంగళము, శుద్ధము, పవిత్రము, మూల ప్రకృతి, పరబ్రహ్మము మొదలైనవి. 'చక్ర' అను పదము మహాత్రిపురసుందరీ యంత్రమును తెలుపును. మరియు నిది సృష్టి స్థితి లయములను; సత్త్వరజస్తమో గుణములను; భూతభవిష్యద్వర్తమానములను; జ్ఞాతృ, జ్ఞానము, జ్ఞేయములను సూచించును. బ్రహ్మాండపిండాడములు రెండింటికి చిహ్నము. బ్రహ్మాండములో జాగ్రత్ స్వప్నసుషుప్తులను, పిండాండములో శిరస్సు హృదయము మూలాధారములను సూచించును. శ్రీచక్రము బహు సుందరమైన లలిత, రాజరాజేశ్వరి, త్రిపురసుందరి అనే ముగ్గురి పరిధులను కూడ సూచించును.

శ్రీచక్ర స్వరూపము

శ్రీచక్రమునందు తొమ్మిది ఆవరణములు కలవు. వీటిని నవావరణములందురు. దీనిని త్రిపురసుందరీదేవి నివాసభవనముగా భావించెదరు. శ్రీచక్రములోని నవావరణములను రెండు విధములుగా వర్ణించవచ్చును. ఒకటి: లోపలనున్న బిందువుతో ఆరంభించి బయటనున్న చదరపు ఆవరణమువైపు అవరోహణ క్రమములో సాగివెళ్ళుట. రెండవది: బయటనున్న చదరపు ఆవరణముతో ప్రారంభించి లోపలనున్న కేంద్రబిందువువైపు ఆరోహణ క్రమములో సాగిపోవుట. ప్రతి ఆవరణమునకు ఒక ఆకారము, నామము కలవు. ఆవరణములన్నిటికి నామములు, ఆకారములు, అధిష్ఠాన దేవతలు, సేవికలు, పూజాక్రమము, ప్రకృతి, బీజము, స్వభావము, తత్త్వము, స్థాయి, భావోద్వేగములు, రసము, అక్షరము ఉన్నవి. ప్రతి ఆవరణము గర్భగృహమునకు చేయు ప్రయాణములో ఒకొక్క మెట్టుగా పరిగణించబడుచున్నది.

శ్రీచక్రములో అన్నిటికన్న బయటగల ఆవరణము మొదటిది. దీనిని 'భూపుర'మందురు. ఇందు మూడు దీర్ఘచతురస్ర ద్వారములు కలవు. వాటియందు మూడు వృత్తములు (ఒకదానిలో నొకటి) కలవు. దీనిని త్రివలయము లేక వృత్తత్రయమందురు. వృత్తత్రయములో షోడశదళపద్మము, దానియందు అష్టదళపద్మము ఉన్నవి.

దీనియందు అనేక త్రిభుజములు ఉన్నవి. ఇవి శ్రీచక్రమునకు హృదయము. త్రిభుజములు మొత్తము నలుబది మూడు. రెండు సమరేఖలుగల నాలుగు త్రికోణములు పరస్పరము ఖండించుకొనుటవలన ఈ నలుబది మూడు త్రిభుజము లేర్పడినవి. వీటి శిఖరములు ఊర్ధ్వముఖము – శివ వర్గము. ఇవికాక అష్టదళపద్మములో సమరేఖలుగల ఐదు త్రిభుజములు అధోముఖముకలిగి యున్నవి.

వీటన్నిటి గమ్యము కేంద్రబిందువు, చక్రము మధ్యలో నుండును.
శ్రీచక్రమునకు నిర్వచనము ఆదిశంకరులవారి సుప్రసిద్ధ రచన సౌందర్యలహరియందు పదునొకండవ శ్లోకములో చూడవచ్చును.

చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః
చతుశ్చత్వారింశద్వసుదలకలాశ్రత్రివలయః
త్రిరేఖాభిః సార్ధం తవ శరణకోణాః పరిణతాః

త్రిపురతాపిన్యుపనిషత్తు నవావరణములను తెలుపుచు, ఈ క్రింది వానితో శ్రీచక్రము నిక్షిప్తమైయున్నట్లు నిర్వచించుచున్నది.

బిందుత్రికోణ వసుకోణ దశారయుగ్మ
మన్వస్రనాగదళ షోడశపత్రయుక్తమ్
వృత్తత్రయం చ ధరణీసదనత్రయం చ
శ్రీచక్రరాజ ఉదితః పరదేవతాయాః

ఇదేవిధముగా గౌడపాదాచార్యులవారి శుభగోదయము, రుద్రయామలతంత్రము, వామకేశ్వరతంత్రము మొదలైనవి శ్రీచక్రమును, అందులోని నవావరణములను వర్ణించి చెప్పెను.

అంకెలు 3, 9 శ్రీచక్రములో చాల ప్రాముఖ్యము గలవి. శ్రీచక్రములో ఉన్నటువంటి ప్రతీకలు మూడు రెట్లు, తొమ్మిది రెట్లు అని యోగినీ హృదయము తెలుపుచున్నది. త్రిభుజమందు త్రికోణములు కలవు. త్రిపురసుందరీదేవి సుందరమైనది, మూడు క్షేత్రములకు దేవత. త్రిభుజముల మొత్తము నలుబది నాలుగుగా లెక్కించినపుడు, చక్రము మధ్యనున్న బిందువు కూడ త్రిభుజముగా పరిగణించబడుచున్నది. బిందువును మినహాయించినచో, త్రిభుజములు నలుబది మూడు.

. 14 త్రిభుజములు
. 2x 10 త్రిభుజములు
. 8 త్రిభుజములు
. 1 త్రిభుజము
మొత్తము 43 త్రిభుజములు.

తొమ్మిది ఆవరణములు ఏవనగా:

1. చతురస్రము – భూపురము
2. పదహారు దళముల పద్మము – షోడశదళపద్మము

3. ఎనిమిది దళముల పద్మము – అష్టదళపద్మము
4. 14 త్రిభుజములు – చతుర్దశారము (పదునాల్గురు మనువులు, అందుచే మన్వస్రము)
5. బాహ్యములోని 10 త్రిభుజములు – బహిర్దశారము
6. లోపలి 10 త్రిభుజములు – అంతర్దశారము
7. 8 త్రిభుజములు – అష్టకోణ లేక వసుకోణ
8. 1 త్రిభుజము – త్రికోణము
9. బిందువు – కేంద్రబిందువు

మరియు ఒక వృత్తము. అందులో వృత్తత్రయము (ఒకదానిలో నొకటి). ఇవి బాహ్యచతురస్రము షోడశదళపద్మము మధ్య నుండును. శ్లోకములలో ఇది ఆవరణగా చెప్పబడుచున్నను, లెక్కింపబడుట లేదు.

శైవత్రిభుజవములు (ఊర్ధ్వ శిఖరవముగల నాలుగు త్రిభుజవములు), శక్తిత్రిభుజవములను (అధశ్శిఖరముగల ఐదు త్రిభుజములు) ఖండించుచున్నవని సామాన్యముగా అందరు అంగీకరించినప్పటికి, మొత్తము తొమ్మిది త్రిభుజములు శక్తికి ప్రతీకగా కలవను అభిప్రాయము కలదు. మరొక అభిప్రాయము: తొమ్మిది త్రిభుజములు మూల ప్రకృతినే సూచించును. అనగా నిరాకార శివము యొక్క ప్రాథమిక లక్షణములు.

శ్రీచక్రవము అనేక రకవములు. అవి రేఖలు లేక చిహ్నావములు. రేఖలు ఒకే తలవము (one domension) గలవి. చిహ్నాములు మూడు తలములతో (three dimensional) ఉండునవి. రేఖలుగల శ్రీచక్రము చిత్రించబడును లేక చెక్కబడును (engrave). ఒకొక్కపుడు వివిధ ఆవరణములు వివిధరంగులలో చూపించబడును. రంగులు గ్రంథములలో సూచించబడెను. లోహముతో చేయబడిన చక్రములకు రంగులు ఉండవు.

శ్రీచక్రమును మరొక విధముగా కూడ చూపించవచ్చును. దీనిని కైలాసప్రస్తారమందురు. మాతృకలు, బీజాక్షరములు ఆవరణలో వ్రాయబడును.

3 నవావరణలు

నవావరణలు

శ్రీచక్రము, నవావరణలు తాంత్రిక గ్రంథములలో విపులముగా వర్ణించబడెను. అరుణోపనిషత్తు ఈ విధముగా నిర్వచించుచున్నది.

బిందుత్రికోణవసుకోణదశారయుగ్మ
మన్వస్రనాగదళషోడశపత్రయుక్తమ్
వృత్తత్రయం చ ధరణీసదనత్రయం చ
శ్రీచక్రరాజ ఉదితః పరదేవతాయాః

దేవి (మాతృదేవత) యొక్క శ్రీచక్రములో పేర్కొనబడినవి.

. బిందువు
. త్రికోణము
. అష్టకోణము లేక వసుకోణము (అష్టవసువులకు సూచకము)
. రెండు దశారములు – బహిర్దశారము, అంతర్దశారము (ఒకొక్కదానియందు 10 కోణములు)
. చతుర్దశారము – 14 కోణములు (14 మనువులకు సూచకము)
. అష్టదళపద్మము – ఎనిమిది పద్మదళములు గల ఆవరణ
. షోడశదళపద్మము– పదహారు పద్మదళములు గల ఆవరణ
. వృత్తత్రయము, చతురస్ర త్రయము గల ఆవరణ

ఈ తొమ్మిది చక్రములు శ్రీచక్రములో నున్నవి. చక్రమనగా వృత్తాకారము గలది అని సామాన్యముగా భావించు అర్థము ఇచట వర్తించదు. చక్రమనగా ఆవరణ (enclosure) . బయటనుండి లోపలివరకు గల ఒకొక్క ఆవరణయొక్క లక్షణములు, గుణములు, అధిదేవతలు, తత్సంబంధిత మంత్రములు, సేవికలు (attending deities) , వర్ణము (రంగు), వాటియొక్క ప్రాముఖ్యమును తెలిసికొనుటకు ఉపక్రమించుదము.

ప్రథమ ఆవరణ – భూపుర – త్రైలోక్యమోహన చక్రము

చతురస్రాకారములోనున్న ఈ చక్రమును 'భూపుర'మందురు. అనగా భూ విస్తారమును తెలుపునది. ఈ చక్రములో సమస్తము ఉన్నందున (సకల సృష్టి భూమియందు ఉన్నట్లు), భూపురనామము తగియున్నది. ఈ చక్రము మూడు రేఖలతో మూడుగా విభజించబడెను. మూడు అవస్థలందు భ్రమను కలిగించుటచే, ఈ చక్రము త్రైలోక్యమోహన చక్రమని పిలువబడుచున్నది. అధిదేవత త్రిపురా. ప్రకట యోగినులు ఈమె సేవికలు, అనగా వ్యక్తమగువారు. ఈ చతురస్రాకార చక్రములో మూడు రేఖలు ఒకదానిలో నొకటి ఉన్నవి. అన్ని శ్రీచక్రములందు నాలుగువైపుల నాలుగు ద్వారములుండును.

చతురస్రములోని మూడు రేఖలకు మూడు రంగులు కలవు. ఇవి వరుసగా బయటినుండి లోపలకు తెలుపు, ఎరుపు (రక్తవర్ణము), పసుపు వర్ణములు (రంగులు). చతురస్రములోని మొదటి రేఖ ప్రథమ భూపురము. శ్వేతవర్ణములోని (తెలుపు) ఈ రేఖయొక్క అధిదేవతలను పది సిద్ధిదేవత లందురు. బయటినుండి రెండవ రేఖ రక్తవర్ణము కలది. దీనికి సంబంధించిన ఎనిమిది అధిదేవతలను మాతృకలందురు. మూడవ రేఖ పసుపు వర్ణము గలది. ఇది అధికారముద్ర గల పది స్త్రీ దేవతలను సూచించును. వీరు పది దిక్పాలకులను నిగ్రహించుచుందురు. ఈ ఆవరణయొక్క వైశాల్యము షోడశదళపద్మమునకు పైనున్న వృత్తత్రయము వరకు విస్తరించియుండును. చతురస్రముయొక్క నాలుగు ద్వారములు నాలుగు దిక్కులను – తూర్పు, దక్షిణము, పశ్చిమము, ఉత్తరము – సూచించును. ఒకొక్కపుడు ఊర్ధ్వ, అధో దిక్కులు కూడ చేర్చబడును.


- తూర్పు దిక్కు – భువనేశ్వరీ (మంత్ర యోగము)
- దక్షిణ దిక్కు – దక్షిణ కాళి (భక్తి యోగము)
- పశ్చిమ దిక్కు – కుబ్జిక (కర్మ యోగము)
- ఉత్తర దిక్కు – గుహ్యకాళి (జ్ఞాన యోగము)

ఊర్ధ్వ అధో దిక్కులను కూడ పరిగణించిన యెడల, అవి వరుసగా తార (శబ్ద యోగము), బాలమహాత్రిపురసుందరీ (మోక్షయోగము) లను తెలుపును. ఈ ఆరును మానవశరీరములోని ఆరు చక్రములకు సరిసమానముగా ఉండును. ఈ చక్రము యొక్క ప్రాథమిక లక్షణము పృథ్వి అనగా భూమి, స్వభావము 'ల'. శ్రీచక్రములోని మొదటి మూడు ఆవరణలు సృష్టిని సూచించును. మొదటి ఆవరణ సృష్టి మొదటి భాగము, అనగా ఆవిర్భావమును సూచించును. ఈ చక్రము భౌతిక సిద్ధాంతవాదమును (చార్వాక దర్శనము) తెలుపుచున్నదని కొందరి అభిప్రాయము. ఎందుచేతననగా ఇది బాహ్యమైన ప్రాపంచిక దృష్టి కలిగియుండుటచేత. ఈ చక్రము కుడినుండి ఎడమవైపుకు (గడియారములో ముల్లులు తిరిగే క్రమము) పూజింపబడును. ఈ ఆవరణ యొక్క వివరములు చిత్రపటము, పట్టికలలో చూపబడినవి.

పట్టిక – 1 ప్రథమ ఆవరణ – భూపుర – త్రైలోక్యమోహన చక్రము – ప్రథమ రేఖ

క్రమసంఖ్య	అధిదేవత	స్థాయీ భావములు	రసములు	బీజాక్షరములు	పూజించబడు చక్రమ
1.	అణిమసిద్ధి	రతి	శృంగార	అం	త్రైలోక్యమోహన
2.	లఘిమసిద్ధి	ఉత్సాహ	వీర	లం	సర్వాశాపరిపూరక
3.	మహిమసిద్ధి	శోక	కరుణ	మం	సర్వసంక్షోభణ
4.	ఈశిత్వసిద్ధి	భయ	భయానక	ఈం	సర్వసౌభాగ్యదాయిక
5.	వశిత్వసిద్ధి	జుగుప్స	బీభత్స	వం	సర్వార్థసాధిక
6.	ప్రాకామ్యసిద్ధి	క్రోధ	రౌద్ర	పం	సర్వరక్షాకర
7.	భుక్తిసిద్ధి	హాస	హాస్య	భూం	సర్వరోగహర
8.	ఇచ్ఛాసిద్ధి	విస్మయ	అద్భుత	ఈం	సర్వసిద్ధిప్రద
9.	ప్రాప్తిసిద్ధి	శమ	శాంత	ఫం	సర్వానందమయి
10.	సర్వకామసిద్ధి	నవ	నవరస	సం	మహావజ్ర

త్రైలోక్యమోహన చక్రము



పట్టిక – 2 ప్రథమ ఆవరణ – భూపుర – త్రైలోక్యమోహన చక్రము – ద్వితీయ రేఖ

క్రమ సంఖ్య	మాతృదేవతలు	వ్యక్తిత్వ లక్షణములు	బీజాక్షరములు
1.	బ్రాహ్మి	కామ	అం
2.	మాహేశ్వరి	క్రోధ	ఈం
3.	కౌమారి	లోభ	ఊం
4.	వైష్ణవి	మోహ	ఋం
5.	వారాహి	మద	ౡం
6.	మాహేంద్రి	మాత్సర్య	ఏం
7.	చాముండా	పాప	ఔం
8.	మహాలక్ష్మి	పుణ్య	అః

పట్టిక –3 ప్రథమ ఆవరణ – భూపుర – త్రైలోక్యమోహన చక్రము – తృతీయ రేఖ

క్రమసంఖ్య	ముద్రాశక్తులు	దిక్కులు	స్థలము	బీజాక్షరములు
1.	సర్వసంక్షోభిణి	పూర్వ	అకుల	ద్రాం
2.	సర్వవిద్రావిణి	దక్షిణ	మూలాధార	ద్రీం
3.	సర్వాకర్షిణి	పశ్చిమ	స్వాధిష్ఠాన	క్లీం
4.	సర్వవశంకరి	ఉత్తర	మణిపుర	బ్లూం
5.	సర్వోన్మాదిని	ఆగ్నేయ	అనాహత	సః
6.	సర్వమహాంకుశ	నైఋతి	విశుద్ధ	క్రోం
7.	సర్వఖేచరి	వాయవ్య	లంబిక	హ్స్ఫ్రేం
8.	సర్వబీజ	ఈశాన్య	ఆజ్ఞా	హ్సౌః
9.	సర్వయోని	ఊర్ధ్వ	బిందు	ఏం
10.	సర్వత్రిఖండ	అధః	సహస్రార	హ్శ్రీం, హ్స్క్లీం, హ్స్రౌః

ద్వితీయ ఆవరణము – సర్వాశాపరిపూరక చక్రము

ద్వితీయ చక్రమును సర్వాశాపరిపూరక చక్రమందురు. ఈ చక్రము సాధకుని కోరిక లన్నిటిని నెరవేర్చును. అధిదేవత త్రిపురేశి. ఆమె సేవికలు గుప్తయోగినులు, అనగా అవ్యక్తముగా నుండువారు. షోడశదళపద్మములతో శ్వేతవర్ణములో ఈ చక్రము ఉన్నది.

షోడశదళములు చంద్రుని షోడశకళలకు ప్రతీకలు. సామాన్యముగా చెప్పబడు పదిహేను కళలకు అదనముగా సచ్చిదానంద రూపమును చేర్చినపుడు షోడశకళలుగా తెలియును. షోడశదళములకు పైనున్న వృత్తత్రయము ఆవరణగా గణించబడదు. శ్రీవిద్య యొక్క మూడు సిద్ధాంతములు ఈ మూడు వృత్తములను

వేర్వేరుగా పరిగణించుచున్నవి. హయగ్రీవ సంప్రదాయము వాటియొక్క ఉనికిని గుర్తించుట లేదు. ఆనందభైరవి సంప్రదాయము వాటియొక్క ఉనికిని గుర్తించినప్పటికి, కర్మకాండలో వాటి స్థానమును విస్మరించుచున్నది. దక్షిణామూర్తి సంప్రదాయము మాత్రము వాటియొక్క ఉనికిని భౌతికముగా కర్మకాండయందు అంగీకరించుచున్నది.


షోడశదళములు షోడశ ఆకర్షక శక్తులను సూచించును. ఈ క్రింది పట్టికలో తూర్పునుండి అప్రదక్షిణముగా షోడశదళములు చూపబడినవి.

1. కోరిక	2. బుద్ధి	3. అహంకారము	4. శబ్దము
5. స్పర్శ	6. రూపము	7. రుచి	8. వాసన
9. మనస్సు	10. ధైర్యము	11. స్మృతి	12. నామము
13. బీజము	14. ఆత్మ	15. అమృతత్వము	16. శరీరము

షోడశదళములలోని ఆకర్షక శక్తులను రెండు తరగతులుగా – నిత్యా, కళా – విభజించు సిద్ధాంతవాద మొకటి కలదు. షోడశదళములు 'అ' నుండి 'అః' వరకు గల అచ్చులను (vowels) సూచించును.

ఈ చక్రముయొక్క స్వభావము 'స'. ఈ ఆవరణ బౌద్ధమతమును సూచించునదిగా తెలియుచున్నది. మరియు సృష్టిలోని రెండవభాగమైన 'స్థితి'కి ప్రతీకగా ఉన్నది. కొన్ని శ్రీచక్ర పటములలో ఈ ఆవరణమందు దళముల మధ్య విరామములు (gaps) గోచరించును. ఈ విరామములను 'కేసరదలద్వయమధ్యావకాశ'మను సాంకేతిక నామముతో పిలిచెదరు. ఇది హాని కలిగించునని కొందరి అభిప్రాయము. ఈ చక్రముయొక్క పూజ అప్రదక్షిణముగా చేయబడును. ఆవరణ వివరములు పటమునందు పట్టికయందు చూపించబడెను.

సర్వాశాపరిపూరక చక్రము



పట్టిక – 4: ద్వితీయ ఆవరణ – షోడశదళపద్మచక్రము – సర్వాశాపరిపూరక చక్రము


క్రమసంఖ్య	ఆకర్షించు అధిదేవతలు	నిత్యా	లక్ష్యము	బీజాక్షరములు
1	కామాకర్షిణి	కామేశ్వరి	మనస్సు–కోరిక	అం
2	బుద్ధ్యాకర్షిణి	భగమాలిని	బుద్ధి	ఆం
3	అహంకారాకర్షిణి	నిత్యక్లిన్న	అహంకారము	ఇం
4	శబ్దాకర్షిణి	భేరుండ	శబ్దము	ఈం
5	స్పర్శాకర్షిణి	వహ్నివాసిని	స్పర్శ	ఉం
6	రూపాకరిణి	మహావజ్రేశ్వరి	రూప	ఊం
7	రసాకర్షిణి	శివదూతి	రుచి(రస)	ఋం
8	గంధాకరిణి	త్వరిత	వాసన (గంధ)	ౠం
9	చిత్తాకరిణి	కులసుందరి	చిత్త(మనస్సు)	ఌం
10	ధైర్యాకర్షిణి	నిత్య	ధైర్య	ౡం
11	స్మృత్యాకర్షిణి	నీలపతాక	స్మృతి	ఎం
12	నామాకర్షిణి	విజయ	నామ	ఏం
13	బీజాకర్షిణీ	సర్వమంగళ	వార్ధక్య	ఓం
14	ఆత్మాకర్షిణి	జ్వాలామాలిని	సూక్ష్మశరీర	ఔం
15	అమృతాకర్షిణి	చిత్ర	అమృతత్వ	అం
16	శరీరాకర్షిణి	మహా	స్థూలశరీర	అః

తృతీయావరణము – సర్వసంక్షోభణ చక్రము

తృతీయావరణము సర్వసంక్షోభణ చక్రమని పిలువబడుచున్నది, అనగా సర్వత్ర అలజడి కలిగించునది. అష్టదళపద్మములుకల ఈ చక్రమునకు అధిదేవత త్రిపురసుందరీ. సేవికలు గుప్తతర యోగినులు. చక్రము జపాకుసుమ వర్ణములో (గాఢమైన ఎరుపు) ఉండును.

చక్రము స్వభావము 'హ'. అష్టదళములు ఎనిమిది మానసిక శక్తులకు ప్రతీకలు, భౌతికమైనవి కావు. ఈ ఆవరణ సృష్టి ప్రక్రియలో చివరిదైన సంహారమును సూచించును. ఈ ఆవరణ గాణాపత్య సిద్ధాంతమును తెలుపుచున్నది. అష్టదళములు 'క' నుండి ప్రారంభమగు హల్లులకు (consonants) ప్రతీకలు. చక్రముయొక్క పూజ ప్రదక్షిణముగా చేయబడును. ఆవరణ వివరములు పటమునందు పట్టికయందు చూపబడెను.

సర్వసంక్షోభణ చక్రము



పట్టిక – 5: తృతీయావరణము – అష్టదళపద్మము – సర్వసంక్షోభణ చక్రము


క్రమసంఖ్య	మానసిక శక్తుల అధిదేవతలు	లక్ష్యములు	బీజాక్షరములు
1	అనంగకుసుమ	వచన	కం ఖం గం ఘం ఙం
2	అనంగమేఖలా	ఆదాన	చం ఛం జం ఝం ఞం
3	అనంగమదన	గమన	టం ఠం డం ఢం ణం
4	అనంగమదనాతుర	విసర్గ	తం థం దం ధం నం
5	అనంగరేఖా	ఆనంద	పం ఫం బం భం మం
6	అనంగవేగినీ	హాన	యం రం లం వం
7	అనంగాంకుశ	ఉపాదాన	సం శం షం హం
8	అనంగమాలినీ	ఉపేక్షా	ళం క్షం

చతుర్థావరణము – సర్వసౌభాగ్యదాయక చక్రము

చతుర్థావరణ సర్వసౌభాగ్యదాయక చక్రమని పిలువబడుచున్నది. సమస్త సంపదలను సకల మంగళములను ప్రసాదించు ఈ చక్రమునకు అధిదేవత త్రిపురవాసిని. సంప్రదాయ యోగినులు సేవికలు. దాడిమపుష్పవర్ణములోనున్న ఈ ఆవరణమందు పదునాలుగు త్రిభుజములు కలవు. అందుచే చతుర్దశారమని లేక పదనాలుగు మనువులకు సూచకముగా మన్వస్రమని పిలువబడుచున్నది. ఈ పదునాలుగు త్రిభుజములు పదునాలుగు భువనములను – ఏడు ఊర్ధ్వ లోకములు, ఏడు అధో లోకములు – సూచించును. అంతేకాక శరీరములోని ముఖ్యమైన పదునాలుగు నాడులను కూడ సూచించును.

ఈ చక్రము స్వభావము 'ఐ'. ఈ ఆవరణ 'స్థితి' మొదటి భాగమును, సాంఖ్యతత్త్వ ప్రాముఖ్యమును తెలుపుచున్నది. పదునాలుగు కోణములు మొదటి పదునాలుగు హల్లులను సూచించును. చక్రము పూజ అప్రదక్షిణముగా చేయబడును. ఆవరణ వివరములు పటమునందు పట్టికయందు చూపబడెను.

సర్వసౌభాగ్యదాయక చక్రము



పట్టిక – 6: చతుర్ధావరణ – చతుర్దశార – సర్వసౌభాగ్యదాయక చక్రము


క్రమసంఖ్య	అధిదేవతలు	నాడులు	ఇంద్రియములు	బీజాక్షరములు
1	సర్వసంక్షోభిణి	అలంబుష	వాక్కు	కం
2	సర్వవిద్రావిణి	కుహూ	పాణి	ఖం
3	సర్వాకర్షిణి	విశ్వోదరి	పాద	గం
4	సర్వాహ్లాదిని	వరుణ	పాయు	ఘం
5	సర్వసమ్మోహిని	హస్తిజిహ్వా	ఉపస్థ	ఙం
6	సర్వస్తంభిని	యశోవతి	శ్రోత్ర	చం
7	సర్వజృంభిణి	పయస్విని	త్వక్	ఛం
8	సర్వవశంకరి	గాంధారి	చక్షు	జం
9	సర్వరంజని	పూషా	జిహ్వా	ఝం
10	సర్వోన్మాదిని	శంఖిని	నాసికా	ఞం
11	సర్వార్థసాధిని	సరస్వతి	మనస్సు	టం
12	సర్వసంపత్తిపూరణి	ఇడా	బుద్ధి	ఠం
13	సర్వమంత్రమయి	పింగళా	చిత్త	డం
14	సర్వద్వంద్వక్షయకరి	సుషుమ్నా	అహంకార	ఢం

పంచమావరణము – బహిర్దశార – సర్వార్థసాధక చక్రము

పంచమావరణమును బహిర్దశారచక్రమందురు. బాహ్యమందున్న పది త్రిభుజములు సమస్తమును సాధించగలుగుటచే ఈ చక్రమునకు సర్వార్థసాధక నామము సార్థకముగా నున్నది. ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థములను సిద్ధింపజేయు ఈ చక్రమునకు అధిదేవత త్రిపురశ్రీ. సేవికలు ఇంద్రియముల కతీతమైన కులోత్తీర్ణయోగినులు. సిందూరవర్ణముగల ఈ చక్రమందు దశత్రిభుజములు నారాయణుని దశావతారములను సూచించును.

చక్రము స్వభావము 'ఇ'. అప్రదక్షిణముగా పూజ చేయబడును. ఈ చక్రము సృష్టిలోని రెండవదశ 'స్థితి'ని, అనగా వేదాంతతత్త్వమును తెలియజేయుచున్నది. ఆవరణ వివరములు పటమునందు, పట్టికయందు చూపబడెను.

సర్వార్థ సాధక చక్రము




పట్టిక –7: పంచమావరణము – బహిర్దశార చక్రము – సర్వార్థసాధక చక్రము

క్రమసంఖ్య	మంగళకర దేవతలు	అవతారము	బీజాక్షరములు
1	సర్వసిద్ధిప్రద	మత్స్య	ఞం
2	సర్వసంపత్ప్రద	కూర్మ	తం
3	సర్వప్రియంకరి	వరాహ	థం
4	సర్వమంగళకారిణి	నరసింహ	దం
5	సర్వకామప్రద	వామన	ధం
6	సర్వదుఃఖవిమోచని	పరశురామ	నం
7	సర్వమృత్యుప్రశమని	రామ	పం
8	సర్వవిఘ్ననివారిణి	బలరామ	ఫం
9	సర్వాంగసుందరి	కృష్ణ	బం
10	సర్వసౌభాగ్యదాయిని	కల్కి	భం

షష్ఠావరణము – అంతర్దశారము – సర్వరక్షాకర చక్రము

షష్ఠావరణములో దశత్రిభుజములు లోపల ఉన్నందున, అంతర్దశార చక్రమని పిలువబడుచున్నది. సర్వరక్షణశక్తులు కలిగియున్న ఈ సర్వరక్షాకర చక్రమునకు అధిదేవక త్రిపురమాలిని, ఈమె సేవికలు నిగర్భయోగినులు. ఈ ఆవరణము గులాబివర్ణము కలది. దశ కోణములు అగ్నియొక్క పది భాగములను సూచించును. అగ్ని దశభాగములు మానవ శరీరములోని దశేంద్రియములను (ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు) సూచించును. ఈ చక్రము స్వభావము 'ర', మరియు సౌర్య సిద్ధాంతతత్త్వమును సూచించును. దశాగ్నుల పూజ అప్రదక్షిణముగా చేయబడును. ఆవరణ వివరములు పటమునందు పట్టికలోను చూపబడెను.

సర్వరక్షాకర చక్రము



పట్టిక 8: షష్ఠావరణము – అంతర్దశార చక్రము – సర్వరక్షాకర చక్రము


క్రమసంఖ్య	అధిదేవతలు	దశప్రాణములు	దశాగ్నులు	ఇంద్రియములు	క్రియ	బీజాక్షరములు
1	సర్వజ్ఞ	ప్రాణ	రేచక	త్వక్	నిర్మూలన	మం
2	సర్వశక్తిప్రద	అపాన	పాచక	చక్షు	జీర్ణించుట	యం
3	సర్వైశ్వర్యప్రద	వ్యాన	శోషక	శ్రోత్ర	దోషనిర్మూలన	రం
4	సర్వజ్ఞానమయి	ఉదాన	దాహక	జిహ్వా	దహించు	లం
5	సర్వవ్యాధివినాశిని	సమాన	ప్లావక	ఘ్రాణ	రసాయనముల విసర్జన	వం
6	సర్వాధారస్వరూప	నాగ	క్షారక	వాక్	పిత్త విసర్జన	శం
7	సర్వపాపహర	కూర్మ	ఉద్ధారక	పాణి	నములుట	షం
8	సర్వానందమయి	కృకర	క్షోభక	పాద	అలజడి కల్గించు	సం
9	సర్వరక్షాస్వరూపిణి	దేవదత్త	జృంభక	పాయు	ఆవలించు	హం
10	సర్వేప్సిత ఫలప్రద	ధనంజయ	మోహక	ఉపస్థ	మూర్ఛిల్లుట	క్షం

సప్తమావరణము – సర్వరోగహర చక్రము

సప్తమావరణము సర్వరోగహరచక్రముగా చెప్పబడుచున్నది. సకల రోగములను నిర్మూలించు ఈ చక్రమునకు అధిదేవత త్రిపురసిద్ధి. సేవికలు రహస్య యోగినులు. గులాబివర్ణములో నుండు ఈ ఆవరణ అష్టత్రిభుజములతో కూడియున్నది. అష్టారచక్రము, అష్టకోణ లేక వసుకోణ చక్రమని కూడ పిలువబడుచున్నది. అష్టకోణములు అష్టవసువులను సూచించును. అష్టకోణములు అష్ట వాగ్దేవతలకు ప్రతీకలు. ఈ చక్రము పంచభూతములు, మనస్సు, బుద్ధి, అహంకారములను (మొత్తము ఎనిమిది) కూడ సూచించును.

చక్రము స్వభావము 'క'. ఈ ఆవరణ సంహార ప్రక్రియలో మొదటి దశను సూచించును. వైష్ణవతత్త్వమును తెలుపుచున్న ఈ చక్రము నుపాసించు సాధకుడు సుఖదుఃఖాదుల కతీతముగా ఎదుగును. ప్రదక్షిణ దిశగా చక్రము యొక్క పూజ చేయబడును. ఆవరణ వివరములు పటమునందు పట్టికలోను చూపబడెను.

సర్వరోగహర చక్రము



పట్టిక –9: సప్తమావరణము – అష్టకోణ – సర్వరోగహరచక్రము

క్రమసంఖ్య	సంబంధిత దేవతలు	యజమాని	బీజాక్షరములు
1	వశిని	శీతలము	అ నుండి అః
2	కామేశ్వరి	ఉష్ణము	కం
3	మోదిని	మోదము	చం
4	విమలా	బాధ	టం
5	అరుణా	కామము	తం
6	జయిని	విజ్ఞత	పం
7	సర్వేశ్వరి	క్రియాశీలత	యం
8	కౌలిని	జడత్వము	శ నుండి క్ష


అష్టమావరణము – సర్వసిద్ధిప్రదాయక చక్రము

అష్టమ ఆవరణము సర్వసిద్ధిప్రదాయక చక్రము. సర్వ సిద్ధులను ప్రసాదించు ఈ చక్రమునకు అధిదేవత త్రిపురాంబ; సేవికలు అతి రహస్య యోగినులు. శుద్ధసత్త్వమునకు ప్రతీకగా నున్న ఈ ఆవరణ శ్వేతవర్ణములో ఉండును.

త్రిభుజాకారములోనుండు ఈ ఆవరణ సత్త్వరజస్తమో గుణములను సూచించును. తూర్పుదిశవైపుగానున్న శిఖరమును 'కామకళా' అందురు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగినది. త్రిభుజము యొక్క మూడు భుజములు మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతులను సూచించును. మూడు కోణములు దేవి శక్తిరూపములను సూచించును. కామేశ్వరీ – బ్రహ్మదేవుని సృజనశక్తిని; వజ్రేశ్వరీ – విష్ణువు పోషకశక్తిని; భగమాలిని – రుద్రుని సంహారకశక్తిని సూచించును. త్రిభుజములోని ఉత్తరదిశ కోణము శివపార్వతులు ఉన్న జాలంధర పీఠమును, దక్షిణదిశ కోణము విష్ణువు లక్ష్మీదేవి ఉన్న పూర్ణగిరి పీఠమును, మిగిలిన మూడవ కోణము బ్రహ్మ సరస్వతీదేవి ఉన్న కామగిరి పీఠమును సూచించును. త్రిభుజము యొక్క త్రికోణములు మూడు వాక్స్వరూపములను – పశ్యంతి, మధ్యమా, వైఖరీ – తెలియజేయును. ఈ మూడును వరుసగా దేవియొక్క ఇచ్ఛా జ్ఞాన క్రియాశక్తులను ప్రకటించును. ఈ చక్రము యోనిచక్రము, శక్తిచక్రము, జీవత్రికోణము, విసర్గ అను ఇతర నామములతో కూడ పిలువబడుచున్నది. త్రిగుణములు, త్రిమూర్తులు, త్రికాలములు, ఇత్యాదివన్నియు ఈ చక్రముచే సూచించబడుచున్నవి.

ఆవరణ స్వభావము 'నాద'. శాక్తేయ తత్త్వము కలది. ఈ చక్రము పాక్షికముగా ప్రదక్షిణ దిశగాను, పాక్షికముగా అప్రదక్షిణముగను ఉపాసించబడుట ఆసక్తికరము. కొన్ని సిద్ధాంతముల ప్రకారము ప్రదక్షిణదిశలో ఉపాసన సరియైనదని తెలియుచున్నది. ఆవరణ వివరములు పటమునందు పట్టికలోను చూపబడెను.

సర్వసిద్ధిప్రదాయక చక్రము



పట్టిక –10 అష్టమావరణము – త్రికోణ – సర్వసిద్ధిప్రదాయక చక్రము


క్రమసంఖ్య	త్రికోణములు సూచించు త్రయీలు		
1	పశ్యంతి	మధ్యమ	వైఖరీ
2	వామ	జ్యేష్ఠా	రౌద్రీ
3	ఇచ్ఛా	జ్ఞాన	క్రియా
4	సత్త్వ	రజస్	తమస్
5	ఈశ్వర	హిరణ్యాగర్భ	విరాట్
6	కామరూప	పూర్ణగిరి	జాలంధర
7	కామేశ్వరి	వజ్రేశ్వరి	భగమాలినీ
8	బ్రహ్మరూప	విష్ణురూపా	రుద్రరూపా
9	ఏం	క్లీం	సౌః

నవమావరణము – సర్వానందమయ చక్రము

వాస్తవముగా నవమావరణము ఆవరణము కాదు. కాని నిచిత్రముగా సర్వస్వము దీనియందే ఉన్నది. ఇది ఒక బిందువు ద్వారా తెలియజేయబడుచున్నది. ఇచటనే దేవి నివసించును. ఈ ఆవరణకు అధిష్ఠాన దేవత త్రిపురసుందరీ, లలితా, కామకళా, మహాకామేశ్వరీ, పరా భట్టారికా, లేక శ్రీవిద్యా. శ్రీచక్రమున కంతటికి ఈమె మహారాణి, అనగా రాజరాజేశ్వరీ. పరాపర అతిరహస్య యోగినులు సేవికలు. రహస్యములలోకెల్ల రహస్యము. చక్రము ఉదయభానునివలె, కరిగించిన బంగారువర్ణము కలది. ఈ చక్రము పూజ ప్రదక్షిణముగా చేయబడును.

కేంద్రబిందువులో యథార్థముగా మూడు బిందువులు కలవు. అవి చంద్రుడు, సూర్యుడు, అగ్నికి ప్రతీకలు. మరియు ఈ బిందుత్రయము మూడు వర్ణములను – ఎరుపు, తెలుపు, మిశ్రమ వర్ణము – సూచించును. కుండలినీ శక్తికి ప్రతీకగా ఈ చక్రమునందు బిందుత్రయము కలదు. బిందుత్రయము వరుసగా ఇడా, పింగళా, సుషుమ్నా నాడులను సూచించును. పరమానందమును ప్రసాదించుటచే సర్వానందమయచక్రమని పిలువబడుచున్నది.

సర్వానందమయ చక్రము



బిందువు అహంకారమును సూచించును. మరియు సర్వము ఉత్పన్నమయే బీజమని కూడ చెప్పవచ్చును. మరొక సిద్ధాంతవాదము ప్రకారము బిందువునందు తొమ్మిది చక్రములు కలవు. అయితే ఇది సామాన్యులకు అందుబాటులో లేనిది.

బిందువులోని బిందుత్రయము దేవి శిరస్సు, 'మ్' శబ్దములను సూచించగా, వాటిక్రిందనున్న ఆధారము దేవియొక్క స్తనద్వయము విసర్గ ద్వారా సూచించబడుచున్నది.


ఈ బిందువులోని రెండు శబ్దములు – 'మ్', విసర్గ వరుసగా అనుస్వారము విసర్గలుగా తెలియును. ఈ రెండును సృష్టి, లయ కార్యములను ప్రతిబింబించును. ఈ చక్రము సంహారకార్యములోని చివరిదశను, అనగా ప్రళయమును సూచించును. అదియేకదా పరమానందము!

శైవతత్త్వమును ప్రకటించు ఈ చక్రమునందు బిందుత్రయము నాద, బిందు, కళలను కూడ సూచించును. మహాత్రిపురసుందరీదేవి లేక కామేశ్వరీ, కామేశ్వరునితో ఇచటనే వసించును. అందుచే సర్వానందమయ చక్రమని పిలువబడుచున్నది. ఈ నవమావరణలో మహాత్రిపురసుందరీదేవి ఏకాంతముగా ప్రత్యేకముగా పూజించబడుచున్నది.




(1)

బిందు




(2)

త్రికోణ




(3)

వసుకోణ




(4)

అంతర్దశార




(5)

బహిర్దశార




⑥

చతుర్దశార




⑦

అష్టదళ



⑧

షోడశదళ



⑨

వృత్తత్రయ, భూపుర

నవావరణములు

క్రమసంఖ్య	చక్ర నామము	గుణము	వర్ణము	స్వభావము	సంబంధము
1	భూపుర	త్రైలోక్యమోహన			
		మొదటి రేఖ	తెలుపు	ల	పృథ్వి
		రెండవ రేఖ	రక్తవర్ణము		
		మూడవ రేఖ	పసుపు		
2	షోడశదళ	సర్వాశాపరిపూరక	తెలుపు	స	చంద్ర
3	అష్టదళ	సర్వసంక్షోభణ	జపాకుసుమ	హ	అష్ట మూర్త్యాత్మక
4	మన్వస్ర	సర్వసౌభాగ్యదాయక	దాడిమి పుష్పం	ఈ	చతుర్దశ భువనాత్మక
5	బహిర్దశార	సర్వార్ధసాధక	సిందూర	ఎ	దశావతారాత్మక
6	అంతర్దశార	సర్వరక్షాకర	గులాబి రంగు	ర	వైశ్వానరాత్మక
7	వసుకోణ	సర్వరోగహర	గులాబి రంగు	క	ప్రకృత్యాత్మక
8	త్రికోణ	సర్వసిద్ధిప్రద	తెలుపు	నాద	గురుత్రయాత్మక
9	బిందు	సర్వానందమయ	కరగించిన బంగారు వర్ణము	బిందు	పంచబ్రహ్మాత్మక

ముఖ్యలక్షణములు

పూజ తీరు	అధిదేవత	యోగినుల స్వభావము	ముద్ర	సృష్టి పరంగా	తత్త్వము
ప్రదక్షిణంగా	త్రిపుర	ప్రకట	సర్వసంక్షోభిణి	సృష్టి	చార్వాక
అప్రదక్షిణంగా	త్రిపురేశ్వరి	గుప్త	సర్వవిద్రావిణి	సృష్టి	బౌద్ధ
ప్రదక్షిణంగా	త్రిపురసుందరి	గుప్త తర	సర్వాకర్షిణి	సృష్టి	గాణాపత్య
అప్రదక్షిణంగా	త్రిపురవాసిని	సంప్రదాయ	సర్వ వశంకరి	స్థితి	సాంఖ్య
అప్రదక్షిణంగా	త్రిపురశ్రీ	కులోత్తీర్ణ	సర్వోన్మాదిని	స్థితి	వైదిక
అప్రదక్షిణంగా	త్రిపురమాలిని	నిగర్భ	సర్వమహాంకుశ	స్థితి	సౌర
అప్రదక్షిణంగా	త్రిపురసిద్ధి	రహస్య	సర్వఖేచరి	సంహార	వైష్ణవ
ప్రదక్షిణంగా అప్రదక్షిణంగా	త్రిపురాంబ	అతి రహస్య	సర్వబీజ	సంహార	శాక్త
ప్రదక్షిణంగా	మహా త్రిపురసుందరి	పరాపర అతి రహస్య	సర్వయోని	సంహార	శైవ

4 శ్రీచక్రము – శ్రీవిద్య

శ్రీచక్రము శ్రీవిద్య

మహాత్రిపురసుందరీదేవి యొక్క మంత్రము శ్రీవిద్య, యంత్రము శ్రీచక్రము. ఒక సిద్ధాంతము ప్రకారము దేవికి (స్త్రీ దేవత) సంబంధించిన ఏ మంత్రమైన 'విద్య' అని పిలువబడును. శ్రీ విద్య ననుసరించు కొందరి అభిప్రాయనుసారము శక్తికి సంబంధించి పండ్రెండు అక్షరములకు మించిన మంత్రమేదైనను 'విద్య' అనబడును. సాధ్యమైనంత సూక్ష్మంగా శ్రీవిద్య వేదములలో చేర్చబడుటచేత, వేదములవలె, ప్రాచీనమైనదిగా తెలియుచున్నది. ప్రపంచ సంస్కృతులన్నిటిలో దేవిని (మాతృమూర్తి) పూజించు సంస్కారము వారి వారి సంస్కృతులలో భాగమయ్యెను. చైనా, ఈజిప్టు, గ్రీకు నాగరికతలలో ఇందుకు తార్కాణములున్నవి. కొందరు తాంత్రికులు, తంత్రశాస్త్రము దేవీపూజ వేదములకన్న ప్రాచీనమైనవని వాదించెదరు. మరొక వర్గము తాంత్రిక పూజలన్నియు అవైదికములని త్రోసిపుచ్చెదరు. ఈ రెండు వాదములు పరస్పర విరుద్ధ ధోరణులను ప్రతిబింబించును. వేదములు, తాంత్రిక పూజలు మధ్య సమన్వయము సాధించు దిశలో ఎందరో పండితులు, విద్వాంసులు విశేషమైన కృషి సలిపిరి. దక్షిణభారత దేశములో ఇటువంటి కృషి ఎక్కువగా జరిగినట్లు ఆధారములున్నవి. లక్ష్మీధ్ధర, భాస్కరరాయలు మొదలైన పండితులు ఈ విధమైన కృషి చేసినవారిలో కలరు. ఆదిశంకరులు, తమయొక్క సుప్రసిద్ధ గ్రంథము సౌందర్యలహరి ద్వారా శ్రీవిద్యకు ప్రాముఖ్యము నిచ్చినవారిలో ప్రప్రథమ గురువులని చెప్పవచ్చును. తరువాతి కాలములో శాక్తేయమునకు ప్రాముఖ్యమిచ్చి, శ్రీవిద్యా శ్రీచక్రములను వివరించు అనేక ఉపనిషత్తులు వెలుగులోనికి వచ్చెను. భవానోపనిషత్తు, అరుణోపనిషత్తు, త్రిపురాతాపినీ ఉపనిషత్తు వీటిలో కొన్ని.

భౌతిక సుఖముల నపేక్షించు సాధకులు, మోక్షము నపేక్షించు సాధకులకుగల భేదమును రుద్రయామల తంత్రము వివరించెను. మరియు భౌతికసుఖములను ప్రసాదించు దేవతలు మోక్షము ప్రసాదించలేరని ఉద్ఘాటించెను. కాని శ్రీవిద్యా, శ్రీచక్రములలోని మహాత్రిపురసుందరీ మాత్రము రెండింటిని ప్రసాదించగలదని చెప్పెను.

యత్రాస్తి భోగో న తత్ర మోక్షః యత్రాస్తి మోక్షో న తత్ర భోగః
శ్రీసుందరీ సేవక పుంగవానాం భోగశ్చ మోక్షశ్చ కరస్థ ఏవ

భౌతికసుఖము ఉన్నచోట అధ్యాత్మిక పురోగతి ఉండదు. అటులనే మోక్షము ఉన్నచోట ప్రాపంచిక సౌఖ్యముల కాస్కారము లేదు. కాని త్రిపురసుందరీదేవిని, అనగా శ్రీవిద్యను పూజించువారికి ప్రాపంచిక సుఖము, మోక్షసుఖము కూడ ప్రాప్తించును.

మంత్రము యంత్రముల మధ్యగల సంధిగ్ధ పరిస్థితిని శ్రీవిద్య పట్టించుకొనక విస్మరించును. మహాత్రిపురసుందరీ మూలమంత్రమునందు పదిహేను అక్షరములు ఉండుటచేత 'పంచదశాక్షరీ' లేక క్లుప్తంగా 'పంచదశీ' అని పిలువబడుచున్నది. ఈ సిద్ధాంతము ననుసరించువారు పంచదశీ మంత్రము అత్యుత్తమమైనదని, శ్రీయంత్రము యంత్రములలో చక్రవర్తియని విశ్వసించెదరు.

శ్రీవిద్యా మంత్రమును సరియైన గురువు ఉపదేశించవలెను. ఎవరికి వారు తమ ఇచ్చవచ్చినట్లు ఈ మంత్రమును పఠించుటగాని ఉచ్చరించుటగాని చేయరాదు. సాధకుడు అర్హత పొందిన గురువునుండి

ఉపదేశము పొందవలెను. ఈ ప్రక్రియలో కొన్ని ప్రాథమిక దశలను దాటవలెను. మొదట సాధకుడు బాలాత్రిపురసుందరీ మహామంత్రోపదేశము పొందవలెను. ఈ మంత్రములో మరల మూడు మంత్రములు ఉండుటచేత 'త్రయాక్షరీ' అని పిలువబడుచున్నది. సాధకుడు నాలుగు లక్షల పర్యాయములకు పైగా ఈ మంత్రజపము పూర్తి చేయవలెను. అచుపిమ్మట సాధకుడు పంచదశాక్షరీ మంత్రోపదేశమున కర్హుడగును. సాధకుడు సూటిగా పంచదశీ మంత్రోపదేశము నందుకొనుటకు వీలులేదు. సాధకుడు కొన్ని సంవత్సరములు పంచదశీ మంత్రజపము కొనసాగించి, పదిహేనులక్షలకు పైగా మంత్రజపము పూర్తిచేసిన తరువాత పదహారు అక్షరములుగల షోడశీ మంత్రోపదేశమునకు అర్హత పొందును.

శ్రీవిద్యా మంత్రమును షోడశీ మంత్రమని యందురు. దీనికి రెండు కారణములు కలవు. ఒకటి: దివ్యమైన కన్య వయస్సు పదహారు సంవత్సరములు. రెండు: మంత్రమునందు పదహారు అక్షరములు ఉండుట. ఈ షోడశీ మంత్రమునకు మారుగా పంచదశీ మంత్రము కలదని ఇంతకు పూర్వము ప్రస్తావించడమైనది. వరివస్యా రహస్యము, శ్రీవిద్యా మంత్రమును రహస్యముగా (అక్షరములను ఉచ్చరించక) జ్ఞాపకముంచుకొనవలసిన ఆవశ్యకత కలదని ఉద్ఘాటించుచున్నది.

కామో యోనిః కమలేత్యేవం సాంకేతికైః శబ్దైః।
వ్యవహరతి న తు ప్రకటం యాం విద్యాం వేదపురుషోఽపి ॥

వేదములు కూడ శ్రీవిద్యా మంత్రమును 'కామో యోనిః కమలా...' మొదలగు ప్రతీకలద్వారా చెప్పుచున్నదే గాని, బహిరంగముగా మంత్రమును చెప్పుటలేదు.

ఈ శ్లోకము వ్యాఖ్యానములో భాస్కరరాయలవారు సాంఖ్యాయన శ్రుతినుండి మరొక శ్లోకము నుదాహరించిరి. ఈ శ్లోకములో వారు పూర్తి శ్లోకమును 'కామో యోనిః...' నుండి పేర్కొనిరి. ఇది మంత్రమును జ్ఞాపకము పెట్టుకొనుట (mnemonic) కనుకూలముగా చెప్పబడెను.

కామో యోనిః కమలా వజ్రపాణిర్గుహా హసా మాతరిశ్వాభ్రమింద్రః।
పునర్గుహా సకలా మాయయా చ పురూచ్యేషా విశ్వమాతాదివిద్యా ॥

పై శ్లోకములోని పదములు, పంచదశీలోని పదిహేను అక్షరములను క్రింది విధముగా వివరించుచున్నది.

కామః	క
యోనిః	ఏ
కమలా	ఐ
వజ్రపాణిః = ఇంద్రః	ల
గుహా	హ్రీం
హసా	హ,
మాతరిశ్వ = వాయుః	క
అభ్ర = ఆకాశ	హ
ఇంద్రః	ల
పునః గుహా	హ్రీం
సకలా	స, క, ల
మాయా	హ్రీం

ఆవిధంగా మంత్రము మూడు కూటములుగా చెప్పబడినది. శ్లోక పదవిచ్ఛేదన చేసిన పిమ్మట, పంచదశీ పూర్తిమంత్రము మనకు లభ్యమగును.

క ఎ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం

శ్రీవిద్యా చెప్పుకొనదగిన ప్రాచీనత కలది. మరియు వైదిక తాంత్రిక గ్రంథములు రెండింటియందు ప్రాముఖ్యము గలది. ఇంతకుముందు వివరించినట్లు, శ్రీవిద్యా పదిహేను అక్షరములుగల మంత్రమని (పంచదశీ) సామాన్యముగా చెప్పబడుచున్నది. ఇది మూడు బీజాక్షర వర్గములుగా విభజించబడినది. దీనిని కూటత్రయమందురు. అందుచే త్రిపురసుందరీ మూడు బీజాక్షర కూటములుగల శరీరముగా వర్ణించబడుచున్నది. (కూటత్రయ కళేబరా)

ప్రాచీన గ్రంథములు పంచదశీ అనుయాయులను రెండు తరగతులుగా విభజించెను. 'క' అక్షరముతో ప్రారంభమయే మంత్రము ననుసరించువారు 'కాది' విభాగమునకు చెందినవారు. శివ, దూర్వాస, హయగ్రీవ మున్నగువారు ఈ తరగతికి చెందినవారు. 'హ' అక్షరముతో మంత్రమును ప్రారంభించువారు రెండవతరగతి 'హాది' విభాగమునకు చెందినవారు. అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర ఈ వర్గమునకు నాయకత్వము వహించుచున్నది.

'కాది' వంశము వారనుసరించు మంత్రము:

క ఎ ఈ ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం

'హాది' వంశము వారనుసరించు మంత్రము:

హ స క ల హ్రీం
హ స క హ ల హ్రీం
స క ల హ్రీం

'కాది' విద్యా దక్షిణాచారముగా లేక సమయాచారముగా చెప్పబడుచున్నది. 'కాది' విద్యాలో మూడు ఖండములున్నవి. ఈ మూడును కలిసి పంచదశీ (పదిహేను అక్షరములు) అగుచున్నది.

జ్ఞానార్ణవ తంత్రము శ్రీవిద్యాలో ఆద్యులను పేర్కొనుచున్నది. వారు:

మనుశ్చంద్రః కుబేరశ్చ లోపాముద్రా చ మన్మథః
అగస్తిరగ్నిస్సూర్యశ్చ ఇంద్రస్కందశ్శివస్తథా
క్రోధ భట్టారకో దేవ్యా ద్వాదశామీ ఉపాసకాః

1 మనువు 2 చంద్రుడు 3 కుబేరుడు 4 లోపాముద్ర
5 మన్మథ (కామరాజ) 6 అగస్త్యుడు 7 అగ్ని 8 సూర్యుడు
9 ఇంద్రుడు 10 స్కందుడు 11 శివుడు 12 దుర్వాసుడు

అగస్త్యునికి శ్రీవిద్య నుపదేశించిన ఘనత లోపాముద్రకు చెందును. 'కాది' వంశమునకు ఆద్యుడు మన్మథుడు కాగా, 'హాది' వంశమునకు లోపాముద్ర ఆద్యురాలు. ఈ రెండింటిలో 'కాది' విద్యా సులభము. మరియు మార్పులు చేర్పుల కనుకూలమైనది. అందుచేత దీనిని అనేకమంది అనుసరించసాగిరి. 'కాది' విద్య అధర్వవేదమునుండి ఏర్పడినది. లలితా త్రిశతి ప్రధాన గ్రంథము. ఇందులో దేవి (మాతృదేవత) మూడువందల నామములు మంత్రాక్షరక్రమములో రూపొందించబడినవి. జ్ఞానార్ణవ తంత్రములో ఒక శ్లోకము 'కాది' మంత్రమును కేవలము తొమ్మిది అక్షరములతో గుర్తించుచున్నది. పునరావృతమయే అక్షరములు వదిలివేయబడెను.

తొమ్మిది అక్షరములు (నవార్ణ) 'మేరువు' అని పిలువబడుచున్నవి. మేరువు మూడు తలముల (three dimensional) శ్రీచక్రముగా తెలియుచున్నది. తొమ్మిది అక్షరములు ఏవనగా:

ల, స, హ, ఈ, ఎ, ర, క, అర్ధచంద్ర, బిందు

భూమిశ్చంద్రః శివో మాయా శక్తిః కృష్ణాధ్వమాదనౌ।
అర్ధచంద్రశ్చ బిందుశ్చ నవార్ణో మేరురుచ్యతే॥
ఏభిర్నవాత్మకైః వర్ణైః జాయతే త్రిపురామనుః।
శ్రీచక్రమపి దేవేశి మేరురూపం న సంశయః॥

పంచదశాక్షరీ మంత్రమునకు ఈ తొమ్మిది అక్షరములు చాలును. చివరకు ఈ తొమ్మిది అక్షరములు పంచదశీ స్వరూపమును సూచించును. భూమి, చంద్రుడు, శివుడు, విష్ణువు, అగ్ని, మన్మథుడు, పరమ సత్యమునకు సూచకములు.

జ్ఞానార్ణవ తంత్రములోని వేరొక శ్లోకము, పదిహేను అక్షరములను శివుడిని శక్తిని లేక ఇరువురిని సూచించునట్లుగా విభజించినది.

కత్రయం హద్వయం చైవ శైవోభాగః ప్రకీర్తితః।
శక్త్యక్షరాణి శేషాణి హ్రీంకారః ఉభయాత్మకః॥

మూడు 'క'లు రెండు 'హ'లు శివుడిని, మిగిలిన అక్షరములు శక్తిని, 'హ్రీం' రెండింటి కలయికను సూచించును.

జ్ఞానార్ణవ తంత్రము, శ్రీవిద్యా మంత్రమునుండి యంత్రము, శ్రీచక్రముల ఆవిర్భావమును సంపూర్ణముగా వర్ణించెను. లలితోపాఖ్యానము, లలితా సహస్రనామము, లలితా త్రిశతి అను మూడు ప్రధాన గ్రంథములు శ్రీచక్రోపాసనకు ఉపయోగపడుచున్నవి. కారణమేమనగా, లలితోపాసక వర్గము పదిహేను అక్షరముల మంత్రము, పంచదశీకి కట్టుబడి ఉండుట. పంచదశీ మంత్రమునుండి సంక్షిప్తముగాచెప్పబడు

తొమ్మిది అక్షరములు శ్రీచక్ర రూపకల్పనలో వివిధ అన్వయములు కలిగియున్నవి.

'ల' అక్షరము భూపుర చక్రమును సూచించును
'స' అక్షరము షోడశదళపద్మమును సూచించును
'హ' అక్షరము అష్టదళపద్మమును సూచించును
'ఈ' అక్షరము భువనేశ్వరీ (మాయ) – ఏడు ఊర్ధ్వ లోకములు ఏడు అధోలోకములను, మొత్తము పదునాలుగు లోకములను సూచించును.
'ఎ' అక్షరము 'శక్తి'ని – బహిర్దశారము (పది త్రిభుజములు విష్ణువు యొక్క పది అవతారములను) సూచించును
'ర' అక్షరము 'అగ్ని'ని – అంతర్దశారము (పది త్రిభుజములు పది దశాగ్నులను సూచించును)
'క' అక్షరము కామేశ్వర – అష్టకోణము సూచించును
'నాద' – అర్ధానుస్వారము త్రికోణమును సూచించును
'బిందు'– యంత్రములోని బిందువు మంత్రములోని బిందువుతో సరిపోవును. అందుచేతనే జ్ఞానార్ణవ తంత్రము, శ్రీవిద్యాలోని అక్షరరూపములే శ్రీచక్రమని నిరూపించుచున్నది.

శ్రీచక్రం తు వరారోహే శ్రీవిద్యావర్ణసంభవమ్

శ్రీవిద్యా మంత్రమునుండి శ్రీచక్రము ఆవిర్భవించెనని వరివస్యా రహస్యము పేర్కొనుచున్నది.

కత్రయాదికాలాత్ హిందుర్జాతస్తదగ్రిమే చక్రే
హల్లేఖాభిః తత్పురచక్రత్రితయం హకారాభ్యాం
ఎకారేణ చ తత్పురచక్రే జాతే సకారాభ్యామ్
చతురశ్రాణి లకారైరేవ విద్యాక్షరేణ చక్రజనిః
99, 100 వరివస్యా రహస్యము

శ్రీచక్రముయొక్క మూలము శ్రీవిద్యా అక్షరములనుండి క్రింది విధముగా నున్నది.

బిందువుకు మూలము మూడు 'క'లు, 'ఈ'
తరువాతి రెండు చక్రములు త్రికోణము, అష్టకోణములకు మూలము మూడు 'హ్రీ'లు
రెండు దశకోణ – బహిర్దశార, అంతర్దశార – ఆవరణలకు మూలము రెండు 'హ'లు
చతుర్దశార చక్రమునకు మూలము 'ఎ'
అష్టదళపద్మము షోడశదళపద్మములకు మూలము 'స'
చతురస్రాకార భూపుర చక్రమునకు మూలము మూడు 'ల'లు

శ్రీచక్ర నిర్మాణము శ్రీవిద్యా మంత్రమునకు దృశ్యరూపము. మరియు పంచదశీలోని మూడు బీజాక్షరముల ప్రతిబింబమునకు ప్రతీక. లలితా త్రిశతి ఈ ప్రాతిపదికపై ఏర్పడినది. మూడు కూటములు మూడు వందల నామములను సూచించుచున్నవి.

కూటమి–1

బిందువు
త్రికోణము
అష్టకోణ లేక వసుకోణము
అంతర్దశార బహిర్దశారములు

కూటమి–2

చతుర్దశారము – వృత్తత్రయములో ప్రథమ (ఆవలి) వృత్తము
అష్టదళపద్మము – వృత్తత్రయములో ద్వితీయ (మధ్యమ) వృత్తము
షోడశదళపద్మము – వృత్తత్రయములో తృతీయ వృత్తము

కూటమి–3

చతురస్రాకార భూపురచక్రములోని లోపలి చదరము
భూపురచక్రములోని మధ్య చదరము
భూపురచక్రములోని బయటి చదరము
దేవతాద్వయము – శివ కామేశ్వరి

శ్రీవిద్యా శ్రీచక్రములు మూడు కూటములుగా విభజన. వాటిలో:

శ్రీకంఠ (అ), కోణత్రయము (ఎ), లక్ష్మీ (ఈ)లతో క్రోధీశః (క)
అనుత్తర (అ), మాంస (ల) మొదటి వాగ్భవకూటము

శివ (హ), హంస (స), బ్రహ్మ (క), వియత్ (హ), శక్ర (ల)
వేర్వేరుగా అక్షర (అ)తో కలిసి కామరాజమను రెండవ కూటము

రెండవ కూటమునుండి శివ (హ), వియత్ (హ)లను మినహాయించగా శక్తికూటమను మూడవ కూటము.

ఈ కూటముల చివర మూడు 'హృల్లేఖ'లను, ఒకొక్క దానిలో ఒక 'హ్రీం' చేర్చవలెను.

క్రోధీశః శ్రీకంఠారూఢః కోణత్రయం లక్ష్మీః।
మాంసమనుతరరూఢం వాగ్భవకూటం ప్రకీర్తితమ్ ప్రథమమ్॥
శివహంసబ్రహ్మోవియచ్ఛక్రాః ప్రత్యేకమక్షరారూఢాః।
ద్వితీయకం కూటం కథితం తత్ కామరాజాఖ్యామ్॥
శివతో వియతో ముక్తం తృతీయమిదమేవ శక్తికూటాఖ్యామ్।
హల్లేఖానాం త్రితయం కూట త్రితయేఽపి యోజ్యమన్తే స్యాత్॥
9–11 వరివస్యా రహస్యము

మొదటి వాగ్భవ కూటమందు పంచదశీలోని మొదటి ఐదు అక్షరములు – క, ఎ, ఈ, ల, హ్రీం
రెండవ కామరాజ కూటమందు పంచదశీలోని తరువాతి ఆరు అక్షరములు – హ, స, క, హ, ల, హ్రీం

మూడవ శక్తికూటమందు పంచదశీలోని మిగిలిన నాలుగు అక్షరములు – స, క, ల, హ్రీం

సాధకుడికి విద్యను ప్రసాదించుటలో వాగ్భవకూటము శక్తిమంతమైనది. అందుచేత ఇది ‘విద్యాప్రద’ అని పిలువబడుచున్నది.

రెండవకూటము మన్మథుని పేరిట కామరాజకూటమనబడుచున్నది. అందుచేత దీనిపై శ్రద్ధగల సాధకుడు భౌతికమైన సకల భోగములను పొందును. కాబట్టి ఈ కూటము అర్థకామభోగప్రదమనబడుచున్నది.

చివరిదైన శక్తికూటము లేక పరకూటము సాధకుడికి మోక్షము ప్రసాదించబడునని చెప్పబడుచున్నది. కాబట్టి ఇది మోక్షప్రదమైనదిగా తెలియుచున్నది.

మూడు కూటములు కలిసి పంచదశీ అగుచున్నది. మూడు కూటములను ఉపాసించినపుడు ఇహపర సౌఖ్యములన్నియు సాధకుడికి ప్రాప్తించును. ఈ మూడు కూటముల ఆధారంగా శ్రీచక్రము విభజించబడెను.

బిందు, త్రికోణ, అష్టకోణములు – ఈ మూడు లోపలి ఆవరణలు వాగ్భవకూటమిగా ‘సృష్టి’ని సూచించును.

బహిర్దశారము, అంతర్దశారము, చతుర్దశారమను మూడు ఆవరణలు కామరాజకూటమిగా ‘స్థితి’ని సూచించును.

అష్టదళ, షోడశదళ, భూపురమను మూడు ఆవరణలు శక్తికూటమిగా ‘సంహార’ మును సూచించును.

ఇంతకు పూర్వము చెప్పినట్లు విద్యా అను పదము దేవీ మంత్రమునకు సంబంధించినది. తంత్రశాస్త్రము దశవిద్యలను పేర్కొనుచున్నది.

కాలీ తారా షోడశీ చ బగలాభువనేశ్వరీ।
ధూమా ఛిన్నా చ మాతంగీ భైరవీ కమలాత్మికా॥

1. కాలీ: మిక్కిలి ఉగ్రరూపము ప్రదర్శించు దేవి. నలుపు వర్ణము. శివుడి గుండెలపై నిల్చుండి నర్తించుచున్నట్లు గోచరించును. ఈమె కాలమునకు సంకేతము.

2. తారా: నీలవర్ణములో తేజోవంతముగా గోచరించును. ఉగ్రరూపములో తెగిన శిరస్సులను హారముగను, వ్యాఘ్రచర్మమును ధరించి శివుడి గుండెలపై నాట్యము చేయుచున్నట్లు కనిపించును. ఈమె అధ్యాత్మిక విద్యకు సంకేతము.

3. షోడశీ: పదహారు సంవత్సరముల వయస్సుగల సౌందర్యవతి. మూడు నేత్రములు, నాలుగు హస్తములతో వివిధ ఆయుధములను పట్టుకొనియున్నట్లు కనిపించును. ఈమె త్రిపురసుందరీదేవిని సూచించు శ్రీవిద్యా.

4. భువనేశ్వరీ: ఈమె త్రిలోకపాలిని. హస్తమునందు ఫలము, ప్రసన్న వదనముతో భక్తులకు వరములు

ప్రసాదించును.

5. భైరవి: ఈమె ఉదయభానుని వర్ణములో రెండు స్తనములకు పసుపు పూసుకొని కనిపించును. ఒక హస్తములో పూసలహారము, మరొక హస్తములో పుస్తకము, మిగిలిన రెండు హస్తములు వర, అభయ ముద్రలతో దర్శనమిచ్చును. ప్రసన్న వదనము గలది.

6. ఛిన్న మస్త: మెడలో ఖండించబడిన శిరస్సుల హారము, ఒక హస్తములో రక్తము చిందుచున్న శిరస్సు, నగ్నముగా భయంకర రూపములో గోచరించును. ఢాకినీ, వర్ణిని ఈమె సేవికలు.

7. ధూమవతి: దారిద్ర్యమునకు, క్రుంగిన మానసిక స్థితికి ఈమె ప్రతీక. అనాకర్షక రూపము గలది.

8. మాతంగి: నలుపు వర్ణము. ఆయుధములను నాలుగు హస్తములందు పట్టుకొని, రత్నసహిత సింహాసనముపై కూర్చొని దర్శనమిచ్చును.

9. కమల: బంగారు వర్ణము కలది. స్వర్ణకలశములనుండి నాలుగువైపుల ఏనుగులు ఆమెపై అమృతము వర్షించుచున్నట్లు కనిపించును. పద్మముపై ఆసీనురాలై వర ముద్రతో గోచరించును.

10. బగలాముఖి: పసుపు వర్ణములో రత్మఖచిత సింహాసనముపై కూర్చుండి, రక్కసుని నాలుక పట్టుకొని మునిగోలతో కొట్టుచున్నట్లు గోచరించును.

పై దశ విద్యలకు ఒక దేవత, ఒక మంత్రము, ఒకొక్క దానికి ప్రత్యేక యంత్రము కలవు.

దశ విద్యలలో మొదటి రెండింటిని 'మహా విద్య' అని, తరువాతి మూడింటిని 'విద్య' అని, చివరి మూడు 'సిద్ధ విద్య' లని యందురు.

మరియొక విభజన ప్రకారము మొదటి రెండు విద్యలు పురోగతి సాధించిన సాధకులకు, తరువాతి ఐదు సామాన్య సాధకులకు, చివరి మూడు క్షుద్రదేవతోపాసకులకు.

శ్రీచక్రము శ్రీవిద్యా మంత్రము రెండును వరుసగా మహాత్రిపురసుందరీదేవి యొక్క చిత్రపట, అక్షర రూపములను సూచించును. మంత్రము శబ్దము ద్వారా దేవీ గుణములు వ్యక్తము చేయబడుచుండగా, అవే గుణములు శ్రీచక్రమునందు వ్యక్తమగుచున్నవి. సృష్టి సమస్తము శ్రీచక్రమునందు నిక్షిప్తమై ఉన్నట్లు వామకేశ్వర తంత్రము ప్రస్ఫుటముగా తెలియజేయుచున్నది.

చతుర్భిశ్శివచక్రైశ్చ శక్తి చక్రైశ్చ పంచభిః ।
శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీచక్రం శివయోర్వపుః ॥
పరోఽపి శక్తిరహితః శక్త్యా యుక్తో భవేద్యది ।
సృష్టిస్థితిలయాన్కర్తుమ్ అశక్తః శక్తఏవ హి ॥

సుమారుగా ఈ అభిప్రాయములనే ఆదిశంకరులవారు సౌందర్యలహరిలో వెల్లడించిరి.

శివ వర్గమునకు చెందిన త్రిభుజములు, శక్తి వర్గమునకు చెందిన త్రిభుజములు పరస్పరము సంయుక్తముగా ఖండించుకొనుటయే శ్రీచక్ర రూపకల్పనలో ప్రధానము. తొమ్మిది త్రిభుజములు సమష్టిగా సృష్టియొక్క తొమ్మిది స్వభావములుగా పరిగణించబడుచున్నవి. ఆ కారణముచేత అవి 'యోని' అని పిలువబడుచు, సృష్టి ఆవిర్భావమునకు మూలమగుచున్నవి. తొమ్మిది త్రిభుజములు సృష్టిలో అభివృద్ధిని, సామరస్యమును, చివరకు లయము లేక విలీనమును సూచించును. మానవ శరీరము తొమ్మిది ధాతువులతో ఏర్పడినది. ఐదు ధాతువులు శక్తినుండి, నాలుగు ధాతువులు శివుడినుండి వచ్చుచున్నవి. ఈ తొమ్మిది ధాతువులు శ్రీచక్రములోని తొమ్మిది త్రిభుజములకు సరిపోవుచున్నవి. శక్తినుండి లభించు ధాతువులు చర్మము, రక్తము, మాంసము, కొవ్వు, ఎముకలు. శివుడినుండి లభించు ధాతువులు మజ్జ, వీర్యము, శ్వాస, ప్రాణాధారము. తొమ్మిది ధాతువులు నవావరణలను (చక్రములను) సూచించుచుండగా, బిందువు పరాశక్తిని సూచించును. అదేవిధముగా విశ్వమునకు ఆధారమైన ధాతువులు కూడ శివశక్తులనుండి లభించుచున్నవని శైవపురాణములు, వాయవ్య సంహిత, ఇతర శాస్త్ర గ్రంథములు తెలియజేయుచున్నవి.

త్వగసృఙ్మాంసమేధోఽస్థిధాతవశ్శక్తిమూలకాః
మజ్జాశ్శుక్లప్రాణజీవధాతవశ్శివమూలకాః
నవధాతురయం దేహో నవయోనిసముద్భవః
దశమీ యోనిరేకైవ పరా శక్తిస్తదీశ్వరీ
ఏవం పిండాండముత్పన్నం తద్వద్బ్రహ్మాండముద్భవమ్

– కామికాగమ

త్రిపురసుందరి మూడు వివిధ భాగములను – చక్రము, యంత్రము, పూజ – అనగా యంత్ర మంత్ర తంత్రములను యోగినీ హృదయము తెలియజేయుచున్నది.

పూజ రెండు విధములు. ఒకటి: బహిర్యాగము. రెండవది: అంతర్యాగము.

బహిర్యాగము లేక బహిరంగపూజ శాస్త్రములు నిర్దేశించిన పద్ధతిలో చేయబడును. ఈ పూజ చేయుటకు శ్రీవిద్యలో చెప్పబడిన దేవతలు కామేశ్వరీ, కామేశ్వరులు. సకల నైవేద్యములు, ఉపాసనలతో పూజ చేయబడును. సాధకుని పురోగతికి ఇది మొదటి మెట్టు.

బహిర్యాగము అనేక పూజాక్రమములు, ద్రవ్యములు, వస్తుసామగ్రి నుపయోగించి చేయబడును. అంతర్యాగములో ధ్యానము అనగా మానసిక సంసిద్ధత, అధ్యాత్మిక దృష్టి ప్రధానము. దీనిని మరల రెండుగా విభజించవచ్చును. పటము లేక విగ్రహము సహాయముతో చేయునది. అవి లేకుండ చేయునది. ఈవిధమైన అంతరంగ ఉపాసనచేయు స్థితిని చేరుటకు, సాధకుడు బాహ్య ఉపాసనతో ప్రారంభించి క్రమక్రమంగా పురోగతి సాధించవలెను.

ఉన్నత అధ్యాత్మిక స్థాయిలో బహిర్యాగము నిరర్థకముగా పరిగణించబడుచున్నది. ఇది గృహమునకు పునాది వంటిది. మొదట పునాది అవసరము, కాని యెవరును పునాదిపై నివసించరు. బహిర్యాగము ద్వారా లభించిన శక్తులు అధ్యాత్మిక పురోగతికి మూలము.

బహిర్యాగము నిష్ప్రయోజనమని సనత్కుమార సంహిత పేర్కొనుచున్నది. కాకపోతే, దీనివలన సాధకుడు భౌతికమైన సంపదలను సుఖములను పొందగల్గును. కాని మోక్షము ప్రాప్తించదు.

బాహ్యపూజా న కర్తవ్యా కర్తవ్యా బాహ్యజాతిభిః ।
సా క్షుద్రఫలదా నృణామ్ ఐహికార్త్యైక సాధనాత్ ॥
బాహ్యపూజారతాః కౌలాః క్షపనాశ్చ కపాలికాః ।
దిగంబరా ఐతిహాసాః కామికాస్తంత్రవాదినః ॥
అంతరారాధనపరా వైదికా బ్రహ్మవాదినః ।
జీవన్ముక్తాశ్చరన్త్యేతే త్రిషు లోకేషు వర్త ఇతి ॥

మానసిక పూజ అధ్యాత్మికంగా ఉన్నతస్థితికి తీసికొనిపోగలిగినను, దీనిని సాధించుట సులభము కాదు. తంత్రశాస్త్రానుసారము సాధకుడు శరీరములోని చక్రములను, ఉపాసించు చక్రములతో సమన్వయపరచవలెను. ఈ ప్రక్రియకు మూడు వివిధ మార్గములు కలవు.

మొదటి మార్గము – శరీరములోని చక్రములను శ్రీచక్రములోని భాగములతో మేళవించి, బుద్ధిపూర్వకముగా ధ్యానించుట.

రెండవ మార్గము – శ్రీచక్రములోని తొమ్మిది చక్రములకు, శరీరములోని ఆజ్ఞా చక్రము (కనుబొమ్మల మధ్య నుండునది) లక్ష్యమని భావించి ధ్యానించుట.

మూడవ మార్గము – ఇది పై రెండింటికన్న శ్రేష్ఠమైనది. శ్రీచక్రములోని సహస్రదళపద్మము, శరీరములోని సహస్రారముల మధ్య పొందికను సామరస్యమును గుర్తించుటకు సాధకుడు ప్రయత్నించుట.

అంతర్యాగమును భావనోపనిషత్తు సంపూర్ణముగా సుస్పష్టముగా వర్ణించుచున్నది. శుద్ధచైతన్యస్థితిలో మానవ శరీరమును శ్రీచక్రముతో సమన్వయపరచి, సంపూర్ణమైన అవగాహన కలిగినపుడు, అంతరంగమందు శ్రీచక్రోపాసన పరిపూర్ణమగును. యోగశాస్త్రముతో కూడ శ్రీవిద్యకు విడదీయరాని సంబంధము కలదు. జ్ఞానమునకు సంబంధించిన ఈ రెండు శాఖలలో కొన్ని భాగములు రెండింటికి వర్తించును. శరీర చక్రములు శ్రీచక్రముల మధ్య సమన్వయము తరువాతి అధ్యాయములో చర్చించబడును.

5 శ్రీచక్రము – కుండలిని

శ్రీచక్రము, కుండలిని

మానవ శరీరము ఒక దేవాలయమని, జీవుడు (అంతరాత్మ) భగవంతుడేనని, మానవజీవిత లక్ష్యము ఆత్మ నెరుగుటేనని (సోఽహం) శాస్త్రములు ప్రకటించుచున్నవి.

దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవస్సనాతనః।
త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్ ॥


మానవ శరీరము ఒక యంత్రము వంటిది. వెన్నెముక 'మేరువు'ను సూచించుటచేత 'మేరుదండ'మని పిలువబడుచున్నది. చైతన్యము మానవుని సూక్ష్మరూపమును లేక ఏకతలము (one-dimension) పటమును సూచించగా, శరీరము మూడుతలముల (three-dimensional) చక్రము లేక 'మేరువు'ను సూచించును.


తైత్తిరీయ ఉపనిషత్తులోని ఆనందవల్లి వివిధరకములైన సుఖములను, మానవ సుఖముతో ప్రారంభించి, పరమపదము నందుకొనినపుడు పొందు పరమానందము వరకు వర్ణించినది. గణితశాస్త్రము ప్రకారము, ప్రతీకానుసారముగా కూడ ఈ సుఖము (పరమానందము) భౌతికమ్మైన సుఖముకన్న ఎన్నో కోట్ల రెట్లు అధికము. కుండలినిని జాగృతము చేయుట ద్వారా పరమానంద సుఖమును పొందవచ్చును. అయితే, కుండలినిని జాగృతము చేయు ప్రక్రియను మిక్కిలి జాగ్రత్తగా అభ్యసించవలసిన అవసరము కలదు.


మానవ శరీరములో అంతర్లీనముగా ఉన్నటువంటి శక్తిని కుండలినీ శక్తి అందురు. వెన్నెముక మూలమందు కుండలిని ఉండును. ఆధునిక మానసిక తత్త్వశాస్త్రము ప్రకారము కుండలిని మానవునిలోని అచేతనత్వముతో (unconscious) సరిపోల్చవచ్చును. మూలాధారము దగ్గర కుండలిని చుట్టలుగా చుట్టుకొనిన (మూడున్నర చుట్టలు) సర్పము వలె ఉండునని చెప్పుదురు. ఈ మూడు చుట్టలు భూతభవిష్యద్వర్తమానములను, జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలను, సత్త్వరజస్తమోగుణములను, ప్రత్యక్షపరోక్షశూన్యానుభవములను సూచించును. అరచుట్ట మూడు చైతన్యావస్థల కతీతమ్మైన తురీయావస్థను సూచించును. కుండలిని జాగృతము చేయబడినపుడు, మానవునియందు గొప్ప పరిణామము జరిగి, అతని శారీరిక మానసిక శక్తులు పునరుద్దీపించబడును. అయితే రహస్యమ్మైన దివ్యశక్తులు కలుగునని పొరపాటుపడరాదు. ఇది జీవన విధానమును, జీవితముపై దృక్పథమును సుసంపన్నము చేయును. కుండలినీ చక్రములను, వాటి లక్షణములను అర్థము చేసికొనుటకు, తరువాత క్రమక్రమంగా వాటిని జాగృతము చేయుటకు గురువు ఉపదేశము ఆవశ్యకమగును.

మానవ శరీరములో 7200 నాడులుగల నాడీవ్యవస్థ ఉన్నది. వెన్నెముకను 'మేరుదండ' మందురని ఇంతకు పూర్వము చెప్పబడినది. మానవ శరీరములో మూలాధారమునుండి ఆరు చక్రములు కలవు(పటము చూడుడు). అనేక శాస్త్రగ్రంథములు ఈ చక్రములను వాటి స్థానములను వివరించెను.

మూలాధారం గుదస్థానం స్వాధిష్ఠానం తు మేహనమ్।
నాభిస్తు మణిపూరాఖ్యం హృదయం చాబ్జమనాహతమ్ ॥
తాలుమూలం విశుద్ధాఖ్యం ఆజ్ఞాం నిటలాంబుజం।
సహస్రారః బ్రహ్మరంధ్రమ్ ఇత్యాగమవిదో విదుః ॥


చక్రస్థానములు
సహస్రారము
బిందు
ఆజ్ఞా
విశుద్ధ
అనాహత
మణిపూర
స్వాధిష్ఠాన
మూలాధార


ఆజ్ఞా
విశుద్ధ
అనాహత
మణిపూర
స్వాధిష్ఠాన
ఇడ
పింగళ
మూలాధార
సుషుమ్న



ఈ ఆరు చక్రములు నలుబది తొమ్మిది రకముల విద్యుత్తును వాటియందు విస్తరింపజేయుచున్నవి. ఆరు చక్రములకు ప్రాణశక్తి వాయువునుండి ఉద్భవించి, మూలాధారమునుండి విముక్తి పొందుచున్నవి. శాస్త్రపరముగా కూడ శరీరము పంచభూతములతో – పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము – ఏర్పడినదని తెలియును. శరీరములోని వివిధ భాగములు ఒకొక్క భూతముయొక్క అధిక ప్రభావముతో కూడియున్నవి.

లలితాసహస్రనామమందు అన్ని చక్రములు, చక్రముల అధిదేవతలు, వర్ణము వివరించబడెను. క్రింది పట్టికలో ఆ వివరములు పొందుపరచబడెను.

క్రమసంఖ్య	చక్రనామము	దళములు	వర్ణము	బీజాక్షరములు	ల.స.శ్లోకములు	అధిదేవత	శ్రీచక్రములో స్థానము
1	మూలాధారము	4	ఎరుపు	లం	99, 514-520	సాకినీ	భూపుర
2	స్వాధిష్ఠానము	6	పసుపు	నం	504-513	కాకినీ	షోడశదళ, అష్టదళ
3	మణిపూరము	10	నీల	రం	495-503	లాకినీ	చతుర్దశార, బహిర్దశార, అంతర్దశార
4	అనాహతము	12	బంగారు	యం	485-494	రాకినీ	అష్టకోణ, త్రికోణ
5	విశుద్ధము	16	తెలుపు	హం	475-484	ఢాకినీ	బిందు
6	ఆజ్ఞా	2	–	హం,క్షం	521-527	హాకినీ	బిందు
7	సహస్రార	1000	అన్ని వర్ణములు	అన్ని అక్షరములు	528-534	యాకినీ	బిందు

మానవ శరీరములోని ఆరు చక్రములు, సహస్రారము శ్రీచక్రములోని నవావరణములకు సరిసమానముగా పై పట్టికలో చూపబడెను. మరియు వాటికి సంబంధించిన లలితా సహస్రనామములోని సంబంధిత శ్లోకములు కూడ సూచించబడెను.

1.మూలాధారము: లలితా సహస్రనామములో దీనికి సంబంధించిన నామములు – మూలాధారైకనిలయాః. ఇది శరీరమున కంతటికి మూలము, ఆధారము కూడ. అందుచే మూలాధారమను నామము తగియున్నది. కుండలిని మూలాధారమందు ఉండును. అందుచేత దేవితో సమానముగా పరిగణించబడుచున్నది.

మూలాధారాంబుజారూఢా పంచవక్త్రాస్థిసంస్థితా
అంకుశాది ప్రహరణా వరదాదిని షేవితా
ముద్గౌదనాసక్తచిత్తా సాకిన్యంబాస్వరూపిణీ

ఆమె మూలాధారముపై స్వారీ చేయు సాకినిగా తెలియజేయబడుచున్నది. ఎముకలలోనుండు ఈమె ఐదు వదనములతో అంకుశమువంటి ఆయుధములు కలిగియున్నది. వరద, నాలుగు ఇతర శక్తులు ఈమెను సేవించును. నల్లధాన్యములతో తయారుచేయబడిన ఆహారముపై ఆసక్తి కలది.

2. స్వాధిష్ఠానము: లలితాసహస్రనామములో సంబంధిత నామములు 504-513.

స్వాధిష్ఠానాంబుజగతా చతుర్వక్త్ర మనోహరా
శూలాధ్యాయుధసంపన్నా పీతవర్ణాదిగర్వితా
మేదోనిష్ఠా మధుప్రీతా బంధిన్యాది సమన్వితా
దధ్యాన్నాసక్తహృదయా కాకినీరూపధారిణీ

ఆమె కాకినిగా స్వాధిష్ఠానమందు నాలుగు అందమైన ముఖములతో త్రిశూలము, ఇతర ఆయుధములు ధరించియుండును. పసుపు వర్ణము కలది. తనయొక్క అత్యంత సౌందర్యమునకు గర్వించునది. మేడలలో నివసించు ఈమె బంధినీ తదితర సేవికలతో ఆనందించుచుండును. దధ్యోజనము, తేనె ఈమెకు మిక్కిలి ప్రీతికరములు.

3.మణిపూరము: లలితాసహస్రనామములో ఈ చక్రమునకు సంబంధించిన నామములు 495-503.

మణిపూరాబ్జనిలయా వదనత్రయఫలయితా
వజ్రాదికాయుధోపేతా డామర్యాదిభిరావృతా
రక్తవర్ణం మాంసనిష్ఠా గుడాన్నప్రీతమనసా
సమస్తభక్తసుఖదా లాకిన్యాంబాస్వరూపిణీ

పది పద్మదళముల మణిపూరమందు లాకిన్యాంబగా మూడు వదనములతో వసించును. వజ్రము, మూడు ఆయుధములు గల్గిన ఈమెకు దామరీ పది ఇతర శక్తులు సేవికలు. రక్తవర్ణముతో నుండును. మాంసము, గుడాన్నము మిక్కిలి ప్రీతికరములు. భక్తులకు సుఖములు ప్రసాదించును.

4.అనాహతము: లలితా సహస్రనామములో ఈ చక్రమునకు సంబంధించిన నామములు 485-494.

అనాహతాబ్జనిలయా శ్యామాభా వదనద్వయా
దంష్ట్రోజ్జ్వలాక్షమాలాదిధరా రుధిరసంస్థితా
కాలరాత్ర్యాది శక్త్యోఘవృతా స్నిగ్ధౌదనప్రియా
మహావీరేంద్రవరదా రాకిణ్యంబాస్వరూపిణీ

అనాహత చక్రములో రాకిణీగా నీలవర్ణములో రెండు వదనములతో వాడియైన దంతములు కలిగియుండును. మెడలో పూసలహారము ధరించి రక్తమందుండును. కాళరాత్రి, పంద్రెండు ఇతర శక్తులు ఈమెకు సేవికలు. ఘృతాన్నము మిక్కిలి ప్రీతి. మహావీరేంద్రునకు వరము ప్రసాదించెను (తురీయస్థితి లేక మనస్సు కతీతమైన స్థితి చేరినవారు).

5.విశుద్ధ చక్రము: లలితా సహస్రనామములో ఈ చక్రమునకు సంబంధించిన నామములు 475-484.

విశుద్ధచక్రనిలయారక్తవర్ణాం త్రిలోచనా
ఖట్వాంగాది ప్రహరణా వదనైక సమన్వితా

పాయసాన్నప్రియా త్వక్స్థా పశులోక భయంకరీ
అమృతాది మహాశక్తి సంవృతా డాకినీశ్వరీ

విశుద్ధ చక్రమునందు శ్వేతవర్ణములో డాకినిగా త్రినేత్రములతో ఉండును. ఖట్వాంగములవంటి ఆయుధములను (అనగా మంచపుకోడులో మనిషిపుర్రె గుచ్చినట్లు) కలిగియుండు ఈమె ఏకవదనము గలది. క్షీరాన్నము మిక్కిలి ప్రీతి. చర్మమందు ఉండు ఈమె ద్వంద్వ మనస్తత్త్వము గలవారికి భయంకరముగా గోచరించును. అమృతాది మహాశక్తులు ఆమె సేవికలు.

6.ఆజ్ఞా చక్రము: లలితా సహస్రనామములో సంబంధించిన నామములు 521-527.

ఆజ్ఞాచక్రాబ్జనిలయా శుక్లవర్ణా షడాననా
మజ్జాసంస్థా హంసవతీ ముఖ్యశక్తి సమన్వితా
హరిద్రాన్నైకరసికా హాకినీరూపధారిణీ

రెండు కనుబొమ్మల మధ్యనుండు ఆజ్ఞాచక్రములో హాకినిగా శ్వేతవర్ణములో ఆరు ముఖములతో నుండును. మజ్జయందు వసించు ఈమె సేవికలు హంసవతి మొదలగు ముఖ్యశక్తులు. పులిహోర మిక్కిలి ప్రీతి.

7.సహస్రారము: లలితా సహస్రనామములో దీనికి సంబంధించిన నామములు 528-534.

సహస్రదళపద్మస్థా సర్వవర్ణోపశోభితా
సర్వాయుధధరా శుక్లసంస్థితా సర్వతోముఖీ
సర్వౌదనప్రీతచిత్తా యాకిన్యాంబాస్వరూపిణీ

సహస్రపద్మదళములు గల ఈ చక్రము పరమోత్కృష్టమైనది. యాకినీరూపములో సకల వర్ణములతో, సర్వాయుధములు ధరించి శుక్లమునందు ఉండును. ఈమె వదనము అన్ని దిక్కులవైపు యుండును. సమస్త ఆహార పదార్థములు ప్రీతికరములే.

మానవ శరీరములో చక్రములకు ప్రాముఖ్యము నిచ్చుట ఎందులకనగా, మహాత్రిపురసుందరీ (లలితా) వివిధ రూపములను గుర్తించుట కొరకు, మానవ శరీరముయొక్క అద్వైత స్వరూపమును (దివ్యత్వమును) నిర్ధారించుట కొరకు, మరొకవైపు ఈ చక్రములందున్న శక్తులను జాగృతము చేయుట కొరకు.

కుండలిని జాగృతము చేయబడినపుడు, అది మూలాధారమునుండి క్రమక్రమంగా సహస్రారము వరకు ప్రయాణించును. నాడు లన్నిటిలో ఇడ, పింగళ అను రెండు నాడులు మిక్కిలి ప్రాముఖ్యము గలవి, సుషమ్నా నాడి కిరువైపుల నుండును. ఇడ నాడి శరీరముయొక్క చంద్ర తత్త్వమును, పింగళనాడి సూర్య తత్త్వమును సూచించును. ఇడ నాడి ద్వారా శ్వాస నాసిక ఎడమ రంధ్రమును, పింగళ నాడి ద్వారా కుడి రంధ్రమును చేరును. ఇడనాడి శరీరమును చల్లపరచగా, పింగళనాడి శరీరమునకు వేడి నిచ్చును.

ఈ రెండు నాడులు కుండలినీ దగ్గరగా నున్న మూలాధారము దగ్గర కలిసికొనును. మూడున్నర చుట్టలు చుట్టుకొని, సుషమ్న దగ్గర నోరు తెరచుకొని నిద్రించుచున్న సర్పమును కుండలినీ ప్రతీకగా

వర్ణించెదరు. ఇడ పింగళ నాడుల కార్యకలాపములను శ్వాసను క్రమబద్ధీకరించుట ద్వారా నిగ్రహించవచ్చును. కుండలినీ శక్తిని ఒక పద్ధతి ప్రకారము జాగృతము చేసినచో, సాధకుడికి వివిధ రకములైన శక్తి సామర్థ్యములు కలుగుటేకాక, మరొక విధంగా లభించని అనేక సిద్ధులు కూడ ప్రాప్తించును. అష్టాంగయోగము నభ్యసించుట ద్వారా ఇది సాధ్యమగును. కాబట్టి గురువు సహాయముతో అష్టాంగయోగము నభ్యసించవలెను.

శ్రీచక్రములోని చతుర్దశార ఆవరణమందు పదనాలుగు నాడులలో ఇడ, పింగళ, సుషుమ్న నాడులు కలవు (సౌభాగ్యదాయక చక్రము పట్టిక-6 చూడుడు). భూపుర చక్రములోని లోపలి రేఖ పది స్త్రీ దేవతలకు సంబంధించినది; వీరిని ముద్రాశక్తులందురు. ఈ ముద్రాశక్తులు శరీరములోని ఆరు చక్రస్థానములు, అకుల, లంబిక, బిందు, సహస్రారములచే సూచించబడుచున్నవి (భూపుర చక్రము పట్టిక-3 చూడుడు).

మానవ శరీరములోని చక్రములు శ్రీచక్రముయొక్క క్షేత్రగణితము మధ్య సమన్వయము కొరకు తాంత్రిక గ్రంథములు, శ్రీవిద్యానుయాయులు ప్రయత్నములు చేసిరి. ఈ దిశగా స్థూలస్థాయితో మొదలుపెట్టి, క్రమక్రమంగా సూక్ష్మస్థాయి వరకు అంతరములవారీగా వ్యాఖ్యానములు, భాష్యములు వెలువడెను. స్థూలస్థాయిలో శరీరము శ్రీచక్రముల మధ్య అన్వయము ఈ క్రింది శ్లోకములో వివరించబడెను.

త్రికోణమష్టకోణం చ దశకోణద్వయం తథా।
మనుకోణం చతుష్కోణం కోణచక్రాణి షట్కమాత్ ॥
మూలాధారం తథా స్వాధిష్ఠానం చ మణిపూరకమ్।
అనాహతం విశుద్ధారఖ్యం ఆజ్ఞాచక్రం విదుర్బుధాః ॥

మూలాధారమునకు త్రిభుజము
స్వాధిష్ఠానమునకు అష్టకోణము
మణిపూరమునకు అంతర్దశారము
అనాహతమునకు బహిర్దశారము
విశుద్ధమునకు చతుర్దశారము
ఆజ్ఞాచక్రమునకు చతురస్రము
వరుసగా సరిపోవును.

మరొక దృక్కోణము ప్రకారము, మానవశరీరములోని నవద్వారములు అష్టచక్రములు, శ్రీచక్రములోని తొమ్మిది త్రిభుజములు ఎనిమిది చక్రములకు సరిపోవునని చెప్పబడుచున్నది.

అష్టచక్రా నవద్వారా దేవానాం పరయోధ్యథా
తస్యాం హిరణ్మయః కోశః స్వర్గో లోకో జ్యోతిషావృతః
(అరుణోపనిషత్తు)

శ్రీచక్రము సకల దేవీ దేవతలకు నిలయము. కేంద్రబిందువు ప్రకాశములన్నిటికి మూలస్థానము. దీనిని జ్యోతిర్మయకోశమందురు. అనగా స్వర్గమని భావము. సాధకుని శరీరము ఎనిమిది చక్రములు (లంబికా శిఖరముపైనున్న చక్రముతో సహా) గలది. నవద్వారములు, జ్ఞానేంద్రియములకు అధిపతులైన ఇంద్ర వరుణాది దేవతలకు నిలయము. ప్రారంభదశలోనున్న సాధకులకు ఇది సులభముగా అర్థము కాదు. కాబట్టి గురూపదేశము పొందనివారికి, శ్రీచక్రము మానవదేహము ఏకమని భావించి ఉపాసించుట (అనగా అంతర్ముఖ సాధన) సాధ్యము కాదు. శ్రీచక్రమును శరీరముతో ఏకము గావించుట గురించి తంత్రరాజము ఈవిధంగా

చెప్పుచున్నది.

జ్ఞాతా స్వాత్మా భవేత్‌జ్ఞానమ్ అర్ఘ్యం జ్ఞేయం హవిస్స్థితం
శ్రీచక్రపూజనం తేషామ్ ఏకీకరణమీరితమ్

జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను మూడింటి ఏకత్వమును నిర్ధారించుటయే శ్రీచక్రోపాసన లక్ష్యము. ఈ ప్రక్రియలో అంతరములవారీగా మూడు వివిధ మార్గములు కలవు. స్థూలఉపాసనలో సాధకుడు, మానవ శరీరములోని చక్రములు, శ్రీచక్ర ఆవరణముల మధ్య సమన్వయము ఈ క్రింది విధముగా సాధించవలెను.

. శ్రీచక్రములోని బిందువుకు, సహస్రారములోని సహస్రదళపద్మమునకు సంబంధ మేర్పరచి చంద్రమండలముగా పరిగణించుట

. శ్రీచక్రములోని త్రిభుజము, ఆజ్ఞాచక్రములోని తామరపూవు నడిమికి సరిపోవునని భావించుట

. శ్రీచక్రములోని అష్టకోణము, విశుద్ధ చక్రములోని తామరపూవు నడిమికి సరిపోవునని భావించుట.

.శ్రీచక్రములోని అంతర్దశారము, అనాహతములోని తామరపూవు నడిమికి సరిపోవునని భావించుట.

. శ్రీచక్రములోని బహిర్దశారము, మణిపూరములోని పద్మముయొక్క ఆధారమునకు సరిపడునని భావించుట

. శ్రీచక్రములోని చతుర్దశారము, స్వాధిష్ఠానములోని తామరపూవు నడిమిగా పరిగణించుట.

. శ్రీచక్రములోని భూపురము, మూలాధారమందున్న తామరపూవు నడిమికి సరిసమానముగా ఉన్నట్లు భావించుట.

స్థూలస్థాయిని అధిగమించి, సూక్ష్మస్థాయిలో వేరొక విధంగా విభిన్నంగా వివరించబడుచున్నది. ఆజ్ఞా సహస్రార చక్రముల మధ్య తొమ్మిది సూక్ష్మచక్రములు ఉన్నట్లు చెప్పబడుచున్నది. అవి:

1. చంద్ర మండలము, చంద్రుడు
2. అర్ధచంద్రుడు, చంద్రవంక
3. రోధిని
4. నాద
5. నాదాంత
6. శక్తి
7. వ్యాపిక
8. సమన
9. ఉన్మన

ఇవి వరుసగా శ్రీచక్రములో బాహ్యచతురస్రమునుండి కేంద్రబిందువు వరకు క్రింది శ్లోకములో వివరించినట్లు, సరిమానముగా పరిగణించబడుచున్నవి.

ఇందౌ తదర్ధే రోధిన్యాం నాద నాదాంత ఏవ చ ।
శక్తౌ పునర్వ్యాపికాయాం సమనోన్మనగరేవే చ ।
మహాబిందౌ పునశ్చైవ త్రిధాచక్రం తు భావయేత్ ॥

పై తొమ్మిది చక్రముల స్థానములు, వాటి నామముల గురించి వివిధ అభిప్రాయములు కలవు. కాని అవి ఆజ్ఞా, సహస్రార చక్రముల మధ్యగలవని అన్నియు అంగీకరించుచున్నవి.

మానవ చక్రములు, శ్రీచక్రముల మధ్య పొందిక విషయమై మూడవ సూక్ష్మతర వివరణ ఒకటి కలదు. ఇది సులభముగా చెప్పబడినను, అనుభవించి ఆచరించుట చాల కష్టము. ఈ సమీకరణములో సాధకుడు. శ్రీచక్రము సహస్రారములో శక్తులు కలవని అనుభవపూర్వకముగా తెలిసికొనవలెను. ఇది కుండలినీ సంపూర్ణముగా జాగృతము చేసిన వారికి మాత్రమే సాధ్యపడును.

'సమయ' సిద్ధాంతము, అనగా దక్షిణాచారము శ్రీచక్రోపాసనను భావార్ధరూపములో ప్రతిపాదించుచున్నది. మానవచక్రములలో మూలాధారము, స్వాధిష్ఠాన చక్రములను మినహాయించి ఇతర చక్రములలో ఉపాసన చేయవచ్చును. మూలాధార స్వాధిష్ఠాన చక్రములు తామసిక లేక అంధ లోకములకు సూచకములైనందున, అవి మినహాయించబడినవి.

భావార్ధరూపములో శ్రీచక్రమును మానవ చక్రములలో ఉపాసించినపుడు, సాధకుడు పొందు అనుభవములు వివరించబడినవి. మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రములయొద్ద సాధకుడు ఉపాసన చేసినపుడు సార్ష్టి, సాలోక్య, సామీప్య, సారూప్య అనుభవములు వరుసగా అనుగ్రహింపబడునని చెప్పబడుచున్నది. అనగా సాధకుడు లేక భక్తుడు దేవిని దగ్గరగా దర్శించగల్గును, దేవికి సమీపములో ఉండగల్గును. మరియు వివిధ చక్రములలో ఆమెతో ఏకత్వము పొందగల్గును. ఇవి సాయుజ్యము పొందుటకు ముందు సాధకునకు చేకూరు ప్రాథమిక లాభములు. సాయుజ్యమనగా పరమానందానుభవము. మానవ చక్రములో సహస్రారమును, శ్రీచక్రములో బిందువు, చేరుకొనినపుడు, సాధకుడు పరమానందానుభవము పొందగల్గును.

సాధకుడు శ్వాస నిగ్రహించి, మానవ చక్రములు వాటికి సరిసమానమగు శ్రీచక్ర ఆవరణలపై ఏకాగ్రతతో మనసు నిలుపుట 'ధారణ' అనబడును. ధారణ అభ్యసించిన సాధకునకు వివిధ శక్తి సామర్థ్యములు చేకూరును.

మూలాధారము దగ్గర చేయు ధారణ వలన భవిష్య జ్ఞానము (మతి) కలుగును.
స్వాధిష్ఠానముయొద్ద చేయు ధారణ వలన గత స్మృతులను (పురాతన కాలము నాటివి కూడ) జ్ఞాపకముంచుకొను శక్తి పెరుగును.
మణిపూరముయొద్ద చేయు ధారణ వలన ధీశక్తి (బుద్ధి) కలుగును, ఇది తక్షణము కలుగును, కాని తాత్కాలికము.
అనాహతము దగ్గర చేయు ధారణ వలన ప్రజ్ఞ, అనగా కాలాతీత విషయములను అవగాహన చేసికొను శక్తి ఏర్పడును.
విశుద్ధ చక్రము యొద్ద చేయు ధారణ వలన మేధాశక్తి పెంపొందును. దీనివలన విస్మృతి యెన్నడు కలుగదు.
ఆజ్ఞా చక్రము దగ్గర ధారణ చేయుట వలన సాధకునకు ప్రతిభాశక్తి కలుగును.

'నవనవోన్మేషశాలిని' అనగా నిత్య ప్రతిభాశాలి యగును.

చివరగా సహస్రారము దగ్గర ధారణ చేయుటవలన సాధకునకు పరమోత్కృష్ట జ్ఞానము కలుగును.

మానవ శరీరములో వివరించబడిన ఊహా చక్రములలో మూడు గ్రంథులు (ముడులు) ఉన్నవి. ఇవి ప్రతి రెండు చక్రముల మధ్య గలవు. స్వాధిష్ఠాన చక్రము దగ్గర నున్న గ్రంథిని రుద్ర గ్రంథి, అనాహత చక్రము దగ్గర నున్న గ్రంథి విష్ణు గ్రంథి, ఆజ్ఞా చక్రము దగ్గర నున్న గ్రంథి బ్రహ్మ గ్రంథి యందురు. ఈ మూడు గ్రంథులు శ్రీచక్రములో విస్మరించబడిన వృత్తత్రయమునకు సరిపోవును.

బాలామంత్రమునందు ఉదహరించబడిన బీజాక్షరములు కూడ చక్రద్వయములతో సంబంధము కలిగియున్నవి. క్రింది పట్టికలో దీనిని చూడవచ్చును.

క్రమసంఖ్య	చక్రనామము	బీజాక్షరములు	సరిపడు యంత్రము	సూచించబడు అగ్ని
1	మూలాధారము		త్రికోణ	
		ఏం		సూర్యుడు
2	స్వాధిష్ఠానము		అష్టకోణ	
3	మణిపూరము		అంతర్దశారము	
		క్లీం	బహిర్దశారము	చంద్రుడు
4	అనాహతము		చతుర్దశారము	
5	విశుద్ధము		అష్టదళము	
		సౌః		అగ్ని
6	ఆజ్ఞా		షోడశదళము	

మానవ శరీరము తొమ్మిది మణులు గల ద్వీపమని కామికాగమము వి పేర్కొనుచున్నది. ఈ తొమ్మిది మణులు శ్రీచక్రమందున్న తొమ్మిది చక్రములను సూచించును. ప్రతి మానవునిలోని ప్రాణశక్తి (జీవశక్తి) జీవతత్త్వములో ఒక భాగము. ఈ తత్త్వమే సృష్టికి స్థితికి కారణము. మానవునికి విశ్వమునకు మధ్య నున్న సామరస్యము, అటులనే దివ్యత్వము మానవత్వముల మధ్యనున్న సామరస్యము, శ్రీచక్రము–శ్రీవిద్యా–శరీరముల మధ్య గల సమన్వయము నర్థము చేసికొను ప్రక్రియలో ప్రతిబింబించుచున్నది.

6 త్రిపురసుందరీదేవి

త్రిపురసుందరీదేవి

శ్రీవిద్యకు యంత్రము శ్రీచక్రము, మంత్రము పంచదశి, దేవి మహాత్రిపురసుందరి. శ్రీచక్రములోని నవావరణముల అధిదేవతల నామములను గమనించినచో, ఆ నామములన్నియు 'త్రిపుర' శబ్దముతో ఆరంభమగుట ఒక విశేషము.

క్రమసంఖ్య	చక్రము	చక్రనామము	అధిదేవత
1	భూపుర	త్రైలోక్యమోహన చక్రము	త్రిపురా
2	షోడశదళ	సర్వాశాపరిపూరక చక్రము	త్రిపురేశ్వరీ
3	అష్టదళ	సర్వసంక్షోభణ చక్రము	త్రిపురేశ్వరీ
4	మన్వస్ర	సర్వసౌభాగ్యదాయక చక్రము	త్రిపురవాసినీ
5	బహిర్దశార	సర్వార్థసాధక చక్రము	త్రిపురశ్రీ
6	అంతర్దశార	సర్వరక్షాకర చక్రము	త్రిపురమాలినీ
7	వసుకోణ	సర్వరోగహర చక్రము	త్రిపురసిద్ధి
8	త్రికోణ	సర్వసిద్ధిప్రద చక్రము	త్రిపురాంబ
9	బిందు	సర్వానందమయ చక్రము	మహాత్రిపురసుందరీ

అనేక ఇతర నామములతో కూడ ఈమె పిలువబడుచున్నది. వీటిలో అత్యంత ముఖ్యమైనది 'కామకలా'. ఇతర నామములు లలితా, పరభట్టారికా, రాజరాజేశ్వరీ మొదలగునవి. లలితా సహస్రనామము ఈమెను 'కామకలారూప'గా వర్ణించినది (322).

కామ్యా కామకలారూపా కదంబకుసుమప్రియా

తాంత్రిక గ్రంథములు, 'కామకలా' అను విషయమును విశదముగా వివరించినవి. శివుడు ప్రకాశస్వరూపముగను, శక్తి 'విమర్శ' స్వరూపముగను తెలియబడుచున్నారు. వారి సంయోగము 'బిందు' వనబడుచున్నది. ఈ బిందువునుండి నాదము ఉత్పత్తి యగుచున్నది. ఈ ప్రక్రియ మొత్తము 'కామ' మని చెప్పబడుచున్నది. పురుషశక్తి శ్వేతబిందువుగను, స్త్రీశక్తి రక్తబిందువుగను సూచించబడుచున్నది. ఈ రెండింటి కలయికను 'కామకలా' అందురు. కాబట్టి ఇచట వాస్తవముగా నాలుగు శక్తుల కలయికను – మూలబిందు, నాదము, శ్వేతబిందు, రక్తబిందు – గమనించవచ్చును. ఈ నాలుగు శక్తుల మిశ్రమము తిరిగి విశ్వము నుత్పత్తి చేయుచున్నది. సూర్యుడు సృష్టి ముఖమును సూచించగా, చంద్రుడు అగ్ని సృష్టి స్తనములను సూచించుచున్నవి. ఈ అద్భుతభావమే త్రిపురసుందరీదేవిగా చెప్పబడుచున్నది.

కామకలా విలాసములో ఈ విషయము విస్తరముగా ప్రస్తావించబడినది. కామకల త్రిపురసుందరీదేవి శరీరముగా ధ్యానింపబడుచున్నది. అందులోని మూడు బిందువులు (చుక్కలు) 'త్రయీ'గా (triplet) పరిగణించబడుచున్నవి.

.	ఇచ్ఛా	జ్ఞాన	క్రియా
.	చంద్ర	అగ్ని	సూర్య
.	సత్త్వ	రజస్	తమస్
.	బ్రహ్మ	రుద్ర	విష్ణు

త్రిపుర పదమునకు వేర్వేరు సిద్ధాంతములు విభిన్న నిర్వచనములు చెప్పినవి.

కొన్ని తాంత్రిక గ్రంథములు, ఆమె త్రిమూర్తులకన్న పురాతనమైనందున, ఆమెను 'త్రిపురా' అని వర్ణించినవి.

తిసృభ్యో మూర్తిభ్యః పురాతనత్వాత్ త్రిపురా
మూర్తిత్రయస్యాపి పురాతనత్వాత్తదంబికాయాస్త్రిపురేతి నామేతి

ఆమె ఏకైక పరబ్రహ్మతత్త్వమునకు ప్రతీక. మరియు ఆమె మూడు తత్త్వములుగా రూపొందుచున్నది.

తత్త్వత్రయేణ భిదా ఇతి త్రిపురా
ఏకమేవ బ్రహ్మ తత్త్వత్రయేణ భిద్యతే ఇత్యర్థః
– సౌభాగ్య భాస్కర

కాలికా పురాణము, త్రయీతత్త్వము దేనియందుండునో, అది 'త్రిపురా' అని చెప్పుచున్నది.

సర్వత్రయం త్రయం యస్యాత్తస్మాత్ త్రిపురా మతా

ఆమె సకల త్రయీ తత్త్వములను సూచించును. మూడు వేదములు, మూడు అగ్ని స్వరూపములు, మూడు శక్తి స్వరూపములు, మూడు ఉచ్చారణ స్వరములు, మూడు స్థితులు, మూడు కులములు విశదీకరించబడినవి.

వేదానాం త్రితయం హుతభుజాం శక్తిత్రయాం త్రిస్వరాః
త్రైలోక్యం త్రిపురీ త్రిపుష్కరమథ త్రిబ్రహ్మ వర్ణాస్త్రయః
యత్కించజ్జగతి త్రిధా నియమితం వస్తు త్రివర్ణాత్మకం
తత్సర్వం త్రిపురేతి నామ భగవత్యన్వేతి తే తత్త్వతః

వేరొక నిర్వచనములో కుండలినీ తత్త్వము పొందుపరచబడినది. పింగళ, ఇడ, సుషుమ్నా నాడులను కూడ త్రిపురా శబ్దము సూచించునని ఈ నిర్వచనము పేర్కొనుచున్నది.

నాడీత్రయం తు త్రిపురా సుషుమ్నా పింగళా ఇడా

మనస్సు, బుద్ధి, అహంకారములను కూడ త్రిపురా పటము సూచించును.

మనోబుద్ధిస్తథా చిత్రం పురత్రయముదాహృతమ్

త్రికోణములోనుండు దేవియే త్రిపుర అని కాలికా పురాణము తెలియజేయుచున్నది.

త్రికోణం మండలం యస్యాః

కామకలా విలాసము 'త్రిపుర'ను వేరొక విధంగా నిర్వచించుచున్నది.

ఎవరు జ్ఞాత–జ్ఞానము–జ్ఞేయము ఒకటియని భావించెదరో, వారు మహాత్రిపురసుందరీదేవితో ఏకాత్మానుభవము పొందగలరు.

మాతా మానం మేయం బిందుత్రయభిన్నబీజరూపాణి ।
ధామత్రయ పీఠత్రయ శక్తిత్రయ భేదభావితాన్యాపి చ ॥
తేషు క్రమేణ లింగత్రితయం తద్వచ్చ మాతృకాత్రితయం ।
ఇత్థం త్రితయపురీ యా తురీయపీఠాదిభేదినీ విద్యా ॥
ఇతి కామకలా విద్యా దేవీచక్రమాత్మికా సేయమ్ ।
విదితా యేన స ముక్తో భవతి మహాత్రిపురసుందరీరూపః ॥

వామకేశ్వర తంత్రము మహాత్రిపురసుందరీ లక్షణములను పేర్కొనుచున్నది.

ఆమె సర్వమునకు ఆది. ఆమె కామకల, శబ్దరూపములోనున్న పరబ్రహ్మము, నిర్మల శక్తిరూపము. స్థూలరూపములో ఆమె విశ్వము, మరియు ఆమె అన్ని శక్తిరూపముల సారము.

సకలాద్యా స్థితే హృద్యే కామరాజకలాత్మికే ।
శబ్దబ్రహ్మమయీ స్వచ్ఛా దేవీ త్రిపురసుందరీ ॥
యదా సా పరమా శక్తిః స్వేచ్ఛయా విశ్వరూపిణీ ।
సా స్ఫురితా మహాసత్తా సైషా సారతయా ప్రోక్తా ॥

సౌందర్యలహరిలో శ్రీ ఆదిశంకరాచార్యులవారు, ఆమె శివుని దేహమని, శివుడికి బిన్నము కాదని వర్ణించిరి. లలితా సహస్రనామము (626–630) ఆమెను త్రిపుర అని, ముల్లోకములచే పూజింపబడునదని, మూర్తీభవించిన త్రిమూర్తుల స్వరూపమని, సకల దేవతలచే ఉపాసించబడునదని, మూడక్షరముల 'బాలా' మంత్రముచే తెలియబడునదని, మూడు అక్షర స్వరూపములని వర్ణించుచున్నది.

త్రిపురా త్రిజగద్వంద్యా త్రిమూర్తిస్త్రిదశేశ్వరీ త్ర్యక్షరీ

బాలా మంత్రములో మూడు అక్షరములు ఉండుటచే ఆమె 'త్ర్యక్షరీ' అని పిలువబడుచున్నది. మరియు 'బాలా' మంత్రోపాసకులకు ఆమె బాలాత్రిపురసుందరీదేవి.

త్రిపురసుందరీగా ఆమెకు మూడు రూపములు కలవు.

త్రిపుర సుందరీ

పర	సూక్ష్మ	స్థూల	
ఇచ్ఛా			బ్రహ్మ
జ్ఞాన	వామ జ్యేష్ఠ	రౌద్ర	విష్ణు
క్రియా			ఈశ్వర

దశమహావిద్యలందు మహాత్రిపుర సుందరీదేవి షోడశిగా చెప్పబడినది. పరమశివుని స్త్రీరూపము కూడ త్రిపురసుందరిగా వర్ణించబడినది. ఆమె సకల తత్త్వముల సారము. మరియు విమోచన జ్ఞానముయొక్క అత్యంత సూక్ష్మ రహస్యరూపము.

అనేక శాక్తోపనిషత్తులు మహాత్రిపుర సుందరీదేవి అత్యంత దివ్యానందస్వరూపమని వర్ణించినవి. ఆమె వివిధ అక్షర, నాద, మంత్రశబ్దముల శరీరముగా వర్ణించబడినది.

ఈమె చక్రము, మంత్రము, పూజ ద్వారా తెలియబడుచున్నదని యోగినీ హృదయము పేర్కొనుచున్నది.

చక్రసంకేతకో మంత్రపూజాసంకేతకౌ తథా।
త్రివిధస్త్రిపురాదేవ్యాః సంకేతః పరమేశ్వరి॥

ఆమెయొక్క స్థూల, సూక్ష్మ, పరమ స్వరూపములను నిత్యాషోడశికార్ణవము వర్ణించుచున్నది.

త్రిపురా పరమా శక్తిరాద్యా జాతాదితః ప్రియే।
స్థూలసూక్ష్మవిభేదేన త్రైలోక్యోత్పత్తిమాతృకా॥

ఆమె కుండలినియందు ఉన్నట్లు ఆదిశంకరులు సౌందర్యలహరిలో పేర్కొనిరి. శ్రీచక్రములోని యంత్రరూపముగా త్రిపుర సుందరీదేవి పూజించబడుచున్నది. ఆమె శ్రీచక్రముగా మూర్తీభవించినదని నిత్యాషోడశికార్ణవము వివరించుచున్నది.

చక్రస్యాపి మహేశ్యా న భేదలేశోఽపి భావ్యతే విబుధైః।
సంస్థితా ఽత్ర మహాచక్రే మహాత్రిపురసుందరీ॥

శ్రీచక్రోపాసనలో అనేక మార్గములు కలవు. త్రిపురసుందరీదేవి తనకుతాను విశ్వరూపములో ఉండుననియు, తననుతాను వెనుదిరిగి చూచుకొనినపుడు శ్రీచక్రరూపములో ఉండునని యోగినీ హృదయము

తెలుపుచున్నది. చక్రము విశాలమగు దట్టమైన చైతన్యానందముతో తొమ్మిది యోనులు (మూలములు) కలిగియున్నది.

నవయోన్యాత్మకమిదం చిదానందఘనం మహత్

ఇంతకు పూర్వము చెప్పినట్లు సర్వోత్కృష్టము, సంపూర్ణము, నిర్వికారము, వాచామగోచరము, తేజోవంతమైన ప్రకాశమే పరమసత్యమని తంత్రములు విశ్వసించుచున్నవి. ఈ ప్రకాశము వ్యక్తము కాదలచినపుడు, తీసికొనబడు స్వయంకృషిని 'విమర్శ' అందురు. అనగా మననము లేక ఆలోచన చేయుట. కామకలా విలాసము ఈ విషయమును అందముగా వివరించుచున్నది.

సా జయతి శక్తిరాద్యా నిజసుఖమయనిత్యనిరూపమాకారా।
భావిచరాచరబీజం శివరూపవిమర్శనిర్మలాదర్శః ॥

శక్తిదర్పణములో శివుడు తననుతాను చూచుకొనునని, ఈ కలయిక లేక ఇచ్ఛయే కామమని చెప్పబడుచున్నది. ఈ కామప్రవృత్తిచే ఉత్పన్నమయే ఆలోచనాతరంగములకు కారణమై నాదతరంగము లేర్పడుచున్నవి. తదుపరి ఈ నాదము బిందువుగా కేంద్రీకృతమగుచున్నది. ఇదియే విశ్వజననీజనకులగు – కామేశ్వర, కామేశ్వరీ – నివాసము. అందుచేత ఇది 'పరాబిందు'వని పిలువబడుచున్నది. ఈ పరాబిందువునుండి త్రికోణము ఉత్పన్నమై శ్రీచక్రము రూపొందుటకు ఆరంభముగా నున్నది.

శ్రీచక్రముయొక్క మూలమునకు సంబంధించి పురాణములలో రెండు గాథలు చెప్పబడెను. రేణుకాపురాణములో ఇట్లున్నది. ఇక్ష్వాకువంశములో రేణు అను మహారాజు ఉండెడివాడు. అతడు దేవి కొరకు తీవ్రమైన తపస్సు ఆచరించెను. ఆమె హోమాగ్నిలో శ్రీచక్రబిందువుగా గోచరించెను.

లలితా సహస్రనామమునందు ఆమెకుగల వివిధ నామములలో 'చిదగ్నికుండసంభూతా' (4) ఒకటి .

శ్రీచక్ర ఆవిర్భావమునకు సంబంధించిన రెండవ గాథ బ్రహ్మాండపురాణములో కలదు. భండాసురుని దేవి సంహరించదలచినపుడు, దేవతలందరు తమ రక్తమాంసములను అగ్నికి సమర్పించిరి. వారి త్యాగమునకు సంతసించి, ఆమె శ్రీచక్రముగా వారికి దృగ్గోచరమయ్యెను.

లలితా సహస్రనామమందు ఆమెకుగల అనేక నామములలో 'దేవకార్యసముద్యతా' అన్నదొకటి.

ప్రకాశ, విమర్శలు లేక శివశక్తుల సంయోగముచే ఏర్పడిన బిందువు త్రికోణముగా రూపొంది, తరువాత అష్టకోణముగా వ్యక్తమగుచున్నది. ఇది మరల రెండు దశారములుగా రూపొంది, యీ ప్రక్రియ కొనసాగి, వారి సంయోగము బహుళమగుటకు ప్రతీకగా ఉన్నది. ఈ కారణముచేతనే తంత్రములు శ్రీచక్రమును 'చిదానందఘనమ్ మహత్' అని వర్ణించినవి.

చంద్రుని కళలను వస్తువుగా తీసికొని త్రిపుర సుందరీదేవి ఉపాసన చేయబడుచున్నది. చంద్రునికి పదహారు కళలు ఉండుట సర్వవిదితము. అవి యన్నియు 'నిత్య'ముగా పరిగణింపబడుటచే 'నిత్యా షోడశికా' అందురు. మొదటి పదిహేను కళలు పెరుగుచు తరుగుచుండును. కాని పదహారవ కళ ఎల్లప్పుడు ఒకే రూపములో నుండును. అందుచే దీనిని 'అమృతా కళా' అందురు.

వ్యాకరణ పండితులు దీనిని 'పశ్యంతి వాక్' అందురు. అనగా దృగ్గోచర శబ్దము. ఈ పదహారవకళ, అనగా షోడశీ, మహాత్రిపుర సుందరీ, లలితా అను పదములకు పర్యాయపదముగా నున్నది. ఈమె పదహారు సంవత్సరముల కన్యగా వర్ణించబడుచున్నది. చంద్రుని కళలలో ప్రతి ఒక్క కళ, శుక్లపక్షమిలో పాడ్యమి మొదలు పూర్ణిమవరకు, అధిదేవతకు ఒక నామము కలదు. ఆ ప్రకారము చంద్రుని కళలన్నిటికి నామములు ఉన్నవని స్పష్టమగును. మరొక సిద్ధాంతము ప్రకారము పగటి సమయమునకు ఒక నామము, కృష్ణపక్షములో ఒక నామము ఉన్నట్లు చెప్పబడుచున్నది. ఈ పదహారు కళలు, వాటి నామములు, మంత్రములోని పదహారు అక్షరములను ప్రతిబింబించుచున్నవి. క్రింది పట్టికలో వాటిని చూడవచ్చును.

మంత్రము	శుక్లపక్షకళ	అధిదేవత	ప్రకృతి	ఖండము	యంత్రము
క	1	కామేశ్వరి	శివ		త్రికోణము
ఎ	2	భగమాలిని	శక్తి		అష్టకోణము
ఈ	3	నిత్యక్లిన్నా	మాయా	అగ్ని	అంతర్దశారము
ల	4	భేరుండా	శుద్ధవిద్యా		
హ్రీం	5	వహ్నివాసిని	జలము		
హ	6	మహావజ్రేశ్వరి	ప్రకాశము		బహిర్దశారము
స	7	శివదూతి	వాయువు		
క	8	త్వరితా	మనస్సు	సూర్యుడు	చతుర్దశారము
హ	9	కులసుందరీ	పృథివి		
ల	10	నిత్యా	ఆకాశము		
హ్రీం	11	నీలపతాకా	విద్యా		
స	12	విజయా	మహేశ్వర		
క	13	సర్వమంగళా	పరతత్త్వ		
ల	14	జ్వాలామాలినీ	ఆత్మతత్త్వ		
హ్రీం	15	చిత్రా	సదాశివ		
శ్రీం	16	లలితా	సదాఖ్య	చంద్రకళా	నిత్యకళా

కామకలా విలాసము ప్రకారము పదిహేను నిత్యలు పదిహేను శుక్లపక్ష తిధులను తెలియజేయును. శుక్లపక్ష తిథులు శివశక్తుల సమరసమును సూచించును. అవి దివారాత్రములతో నుండును. అవి మంత్రములోని అక్షరములు, అవి ప్రకృతి, విమర్శ అను రెండు స్వభావములు కలిగియున్నవి.

నిత్యాస్థిత్యాకారాః తిథయశ్శివశక్తిసమరసాకారాః ।
దివసనిశామయ్యస్తాః శ్రీవర్ణాస్తేఽపి తద్ద్వయీరూపాః ॥

పదహారు కళలు మంత్రములోని పదహారు అక్షరములను (షోడశాక్షరీ లేక షోడశీ) అనుసరించును.

'కళా' అను పదమునకు పూర్ణచంద్రునిలో పదహారవ భాగము అను అర్థము కూడ కలదు. '*కలా తు షోడశో భాగః*'.

ఆమె బీజము, మొలక అని కామకలా విలాసము చెప్పుచున్నది. మరియు ఆమె సూక్ష్మమైనదిగా వర్ణించబడుచున్నది.

స్ఫుటశివశక్తిసమాగమబీజాంకురరూపిణీ పరాశక్తిః ।
అణుతరరూపానుత్తరవిమర్శపిలక్ష్యవిగ్రహా భాతి ॥

కామకలా విలాసముపై భాష్యము 'చిద్వల్లి'లో ఆమె అణువుకన్న సూక్ష్మమనియు, ఘనముకంటె ఘనమైనదనియు చెప్పబడెను.

అణోరణుతరా దేవీ మహతోఽపి మహీయసీ

శివుడు అక్షరములలో మొదటి అక్షరము 'అ'కారమును సూచించుచుండగా, ఆమె చివరి అక్షరము 'హ'కారమును సూచించును.

కామకలయే మహాత్రిపురసుందరీదేవి. కామకలలో నిక్షిప్తమైయున్న ఈ రహస్యము ఎవరికి తెలియునో, వారు విముక్తి చెంది మహాత్రిపురసుందరీదేవి కాగలరని కామకలా విలాసములో వివరించబడినది.

ఇతి కామకలా విద్యా దేవీచక్రాత్మికా సేయమ్ ।
విదితా యేన స ముక్తో భవతి మహాత్రిపురసుందరీరూపః ॥

ఈమె మూడు వేదములు (ఋగ్యజుస్సామ), మూడు పురుషార్థములు (ధర్మార్థకామములు), త్రిలోకములందు 'ఓం'కారమును (అ,ఉ,మ ల అక్షర సంయోగము) సూచించుచున్నదని లలితా సహస్రనామము (872-875) వర్ణించుచున్నది. మరియు ఈమె త్రిపురమాలినిగా (అంతర్దశారమునకు అధిదేవత) కూడ చెప్పబడుచున్నది.

త్రయీ త్రివర్గనిలయా త్రిస్థా త్రిపురమాలినీ

మార్కండేయపురాణము అన్ని త్రయీలు (triplets) దేవీస్వరూపములని పేర్కొనుచున్నది.

త్రయో లోకాస్త్రయో దేవాః త్రివిద్యం పావకత్రయం
త్రీణి జ్యోతీంషి వర్గాశ్చ త్రయో ధర్మాదయస్తథా
త్రయో గుణాః త్రయశ్శబ్దాః త్రయో దోషాస్తథా ఽశ్రమాః
త్రయః కాలాః తథా ఽవస్థాః పితరోఽహర్నిశాదయః
మాత్రా త్రయమ్ చ తే రూపం త్రి స్థే దేవి సరస్వతి

శ్రీవిద్య యందు ఐదు అంశములు – గురువు, దేవి, మంత్రము, చక్రము, ఉపాసకుడు – ఉన్నవి. ఈ ఐదును ఒకటేయని చెప్పబడుచున్నది. శ్రీచక్రోపాసనలో గురువుకు ప్రముఖస్థానము కలదు. ఎందుచేతననగా, సాధకుడికి ఉపదేశము చేయువాడు గురువు. సరియైన గురువుచే సక్రమముగా ఉపదేశము పొందకుండినచో, కేవలము మంత్రముచే శ్రీచక్రమును పూజించుటకు వీలులేదు. బుద్ధిమంతుడైన ఉపాసకుడు గురువును ప్రకటించవలెను. కాని మంత్రమును గుప్తముగా నుంచవలెనని కులార్ణవము చెప్పుచున్నది.

గురు ప్రకాశయేత్ ధీమాన్ మంత్రం యత్నేన గోపయేత్

గురురూపములోను శిష్యనిరూపములోను శివుడే తంత్రమును వెలికితీయునని స్వచ్ఛానంద తంత్రము తెలుపుచున్నది. ప్రకాశ విమర్శలుగా వర్ణించబడు శివశక్తులు, గురు రూపములో ఒకటిగా నుండును. గురువు ప్రాముఖ్యమును తంత్రశాస్త్రము బహువిధములుగా ప్రశంసించినది.

శ్రీవిద్యా ఉపదేశము అర్హతగలవారికి మాత్రమే చేయవలెను. నాస్తికులకు, ఇతర తత్త్వసిద్ధాంత విద్యార్థులకు, శ్రీవిద్యయందు విశ్వాసము లేనివారికి ఉపదేశము చేయరాదని యోగినీ హృదయము స్పష్టము చేసెను.

న దేయం పరశిష్యేభ్యః నాస్తికేభ్యో న చేశ్వరి ।
న శుశ్రూషాలసానాం చ నైవా ఽనర్థప్రదాయినామ్ ॥

ఐదు 'మ'కారములను – మద్యము, మత్స్యము, మాంసము, ముద్ర, మైథునము – శ్రీవిద్య ద్వారా విముక్తి సాధించవచ్చునని కొన్ని సిద్ధాంతములు బలముగా వాదించును. ఈ సిద్ధాంతవాదమును 'కౌల'మార్గమందురు.

మద్యం మాంసం చ మీనం చ ముద్రాం మైథునమేవ చ
మకార పంచకం ప్రాహుర్యోగినీం ముక్తిదాయకమ్

దీనిని వామాచార అభ్యాసమందురు. సుప్రసిద్ధ సౌందర్యలహరి భాష్యకారుడు లక్ష్మీధరుడు, శ్రీవిద్యోపాసనలో మూడు సంప్రదాయములను వివరించెను. అవి: (1) కుల లేక కౌల (2) మిశ్రమ (3) సమయ. సమయాచారమునే అభ్యసించవలెననియు, ఇతర రెండు మార్గములను (మిశ్రమ, కౌల) వర్జించవలెననియు, శివుడు శక్తికి చెప్పిన శ్లోకమును లక్ష్మీధరుడు పేర్కొనెను.

మిశ్రమం కౌలమార్గం చ పరిత్యాజ్యం హి శాంకరి

ఈ సాధనా మార్గములు విపరీత స్వభావము కలవి. అందుచే తంత్రశాస్త్రమంతయు చెడుపేరు సంతరించుకొనెను. ఇంద్రియసుఖములు, లౌకికమైన సంతోషములందు ఆసక్తిగలవారు, రహస్యశక్తులను పొందగోరువారు, తమ అభీష్టములను నెరవేర్చుకొనుటకు తంత్రశాస్త్ర మార్గము నెంచుకొనిరి. దీనిని విపరీతధోరణిగా 'సమయ' సిద్ధాంతవాదులు పరిగణించిరి. వీరు మాత్రమేకాక, ఇతర అధ్యాత్మిక తత్త్వసిద్ధాంతవాదులు కూడ గర్హించిరి.

సామాన్య జీవితము గడుపు సామన్య మానవులకు సమయాచారము సముచితమని ప్రతిపాదించబడెను. 'సమయ' పదమునకు వేదమని యర్థము. మాతృదేవత సకల వేదముల సారము. కాబట్టి ఆమె 'సమయ' అని, 'సమయాచారతత్పరా' అని వర్ణించబడెను (లలితా సహస్రనామము – 98).

రుద్రయామల తంత్రము సమయాచారమును స్పష్టముగా వర్ణించినది. సంప్రదాయబద్ధమైన దశవిధములకు కట్టుబడియుండుటే సమయాచారము. కౌలమార్గము, సమయాచారము కూడ శ్రీచక్రోపాసనయందు చంద్రుని షోడశకళలతో సమన్వయము చేయుటయందు విశ్వాసము కలిగియున్నవి. ప్రతిదినము నిత్యమని కౌలమార్గము పరిగణించుచుండగా, సమయాచార మార్గమందు పదహారవకళయైన

బిందువులో పదిహేను కళలు లీనమగుచున్నట్లు అర్థము చేసికొనవలెను. ఇందులో కామేశ్వర, కామేశ్వరీ దివ్యదంపతులు. దక్షిణామూర్తి ఋషి, వేదానుసారముగా నైవేద్యము సమర్పించబడగా, పూజ లేక ఉపాసన కుడిచేతితో చేయబడును.

కౌలమార్గములో భైరవి భైరవులు దివ్యదంపతులు. పరశురామ, దత్తాత్రేయ, తదితర కల్పసూత్రముల కనుగుణంగా పూజ వామ (ఎడమ) హస్తముతో చేయబడును. ఈ రెండు సిద్ధాంతముల మధ్యగల భేదములు మేరు తంత్రములో చెప్పబడెను. మేరు తంత్రము ఉపాసకులను సాత్త్విక, రాజస ,తామసిక స్వభావముల ననుసరించి విభజించెను. కౌలమార్గములో స్త్రీ జననేంద్రియము, యోనిని ఉపాసించు విపరీత వర్గమొకటి కలదు. ఈ రెండింటిని సమాధానపరచు మూడవమార్గము కలదు. అది నీచత్వమువైపు దిగజారుచున్న అరువది నాలుగు తంత్రముల కనుగుణముగా నుండు మిశ్రమమార్గము.

శ్రీవిద్యా శ్రీచక్రములను తెలిసికొనుటకు ఈ మార్గములన్నియు సూచించబడినవి. శ్రీవిద్యాభ్యాసము యొక్క లక్ష్యము తన శరీరమే దైవమునకు నివాసమని తెలిసికొని పరిపూర్ణానందము సాధించుట.

చక్రమునకు దేవికి భేదము లేదు. షోడశికార్ణవము ప్రకారము శ్రీచక్రము మహాత్రిపురసుందరీ స్వరూపము. తాంత్రిక గ్రంథములు, శివుడు మహాత్రిపురసుందరీలతో సరిసమానముగా శ్రీవిద్యోపాసకుని పరిగణించుచున్నవి. మరియు అతడు లేక ఆమె చివరి జన్మలో ఉన్నపుడు మాత్రమే శ్రీవిద్యోపాసకునిగా రూపొందుట కాశించునని కూడ చెప్పబడుచున్నది. వారు ఉత్తమస్థాయి కెదిగి శివునితో ఏకమగుదురు.

చరమే జన్మని యథా శ్రీవిద్యోపాసకో భవేత్

పునర్జన్మ లేనివారికి లేక తానే శివునిగా నుండు వారికి మాత్రము శ్రీవిద్య, పంచదశి అందును!

యస్య నో పశ్చిమం జన్మ యది వా శంకరః స్వయం
తేనైవ లభ్యతే విద్యా శ్రీమత్పంచదశాక్షరీ

7 మంత్రార్థము

మంత్రార్థము

మంత్రము పారాయణ చేయువారు లేక ఉచ్చరించువారు మంత్రముచే రక్షింపబడుదురు.

మననాత్ త్రాయతే ఇతి మంత్రః

మంత్రము యొక్క అర్థము తెలిసికొననిదే పారాయణ చేయుట నిష్ప్రయోజనమని వరివస్యా రహస్యములోని రెండవ అధ్యాయము ప్రారంభములో చెప్పబడెను. ఈ విషయములో భాస్కరరాయలు ఒక గొప్ప సాదృశ్యము వివరించిరి. మంత్రముయొక్క అర్థము తెలిసికొనక, కేవలము అందులోని శబ్దముల నుచ్చరించువారిని, గంధపు చెక్కలను మోసికొనుపోవు గార్దభముతోను, భస్మమునకు నైవేద్యము సమర్పించుటతోను సరిపోల్చిరి.

నా ఽర్థజ్ఞానవిహీనం శబ్దస్యోచ్చారణం ఫలతి।
భస్మని వహ్నివిహీనే న ప్రక్షిప్తం హవిర్జ్వలతి॥
అర్థమజానానాం నానావిధశబ్దమాత్రపాఠవతామ్।
ఉపమేయశ్చక్రీవాన్ మలయజభారస్య వోఢేవ॥

తరువాత ఆయన పంచదశి అర్థము తెలిసికొనుటకు పదిహేను వివిధ మార్గములను తెలియజేసిరి. మంత్రార్థమును గుర్తించుటకు యోగినీ హృదయము ఆరు మార్గములను పేర్కొనెను. వివిధ తాంత్రిక గ్రంథములు మంత్రస్వభావమును, లక్షణములను, ఉచ్చారణలో కలుగు దోషములను, ఆటంకములను, వివిధ ఉచ్చారణా మార్గములను విశదీకరించెను. యంత్రము, మంత్రము, సాధకుని భౌతిక శరీరము, గురువు మధ్యనుండు ఏకతా భావము లేక పరస్పర ఆధారిత తత్త్వము లేక విడదీయరానితనము లేక సామరస్యమును సాధకుడు చక్కగా అవగాహన చేసికొనవలెనని అవి తెలియజేయుచున్నవి. ఇతర అంగములతో ఇటువంటి ఏకతా భావము, చివరకు సాధకుడు పరమలక్ష్యము (ఏకత్వము) నర్థము చేసికొనుటలో తోడ్పడును.

జ్ఞాతా స్వాత్మా భవేత్ జ్ఞానమ్ అర్ఘ్యం జ్ఞేయం హవిః స్థితమ్
శ్రీచక్రపూజనం తేషామ్ ఏకీకరణమితీరితమ్
– కామకలా విలాసము

మంత్రములో పదము, దాని అర్థము ఒకటిగా ఎట్లుండునో, అటులనే శివశక్తులు ఒకటేయని కామకలా విలాసము పేర్కొనుచున్నది. అవి రెండును సంయుక్తముగా సృష్టి స్థితి లయలకు కారణము. మంత్రములోని మూడు అక్షరకూటముల – వాగ్భవకూటము, కామరాజకూటము, శక్తికూటము – స్వభావములను ఆ విధముగా ప్రతిబింబించుచున్నవి.

వాగర్థౌ నిత్యయుక్తౌ పరస్పరం శక్తిశివమయావేతౌ।
సృష్టిస్థితిలయభేదౌ త్రిధా విభక్తౌ త్రిబీజరూపేణ॥

దేవి సూక్ష్మరూపములో శ్రీచక్రము, శబ్దరూపములో పంచదశి.

త్రిపురసుందరీ ఉపాసనలో మూడు మంత్రములు కలవు. ఈ మంత్రముల నొకొక్క దానిని అనేక పర్యాయములు ధ్యానించుట ద్వారా సాధకుడు క్రమక్రమంగా పురోగతి సాధించును. సాధకునికి మొదట బాలాత్రిపురసుందరీ మంత్రము ఉపదేశించబడును. ఇది మూడు అక్షరముల మంత్రము – ఏం క్లీం సౌః (సౌః క్లీం ఏం).

సాధకుడు ఒక దశకు ఎదిగిన పిమ్మట, పంచదశీ మంత్రోపదేశమున కర్హుడగును. ఇది మూడు కూటములుగా విభజించబడెను.

వాగ్భవకూటము – మొదటి అయిదు అక్షరములు
కామరాజకూటము – తరువాతి ఆరు అక్షరములు
శక్తికూటము – చివరి నాలుగు అక్షరములు.

చివర 'శ్రీ' చేర్చినపుడు షోడశీ మంత్రము (షోడశీ) అగును. తరువాత వివిధ సిద్ధాంతములకు చెందిన సాధకులు మంత్రములోని అక్షరముల మిశ్రమమును మార్పుచేయుట లేక అదనముగా అక్షరములను చేర్చుట ద్వారా మంత్రములోని అక్షరములను ఇరువది ఎనిమిది అక్షరముల వరకు విస్తరింపజేయవచ్చును. కాని ప్రధానంగా పంచదశీ 'కాది' సంప్రదాయములో అనుసరించబడుచున్నది. ఈ సంప్రదాయానుసారము మంత్రము 'క'తో ప్రారంభమగును. దేశమంతటా సామాన్యంగా ఇది ఆచరణలో ఉన్నది. పంచదశీ మంత్రముయొక్క మూలస్వరూపము మూడు అక్షరకూటములుగా ఉన్నది. అదనపు అక్షరములు నాల్గవకూటమి యగును. ఇది వ్యక్తరూపములోగాని లేక అవ్యక్తరూపములోగాని స్పష్టమైన రీతిలో ఉండును.

వరివస్యా రహస్యములో భాస్కరరాయలు ఈ మంత్రమునకు పది హేను రకములైన అర్థములు చెప్పిరి. వరివస్యా రహస్యములోని రెండవ అధ్యాయములో భాస్కరరాయలు మంత్రార్థము చర్చించిరి. పది హేను రకములుగా సాధ్యమగు అర్థములను 57, 58, 59 శ్లోకములలో వివరించిరి. అవి ఏవనగా:

ఆయాతః పూర్ణగాయత్ర్యాః ప్రతిపద్యోఽర్థ ఆదిమః ।
భావార్థః సంప్రదాయార్థః నిగర్భార్థస్తురీయకః ॥
కౌలికార్థో రహస్యార్థో మహత్త్వార్థ ఏవ చ ।
నామార్థః శబ్దరూపార్థశ్చార్థో నామైక దేశగః ॥
శక్త్యార్థః సామరస్యార్థః సమస్తసగుణార్థకౌ ।
మహావాక్యార్థ ఇత్యర్థాః పంచదశ్యాః స్వసంమితాః ॥

1.భావార్థము – సామాన్యార్థము

దేవి విశ్వమునకు భిన్నము కాదు. ఐశ్వర్యమును సూచించునవన్నియు అందులో నిక్షిప్తమై ఉన్నవి. ఈ అర్థము మూడు దశలను, త్రిమూర్తులను, మంత్రములోని అక్షర త్రికూటములను సూచించును. ఆవిధముగా మొదటి అక్షరకూటము, వాగ్భవకూటము బ్రహ్మ–సరస్వతులను సూచించును. రెండవ అక్షరకూటము, కామరాజకూటము సహజముగా లక్ష్మీ–నారాయణులను సూచించును. మూడవ అక్షర కూటము శివశక్తులను సూచించును.

కూటత్రయాత్మికాం దేవీం సమష్టివ్యష్టి రూపిణీమ్
ఆద్యాం శక్తిం భావయంతౌ భావార్థమితి మన్వతే
– యోగినీ హృదయము

2 సంప్రదాయార్థము

ఇది గురువు శిష్యునికి ప్రత్యేకముగా బోధించునది. ఈ అర్ధము యొక్క లక్ష్యము కేవలము శ్రీవిద్యా విశ్వముల ఏకత్వమును తెలియజేయుట. ఇది పంచభూతములను, వాటియొక్క పదిహేను లక్షణములను కూడ చెప్పును. మంత్రములోని పదిహేను అక్షరములు వీటిని సూచించును.

జన్యజనకయోర్భేదా ఉభావాత్ వాచ్యస్య వాచకే నాఽపి
బ్రహ్మణి జగతో జగతి చ విద్యా భేదస్తు సంప్రదాయార్థః
– యోగినీ హృదయము

3 నిగర్భార్థము – గుప్తముగా ఉన్న అర్థము

ఈ మంత్రార్థముయొక్క లక్ష్యము సాధకునికి మంత్రోపదేశము చేయు గురువును ప్రారంభములో దేవితో సరిసమానముగా పరిగణించి, తరువాత క్రమక్రమంగా గురువు, శిష్యుడు, త్రిపురసుందరీల మధ్య ఏకత్వమును గ్రహించుట అని యోగినీ హృదయము తెలియజేయుచున్నది.

పరమశివే నిష్కలతా తదభిన్నత్వం స్వదేశికేంద్రస్య
తత్కరుణాతః స్వస్మిన్నపి తదభేదో నిగర్భార్థః

4 కౌలికార్థః – శ్రీచక్రభాగములతో ఏకత్వము

శ్రీచక్రములోని ఇతర భాగములతో మంత్రముయొక్క ఏకత్వమును గుర్తించుట దీని లక్ష్యము. మంత్రములో అయిదు అంశములు కలవు. అవి: యంత్రము, మంత్రము, తంత్రము, గురువు, శిష్యుడు. వీటియొక్క ఏకత్వమును గుర్తించుట లక్ష్యమని యోగినీ హృదయ దీపికా భాష్యము వివరించుచున్నది.

చక్రదేవతాగురువిద్యాసాధకానామైక్యానుసంధానం కౌలికార్థః

5 రహస్యార్థము

పంచదశీద్వారా కుండలినీశక్తి నర్థము చేసికొని, అవి రెండును ఒకటేయని గ్రహించుట.

సాక్షాద్విద్యైవైషా న తతో భిన్నా జగన్మాతా
అస్యాః స్వా ఽభిన్నత్వం శ్రీవిద్యాయా రహస్యార్థః

6 మహాతత్త్వార్థము – ఆచరణపరముగా

శ్రీవిద్య ఘనతరముకంటె ఘనతమము, అల్పముకన్న అత్యల్పము, గగనముకన్న ఎత్తైనది, ఇంద్రియములకు గ్రాహ్యము కానిది, ముప్పది ఆరు తత్త్వములకు అతీతమైనదని తెలిసికొనుట. ఇచటనే సాధకుడు తాను పరమతత్త్వమునకు భిన్నము కాదని భావించవలెను.

నిష్కలే పరమే సూక్ష్మే నిర్లక్ష్యే భావవర్జితే
వ్యోమా ఉతీతపరే తత్త్వేప్రకాశానంద విగ్రహే
విశ్వోత్తీర్ణే విశ్వమయే తత్త్వే స్వాత్మనియోజనమ్
– యోగినీ హృదయము

7 & 8 నామార్థము, శబ్దార్థము – వాక్ శక్తి ఆధారంగా

మంత్రములోని ప్రతి అక్షరము దేవి స్వరూపమని – శబ్దము, రూపము, శక్తి, అర్థము – తెలిసికొనుట.

తత్తద్వర్ణార్థేయం తద్వర్ణస్వరూ పేయమ్
ఇతి తు శ్రీవిద్యాయా నామార్థః శబ్దరూపార్థః
– యోగినీ హృదయము

9. నామైకదేశార్థము – పదముయొక్క అవయవముల అర్థము

మంత్రములోని ప్రతి అక్షరము దేవి స్వరూపముగా సాధకుడు అనుభూతి పొందవలెను. అనగా సాధకుడు మంత్రములో ఒకొక్క అక్షరము నుచ్చరించునపుడు, అతని మనస్సునందు లలితా త్రిశతి నామములు మెదలవలెను.

నామైక దేశమాత్రేనామగ్రహణస్య లోకసిద్ధత్వాత్
నామోపస్థితిగమ్యః ప్రోక్తో నామైకదేశార్థః

10 శక్త్యార్థము – శాక్తోపాసనానుసారము

శ్రీవిద్యా (పంచదశి) యందున్న మూడు అక్షరకూటములు దేవి శరీరములోని మూడు భాగములను ఎట్లు సూచించుచున్నవో, లలితా సహస్రనామము (85–89) వర్ణించుచున్నది. ఆమెకు మంత్రమునకు భేదము లేదనియు, ఆమె పంచదశిలోని మూడు అక్షరకూటముల స్వరూపమని స్పష్టము చేయుచున్నది.

శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా
కంఠాధః కటిపర్యంతమధ్యకూటస్వరూపిణీ
శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణీ
మూలమంత్రాత్మికా
–లలితా సహస్రనామము

11 సామరస్యార్థము – సమగ్రమైన అర్థము

మంత్రములోని మూడు 'క'లు, రెండు 'హ'లు, శివుని సూచించును. ఇతర అక్షరములు శక్తిని సూచించును. మిగిలిన మూడు 'హ్రీం'లు రెండింటిని, అనగా శివశక్తులను సూచించును.

కత్రయం హద్వయం చైవ శైవో భాగః ప్రకీర్తితః
శక్త్యక్షరాణి శేషాణి హ్రీంకార ఉభయాత్మకః

ఈ అర్థము మంత్రమునందు, శివశక్తులయందు గల సామరస్యమును తెలియజేయుచున్నది.

12 సమస్తార్థము – సంపూర్ణ అర్థము

శ్రీవిద్యా మంత్రములోని త్రికూటములు మూడు వివిధ అంశములను సూచించును. మొదటిది బుద్ధిని, రెండవది సంపద ప్రతిష్ఠలను, మూడవది పై రెండు కూటముల ఫలితములను సుసంపన్నము చేయును. ఈ అర్థము మంత్రము నుచ్చరించుట వలన కలుగు ఫలితములను ఉద్ఘాటించుచున్నది. వరివస్యా రహస్యము దీనిని విశదపరచెను.

13 సగుణార్థము – సాకార అర్థము

మంత్రస్వరూపము వేదములను సూచించుచున్నదని అర్థము. మొదటి అక్షరకూటము (వాగ్భవకూటము) ఋగ్వేదమును, రెండవదైన కామరాజకూటము యజుర్వేదమును, చివరిదైన శక్తికూటము సామవేదమును సూచించుచున్నవి. మరియు అవ్యక్తముయొక్క వ్యక్తరూపములను లక్షణములను ప్రస్ఫుటము గావించుచున్నది.

ఇత్థం గుణగణకథనాద్విద్యాయా ఏష సగుణార్థః
– వరివస్యా రహస్యము

14 మహావాక్యార్థము – మహావాక్యపరంగా

మహావాక్యము 'తత్త్వమసి' అనగా 'అదియే నీవు'. సాధకుడే పరమతత్త్వమని యర్థము. ఈ అర్థము ప్రకారము జీవాత్మ పరమాత్మలకు భేదము లేదు.

15 గాయత్ర్యర్థము –పంచదశి గాయత్రి సమానము

భాస్కరరాయలు పంచదశి గాయత్రి ఒకటేయని అర్థము చెప్పిరి. ఇదియే చివరిదైన గాయత్ర్యర్థము.

యోగినీ హృదయము పంచదశికి ఆరు అర్థములను వివరించినది. అవి: (1) భావార్థము (2) సంప్రదాయార్థము (3) నిగర్భార్థము (4) కౌలికార్థము (5) రహస్యార్థము (6) మహాతత్త్వార్థము. ఈ ఆరును వరివస్యా రహస్యము వివరించిన పదిహేను అర్థములలో కలవు.

షడ్విధస్తం తు దేవేశి ...
భావార్థః సంప్రదాయార్థః నిగర్భార్థశ్చ కౌలికః
రహస్యార్థో మహాతత్త్వార్థ ఏవ చ

స్థూలముగా అర్థము రెండు రకములని చెప్పవచ్చును.

1. ప్రతి అక్షరముయొక్క వాచ్యార్థమునకు వివరణ
2. మంత్రము నాచరించుటలోగల ప్రాముఖ్యము. ఇది సాధకుల కర్మకాండలకు సహాయపడును.

సాదృశ్యము కొంతవరకు క్లిష్టముగా ఉండుటచే అవగాహన చేసికొనుట సులభము కాదు. కాని యిది శ్రీవిద్యా ప్రాచీనతను, గౌడపాదాచార్య, లక్ష్మీధర, భాస్కరరాయ మొదలైన వివిధ భాష్యకారుల ప్రకారము దీనికిగల వైదిక సంబంధమును సూచించును.

ఈ అక్షరములకు సామాన్యముగా వివరించు సాదృశ్యార్థము గాయత్రీ మంత్రాక్షరములతో చెప్పబడినది. భాస్కరరాయలవంటి మహాత్ములు, పంచదశీలోని మూడు అక్షరకూటములు గాయత్రీ మంత్రమునకు సరిసమానమని చెప్పుటకు ప్రయత్నించిరి. భాస్కరరాయలవారి ప్రకారము గాయత్రీ

యేవిధంగా వేదమంత్రమో, అటులనే పంచదశి కూడ. ఈ రెండు మంత్రముల సారము ఒకటే.

క్లిష్టము, రహస్యము అయిన మంత్రముయొక్క అర్థము తెలిసికొనుటకు ఒకే ఒక మార్గము – ఏకరీతిగా మననముచేయుట. ఇంకేవిధమైన పాండిత్యము వలన సాధ్యము కాదు. ఆవిధముగా ద్రష్టలచే మంత్రములు సృజించబడెను. దీని మూలంగా అనర్హుల చేతిలో మంత్రములు పడకుండును. ఒకవేళ అనర్హులకు లభించినను, అవి వారికి సహాయపడకుండును. ఇదియే మంత్రములను రహస్యముగా నుంచుటకు ముఖ్య కారణము. మంత్రములను రహస్యముగా నుంచ వలసిన ప్రాముఖ్యము శాస్త్రములలో పదే పదే ఉద్ఘాటించబడెను.

గాయత్రీ మంత్రము పంచదశికి సరిసమానమని చెప్పబడెను. మరియు గాయత్రీ మంత్రములోని అప్రకటిత తురీయ పదమునకు ఇచట ప్రత్యేక ప్రాముఖ్యము కలదు. సంపూర్ణ గాయత్రీ మంత్రము:

ఓం భూర్భువఃస్సువః తత్సవితుర్వరేణ్యమ్
భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్

గాయత్రీ మంత్రములోని రహస్య భాగము 'పరో రజసి సావదోమ్'. ఇది గాయత్రిలోని తురీయపాదము.

మూడు కూటముల ప్రకారము పంచదశి:

వాగ్భవకూటము – 5 అక్షరములు	క ఏ ఈ ల హ్రీం
కామరాజకూటము – 6 అక్షరములు	హ స క హ ల హ్రీం
శక్తికూటము – 4 అక్షరములు	స క ల హ్రీం

త్రిపురతాపినీ ఉపనిషత్తు పంచదశిలోని వాగ్భవకూటాక్షరములకు, గాయత్రీమంత్రమునకు గల సారూప్యమును ఉద్ఘాటించుచున్నది.

వాగ్భవకూటము, గాయత్రీమంత్రము

పంచదశి	గాయత్రీ
క	తత్
ఏ	సవితుర్వరేణ్యం
ఈ	భర్గోదేవస్య ధీ
ల	మహి
హ్రీం	ధియో యో నః ప్రచోదయాత్

పంతదశిలోని రెండవ కూటాక్షరములకు గాయత్రీమంత్రమునకు గల సారూప్యమును త్రిపురతాపిని ఉపనిషత్తు వివరించెను.

కామరాజకూటము, గాయత్రీ

పంచదశి	గాయత్రి
హ	తత్
స	సవితుర్
క	వరేణ్యం
హ	భర్గోదేవస్య ధీ
ల	మహి
హ్రీం	ధియో యో నః ప్రచోదయాత్

శక్తికూటమిలోని అక్షరములకు గాయత్రీమంత్రముతో గల సారూప్యము

శక్తికూటము, గాయత్రి

పంచదశి	గాయత్రి
స	తత్ సవితుర్వరేణ్యం
క	భర్గో దేవస్య ధీ
ల	మహి
హ్రీం	ధియో యో నః ప్రచోదయాత్

త్రిపురోపనిషత్తు సూత్రముల ఆధారంగా, భాస్కరరాయలు వరివస్యా రహస్యములో మూడుకూటములలోని భావమును నిర్ద్వంద్వముగా వివరించిరి.

కామయతే స కకారః కమో బ్రహ్మైవ తత్పదార్థః
సవితుర్వరేణ్యమితి వై సవితుః శ్రేష్ఠం ద్వితీయ వర్ణార్థః
సర్వాంతర్యామి దధద్భర్గో ధీతి తుర్యార్థః
పృథ్వీ మహీ లకారస్తృతీయార్థిబోధకా మాయా

ఇది వాగ్భవకూటమి కొరకు,

'క' అనగా కామేశ్వర, ఎవనికి వాంఛయుండునో అతడు బ్రహ్మము గాయత్రియందు బ్రహ్మము 'తత్'గా చెప్పబడుచున్నది.

'ఎ' అనగా 'సవితుర్వరేణ్యం', మాతృదేవి కామేశ్వరిని సూచించును.

'ఈ' అనగా గాయత్రిలోని 'భర్గోదేవస్య'ను సూచనప్రాయంగా, భగవంతుని సర్వవ్యాపక, పోషక లక్షణములను తెలుపుచున్నది.

'ల' గాయత్రిలోని పృథివి లేక 'మహి' స్వభావము గలది.

'హ్రీం' అనగా మాయ, గాయత్రిలో మిగిలినదాని నంతటిని, తురీయపాదముతో సహా సూచించును.

వరివస్యా రహస్యము, పంచదశిలోని రెండవ మూడవ కూటములను కూడ గాయత్రితో సమానముగా పరిగణించుచున్నది.

త్రిపదీ త్రివర్ణబోధ్యా తుర్యస్తదుపరి షడక్షరీగమకః
అథ తార్తీయే వర్ణద్వితయం త్రిపదీ షడక్షరీ గమకమ్
కూటద్వితయే శేషంపూర్వవదున్నేయమితి తు విద్యాయాః
గాయత్ర్యర్థా స్త్రిపురోపనిషది కథితాథైవ భాగవతే

రెండవకూటమిలోని మూడు అక్షరములు హ,స,క లు తత్, సవితుర్, వరేణ్యమ్ లకు సమానమని చెప్పబడుచున్నది. నాల్గవ అక్షరము గాయత్రిలోని తదుపరి ఆరు అక్షరములను సూచించును. అదేవిధముగా, మూడవకూటమిలోని మొదటి రెండు అక్షరములు స,క లు ఆ మూడు పదములను గాయత్రిలోని ఆరు అక్షరములను సూచించును.

త్రిపురోపనిషత్తు, దేవీభాగవతము కూడ ఈవిధముగనే తెలియజేసెను. ఉదాహరణకు, పంచదశిలోని శక్తికూటమి గురించి త్రిపురోపనిషత్తు ఏమి చెప్పెనో పరిశీలించుదము.

తత్సవితుర్వరేణ్యం తస్మాదాత్మనా ఆకాశః ఆకాశాధ్యాయః స్ఫురతే తదధీనం వరేణ్యం
సముదీయమానం సవితుర్వాయోగ్యో జీవాత్మపరమాత్మసముద్భవస్తం ప్రకాశశక్తిరూపం
జీవాక్షరం స్పష్టమాపద్యతే

త్రిపురోపనిషత్తు సారమును తీసికొని వరివస్యా రహస్యము పైవిధముగా చెప్పెను. ఒక మంత్రముయొక్క అర్థమును మరొక మంత్రములో ఇముడ్చుటకు కారణము మంత్ర రహస్యమును, పరస్పరము తమ శక్తుల ప్రయోగమును, వాటి ప్రాచీనతను, విశ్వవ్యాపకత్వమును, ఏకత్వమును ఉద్ఘాటించుట కొరకని తెలియును.

పంచదశిలోని ఒకొక్క అక్షరము పరిశీలించినచో, మంత్రములోని సాదృశ్యము, అర్థము బోధపడును. మూడు అక్షరకూటములు వాగ్భవకూటము, కామరాజకూటము, శక్తి కూటము.

వాగ్భవకూటమునందున్న అక్షరములు క, ఎ, ఈ, ల, హ్రీం

మొదటి అక్షరము 'క' కామేశ్వరుని, అనగా మన వాంఛాతత్త్వమును సూచించును: కామ ఈశ్వర. ఇది జాగృతమైన మనస్సుకు, అనగా జాగ్రదవస్థకు ప్రతీక. 'కన్' ధాతువునుండి 'క' అను అక్షరము వచ్చినది. 'ప్రకాశింపజేయు' అని దీని అర్థము. 'క' సహజముగా కామమును సూచించును. భావప్రకటన, సిద్ధి విశ్వవ్యాప్తమైన వాంఛ. ఇది క్+అ, శివశక్తుల సంయోగము. 'క' ప్రకాశమును, బుద్ధిని సూచించును.

ఈ అక్షరము చాల ముఖ్యమైనది, మంత్రములో మూడు పర్యాయములు వచ్చును. స్వచ్ఛనాదసంగ్రహము మూడు రకములైన భక్తులను పేర్కొనెను. వారు 'సకాల', 'ప్రళయకాల', 'విజ్ఞాన కేవల' అను మూడు 'క'లకు – అధమ, మధ్యమ, ఉత్తమ – వరుసగా ప్రాతినిధ్యము వహించుచున్నారు.

రెండవ అక్షరము 'ఏ' కామేశ్వరిని సూచించును. ఈ అక్షరము తలక్రిందులుగానున్న త్రిభుజమువలె, దేవికి ప్రతిరూపముగ నుండును. ఈ అక్షరము స్వప్నావస్థను సూచించును. 'ఎ' అక్షరము శక్తి, విమర్శల యొక్క సంపూర్ణ వ్యక్తిత్వమును సూచించును. ఇది బ్రహ్మయొక్క సృజన, వ్యక్త, ప్రకటన, ఉత్పత్తి శక్తులను కూడ తెలుపును. కాబట్టి ఇది బ్రహ్మకు పత్ని, భారతి. వాగ్భవకూటము వాక్‌శక్తిని సూచించును. 'ఇక్ స్మరణే'

అను ధాతువునుండి యీ అక్షరము జనించినది, అనగా స్మరణ కనుకూలమైనది. శక్తిగా ఇది శ్రీచక్రములో శిఖరములు క్రిందగల అయిదు త్రిభుజములకు ప్రతీక. ఈ అయిదు త్రిభుజములు శ్రీచక్రములో అర్ధభాగమునకు మించియున్నవి.

శివ–శక్తి లేక పురుష–ప్రకృతుల సమ్మేళనము సౌందర్యలహరియందు అత్యద్భుత శ్లోకములలో ప్రస్తావించబడెను. పురుష–ప్రకృతి యనగా వేదాంతపరమైన పరమసత్యము మాయతో కలిసియుండుట. పంచదశిలో పునరావృత్తము కాని రెండు అక్షరములలో ఈ అక్షరము ఒకటి.

మూడవ అక్షరము 'ఈ' విష్ణువును సూచించును. విష్ణు పదము 'ఈ' అక్షరమునకు మూలధాతువు ఒకటే – 'ఈయతే వ్యాప్నోతి'. మూడవ అక్షరము 'ఈ' సుషుప్త్యవస్థను సూచించును. ఇది భ్రమింపజేయు విశ్వశక్తి మాయగా చెప్పబడుచున్నది. పునరావృతముకాని రెండవ అక్షరము 'ఈ'. అందుచే ఇది ప్రత్యేకమైనది. కాని పంచదశాక్షరీలోనుండు 'హ్రీం'కారములోని 'ఈ' అక్షరమును తీసికొనినచో, ప్రత్యక్షముగా ఒక పర్యాయము, పరోక్షముగా మూడు పర్యాయములు మంత్రములో గోచరించును.

పంచదశిలో నాలుగవ అక్షరము 'ల'. ఇది మంత్రములో మూడు పర్యాయములు పునరావృ తమగుచున్నది. 'ల' పృథివికి సంకేతము. మూడు పర్యాయములు పునరావృతమగుచు, మూడు భూమండలములను సూచించును. ఇంద్రియముల గ్రాహ్యశక్తినుండి విడిపోవుటచే, వేకువ (జాగ్రత్) స్థితిని సూచించకుండును.

పంచదశాక్షరిలో 'హ్రీం' అను అక్షరము ప్రతి అక్షరకూటమి చివర వచ్చును. ఇది ఏకాక్షర మంత్రముగా పరిగణింపబడుచున్నది. ఈ అక్షరము భువనేశ్వరీదేవిని సూచించును. 'హ్రీం' అక్షరము హ,ర,ఇ,మ్ అను నాలుగింటితో కూడియున్నది. 'హ' ఆకాశమును, 'ర' అగ్నిని, 'ఈ' మన్మథుని, 'మ్' పై మూడింటి సమ్మేళనమును సూచించును. 'హ' శివుని, 'ర' శక్తిని, 'ఈ' వారిరువురి సంయోగమును సూచించును. సత్వ, తమో, రజో గుణములను కూడ వరుసగా సూచించును. తమకు తాముగా నశించి, దేవితో లీనమగుచున్నవి. ఇది మాయాబీజము కూడ. గాయత్రీమంత్ర భాగమైన అప్రకటిత తురీయపదముగా చెప్పబడుచున్నది. పంచదశీలోని మూడు కూటాక్షరములకు ఇది కిరీటము వంటిది. 'హ్రీం' అక్షర పూర్ణరూపము భువనేశ్వరీదేవిని సూచించును. 'హృల్లేఖా' అను సాంకేతిక నామముతో పిలువబడుచున్నది. దేవి కరుణకై భక్తుల తపనను సూచించును. ఇది భువనేశ్వరీదేవి యొక్క ఏకాక్షర మంత్రము; సృష్టిలోని సృష్టి లయ కార్యములకు ప్రతీక. శబ్దలక్షణపరంగా ఈ పదమునకు 'లజ్జ' అని యర్థము. దీనిని మంత్రమున కన్వయించినపుడు, దేవియొక్క అవ్యక్తస్వరూపమని బోధపడును. తంత్రశాస్త్రములో 'హ్రీం' పదమునకు ప్రత్యేక ప్రాముఖ్యము కలదు; ఇతర శాస్త్రములలో ' ఓం' అక్షరము వలె ఇది ప్రణవముగా పరిగణించబడుచున్నది. ఇది కలయిక లేక సంయోగమును, ఎడబాటును కూడ సూచించును. 'హ్రీం' అలంకారముగను, ప్రతీకగను కూడ 'గ్రంథి' యని వర్ణించబడుచున్నది. ఎందుచేతననగా, దీనికి సంయోగశక్తి, ఎడబాటుశక్తి రెండును కలవు. మానవచక్రములో భావనాత్మక (conceptual) గ్రంథులుగా (ముడులు) – బ్రహ్మగ్రంథి, విష్ణుగ్రంథి, రుద్రగ్రంథి – సూచించబడుచున్నవి. అర్ధచంద్రయొక్క చివరలు 'మ్' అనగా రెండు పెదవులను జోడించినపుడు ఉత్పన్నమగును. ఈ నాదము మహాసుందరీదేవిలోని దశవిధ నాదముల అదృశ్య భాగములకు – రోధినీ, నాద, నాదాంత – ప్రతీకగా భావించబడుచున్నది. 'హ్రీం' యొక్క అత్యద్భుత విశేషమేమనగా, ఆశించు శబ్దము ఉత్పన్నమగుటకు పూర్వాక్షరము తరువాతి అక్షరములో లీనమయే తీరు. ఈ కారణముచే 'హ్రీం' నిత్యదంపతులను – శివశక్తులను – సూచించును. వాగ్భవకూటమి కూడ దేవి వదనమును సూచించును.

శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా

ఇచట వాగ్భవకూటాక్షరములోని మొదటి అక్షర సముదాయము సంపూర్ణమై, రెండవ కూటమిలోని ఆరు అక్షరములు ఆరంభమగును. సంక్షిప్తముగా వాగ్భవకూటమనగా సూక్ష్మబుద్ధి విస్తారముగా నుండుట అని వరివస్యా రహస్యము తెలియజేయుచున్నది.

వాగ్భవకూటస్యాఽర్థః సూక్ష్మమతి వ్యాపనాధిక్యమ్

మరొకవిధంగా చెప్పవలెనన్న, విశ్వవ్యాప్తంగా అత్యంత సూక్ష్మరూపంలో నున్న బుద్ధి అనవచ్చును. ఈ అక్షరకూటమికి అధిదేవత బ్రహ్మ, భౌతిక ప్రపంచమునకు, భాషాప్రపంచమునకు సృష్టికర్త. ఈ లక్షణములనుండి వాగ్భవమను పదము ఉద్భవించెను. మూడక్షరములతో కూడినది – 'క' భక్తునికి విముక్తి ప్రసాదించును, 'ల' సంపద నొసగును, 'ఈ' సుఖసంతోషములను కలిగించును.

రెండవ అక్షరకూటమి, కామరాజకూటమిలో ఆరు అక్షరములు కలవు. వీటిలో క, ల, హ్రీం అను మూడును (మొదటి కూటమిలోనివి) పునరావృతమైనవి. ఈ కూటమిలో 'హ' రెండు పర్యాయములు వచ్చును. కాబట్టి మనము అర్థము చేసికొనుటకు హ, స అను రెండును మిగిలియున్నవి. మంత్రములోని ఆరవ అక్షరము, మరియు రెండవకూటమిలోని మొదటి అక్షరము అయిన 'హ' అయిదు రకములైన బంధములను, అహంకార విధ్వంసమును సూచించును. మంత్రములో 'హ' రెండు పర్యాయములు వచ్చును. ఇది శివుని సూచించునది. 'హ' అక్షరమునకు బాధ కలిగించుట, పరాక్రమము, శత్రువు నణచివేయుటకు కారణము అను అర్థములు కలవు. ఈ ఏకైక అక్షరము మానవజీవితమునకు చతుర్విధ పురుషార్థములను – ధర్మార్థకామమోక్షములు – ప్రసాదించునదిగా పరిగణింపబడుచున్నది. ఈ కూటమిలో మొదటి పర్యాయము వచ్చు 'హ' విధ్వంసమునకు సూచకము (హన్యతే). రెండవ పర్యాయము వచ్చు 'హ' చేరుకొనుట అను అర్థమును తెలుపును (ఈయతే ప్రాపయతే)

'స' అక్షరము చంద్రుడు, చంద్రుని పదహారు కళలకు సమానమని చెప్పబడుచున్నది. కాబట్టి ఇది వినోదము, సంతోషములను – లౌకికము, అధ్యాత్మికము కూడ – సూచించును. పునరుత్పత్తి అను అర్థము కూడ కలదు. 'సూ' అను ధాతువునుండి ఆవిర్భవించుటయే దీనికి కారణము.

ఈ కూటమిలోని 'ల' అక్షరము మొదటికూటమిలో సూచించిన దానినే ఇచట కూడ సూచించుచున్నది. కాని యిచట 'విరివిగా' అను అర్థము కూడ చెప్పబడుచున్నది. సహజముగా 'ల' శక్తి చిహ్నము.

ఈ ఆరు అక్షరములు – హ స క హ ల హ్రీం – కామరాజకూటమికి చెందినవి. వరివస్యా రహస్యము ప్రకారము కామరాజకూటమి యనగా అధిక సంపద, ధైర్యము, స్త్రీభోగము, కీర్తి. ఇవి మన్మథ సూచకములు.

శౌర్యంధనస్త్రీయశసామాధిక్యం కామరాజార్థః

ఈ కూటమి దేవి శరీరమును ముఖమునుండి నడుము వరకు సూచించును.

కంఠాధః కటిపర్యంతమధ్యకూటస్వరూపిణీ

మూడవదైన శక్తికూటమిలోని అక్షరములన్నియు ఇంతకు పూర్వము వివరించబడినవే. శక్తికూటమిలోని నాలుగు అక్షరములలో ప్రముఖంగా మొదటి మూడు అక్షరములు – స క ల – సకలమును అనగా అన్నిటిని సూచించును. చివరి అక్షరము దేవిని సూచించును. స క ల అను అక్షరములతో అంతమయే పదములు 'హ్రీం'తో చేరినపుడు కర్మధారయ సమాసమగును. దీని అర్థము 'నాద' లేక 'సంవిత్' (జ్ఞానము). భాస్కరరాయలు ఈ విధముగా చెప్పిరి.

సకలాంతేన పదేన హ్రీంకారః కర్మధారయః కార్యః
తస్య విశేష్యో మః స్యాన్నాదార్థః సంవిదర్థో వా

దీనిని శక్తికూటమి యందురు. 'స' శక్తి చిహ్నము. 'ల' పృథివి లేక భువనేశ్వరిని సూచించును. 'సకల' అన్ని కార్యములను సూచించును. 'హ్రీం' విశ్వవిధ్వంసమునకు సూచకము. హ్రీంకారములోని 'ఈ' తేజస్సును సూచించును. సృష్టి స్థితులకు ఇదియే కారణము. మొత్తము అన్నిటిని పరిశీలించి చూచినపుడు, మూడవదైన శక్తికూటమి శక్తి స్వరూపమును, ఆమెయొక్క సకల శక్తులను తెలుపుచున్నదని తెలియును. ఆమె మూడు శక్తులకు స,క,ల అను మూడు అక్షరములు చిహ్నములు.

నాలుగు అక్షరముల శక్తికూటమి దేవి దిగువ భాగమును, నడుము మొదలు పాదముల వరకు, సూచించును.

శక్తికూటైకతాపన్నకట్యధోభాగధారిణీ

రుద్రయామల తంత్రము ప్రకారము, మూడు కటి ప్రదేశములు అగ్ని, సూర్య, చంద్రులను; బ్రహ్మ విష్ణు రుద్రులను; ఋగ్ యజుస్, సామములను; గాయత్రీ త్రిష్టుప్ జగతియను ఛందోమంత్రములను సూచించును. బాలామంత్రములోని మూడు అక్షరములను – ఏం క్లీం సౌ – కూడ సూచించును. అవి దేవియొక్క శబ్దరూపములు.

భాగము	మంత్రకూటమి	చక్ర ఆవరణలు	కుండలిని
చంద్రుడు	శక్తికూటము	4 శివ చక్రములు	సోమ కుండలిని
సూర్యుడు	కామరాజకూటము	చతుర్దశార త్రిభుజము, బహిర్దశారము	సూర్యకుండలిని
అగ్ని	వాగ్భవకూటము	అంతర్దశారము, అష్టకోణము, త్రికోణము, బిందు	అగ్నికుండలిని

పదిహేను అక్షరముల మంత్రము, పంచదశి ఆదిశంకరులవారిచే సౌందర్యలహరిలో ఒకశ్లోకమందు అద్భుతముగా వర్ణించబడెను.


శివః శక్తిః కామః క్షితిరథ రవిః శీతకిరణః ।
స్మరో హంసః శక్రస్తదను చ పరమారహరయః ॥
అమీ హృల్లేఖాభిస్తిసృభిరవసానేషు ఘటితాః ।
భజంతే వర్ణాస్తే తవ జనని నామావయవతామ్ ॥

ఓ తల్లీ! శివ, శక్తి, కామ, పృథివి, సూర్యుడు, చంద్రుడు, స్మర, హంస, ఇంద్రులతో పర, మార, హరి – ఈ ద్వాదశాక్షరములు మూడు హృల్లేఖలతో కలిసి నీ యొక్క మంత్రమునకు అవయవములు అగుచున్నవి.

పైని వివరించినట్లు, ప్రతి అక్షరముయొక్క అర్థము ఆధారంగా భాస్కరరాయలు పంచదశికి సంపూర్ణ అర్థము నందించిరి.

బహుతరసమాసయాగాత్ సమస్తపురుషార్థసాధనత్వోక్తేః ।
సంక్షేపాత్ సారోక్తేః శ్రీవిద్యాయాః సమస్తార్థః ॥

మూడు కూటములను కలిపి మొత్తము మంత్రమును పరిశీలించినచో సంపూర్ణ అర్థము ఏమనగా: మంత్రము సాధకునికి సకల సుఖములు, ఆనందము అందించును. మరియు సకలాభీష్టములను నెరవేర్చి. శ్రీవిద్యాసారమును సంక్షిప్తరూపములో ప్రసాదించును. ఇది వ్యాకరణ సూత్రముల కనుగుణముగా ఉండకపోవచ్చును. ఉండవలసిన అవసరము కూడ లేదు. మంత్రార్థము దేనికి భిన్నము కాదు. పంచదశీ మంత్రమును మననము చేయుచు ఆనందము పొందుటకు అనేక భాగములున్నవి. ఈ భాగములను వలయాకార పటములో చూడవచ్చును.



సాధకుడు మంత్రము నుచ్చరించునపుడు, కొన్ని కనీసమైన ప్రాథమిక సూత్రములను పాటించవలెనని శాస్త్రములు నిర్దేశించుచున్నవి.

. మంత్రము నుచ్చరించుటకు ముందు సాధకుడు దేవి లేక దేవతను తెలిసికొనవలెను.
. మంత్రము నుచ్చరించుటకు ప్రత్యేకమైన ఉదాత్తస్వరము గలదు. దీని ననుసరించలేకపోయినప్పటికి, మంత్రమును అతి తొందరగాగాని, లేక అతి నెమ్మదిగా గాని ఉచ్చరించరాదు.
. మంత్రార్థము తెలిసికొని మంత్రము నుచ్చరించవలెను.
. సాధకుడు సరియైన ఆసనముపై కూర్చొని, మంత్రము నుచ్చరించుటకు ముందు ద్యానమార్గములో మనస్సు నుంచవలెను.
. మంత్ర రహస్యమును కాపాడవలెను.

మంత్రము యొక్క లక్ష్యము సాధించుటకు, సాధకుడు జపము, దీక్ష, మంత్రార్థము, భావము, కవచము, కీలకము, న్యాసము, ముద్ర, మౌనము, గోపనీయత, మంత్రము, మంత్రదేవత లేక దేవితో ఏకత్వము పాటించవలెను. మంత్రము నుచ్చరించుటకు ముందు, మంత్రము దేవియొక్క శబ్దరూపమను విశ్వాసము సాధకుడు కలిగియుండవలెను.

మంత్రము పఠించు సాధకుడు, లక్ష్యము సాధించగలడనుటలో సందేహము లేదు. కాని అర్హతగల గురువునుండి సరియైన పద్ధతిలో ఉపదేశము పొందవలెను. లేకుండిన, మంత్రము నుచ్చరించుట నిష్ప్రయోజనమగును.

ఈ అధ్యాయములో సాధ్యమైనంతవరకు అనేక అర్థములను వివరించు ప్రయత్నము జరిగెను. కాని సాధకుడు ఒక విషయము గుర్తించవలెను. శ్రీవిద్యాలోని వివిధ భాగములలోనున్న ఏకత్వమును అవగాహన చేసికొనినపుడు, మంత్రము యొక్క అర్థము తెలిసికొని ఆనందమనుభవించగలడు. ఇందుకొరకు సాధకుడు నిర్విరామంగా నిర్ణీత పద్ధతిలో మంత్రమును మననము చేయుచుండవలెను. మంత్రరహస్యమును కాపాడుట అత్యంతావశ్యకము. అందుచేతనే శాస్త్రములలో ఏ మంత్రమునకైన దాని సారమును ప్రత్యక్షముగా తెలిసికొనుట క్లిష్టముగను, అసహాయకరముగను ఉన్నట్లు గోచరించును. అనేక తంత్రశాస్త్ర గ్రంథములు మంత్ర రహస్యము కాపాడవలెనని పదే పదే ఉద్ఘాటించెను.

గోపనీయం గోపనీయం గోపనీయం ప్రయత్నతః
అతిగుహ్యాతరం దేవి .....
గోపనీయం ప్రయత్నేన .....

విశ్వాసము కలవానికి అర్థము తెలిసికొనుట కష్టము కాదు.

8 శ్రీచక్ర పూజ

పూజా క్రమము

శ్రీచక్రోపాసన అనగా ప్రధానముగా త్రిపురసుందరీదేవి లేక లలితాదేవి ఉపాసన. శ్రీవిద్య అత్యంత రహస్యమైనది అయినప్పటికి, అర్హతగల గురువుల ద్వారా మాత్రమే లభ్యమగుచున్నను, శ్రీవిద్యా విషయమై విస్తారమైన సాహిత్యసంపద అందుబాటులో ఉన్నది. శ్రీవిద్యా సాహిత్యమునందు శ్రీవిద్యను వైదిక సంప్రదాయముతో సమన్వయపరచు ధోరణి ఈ సాహిత్యమునందు అంతటా స్పష్టముగా గోచరించును. ఇరువురు ప్రముఖ దక్షిణభారత విద్వాంసులు, లోల్ల లక్ష్మీధరుడు, భాస్కరరాయలు శ్రీవిద్యోపాసనపై నూతన దృక్పథము కలిగించిరి. మరియు శ్రీవిద్యోపాసనా పద్ధతిని మెరుగుపరచి పునర్నిర్వచించిరి. వారు కర్మకాండ కంటె అధ్యాత్మిక విషయమునకు అధిక ప్రాముఖ్యము నిచ్చిరి. వారు సూచించిన మార్గము, తత్త్వము తాంత్రికుల ఆమోదము పొందెను. వామకేశ్వర తంత్రము, సనత్కుమార సంహిత రెండును కూడ అంతర్యాగము లేక అంతరంగ ఉపాసనయొక్క ప్రాముఖ్యము నుద్ఘాటించెను.

అంతర్యాగాత్మికా పూజా సర్వపూజోత్తమా ప్రియే
బహిః పూజా విధాతవ్యా యావజ్జ్ఞానం న జాయతే
–వామకేశ్వర తంత్రము

బాహ్యపూజా న కర్తవ్యా
– సనత్కుమార సంహిత

ఇంతకు ముందు అధ్యాయములలో శ్రీవిద్య, కుండలిని విపులముగా చర్చించబడెను. శ్రీవిద్యా చంద్రకళావిద్యతో సమానముగా, పర్యాయపదముగా చెప్పబడుచున్నది. శ్రీవిద్య, పంచదశి గాయత్రులతోను, వాటిలోని అప్రకటిత భాగముతోను సమానముగా పరిగణించబడుచున్నది.

పూజాపద్ధతిపై అనేక ప్రతిపాదనలు కలవు. కొన్ని అగ్నిసంబంధమైన కర్మకాండతో చేయు పూజ ఉత్తమమని తెలుపుచున్నవి. అగ్ని లేకున్నను, దేశకాలములకు కట్టుబడి పూజ చేయవచ్చును. ఇది మధ్యమము. మూడవది కేవలము పుష్పములతో చేయు పూజ కనిష్ఠమని చెప్పబడుచున్నది.

అగ్నికార్యేణ హవిషా భూషణైశ్చ సమన్వితమ్ ।
ద్రవ్యశుద్ధి సమాయుక్త ముత్తమం పూజనం స్మృతమ్ ॥
అగ్నికార్యవిహీనం తు కాలదేశానసారతః ।
ఉపచారైర్యుతం ద్రవ్యైర్మధ్యమం పూజనం స్మృతమ్ ॥
వస్త్రాలంకార వస్తూని వర్జయిత్వా పృథగ్విధమ్ ।
కేవలా పుష్పయోగం తు కనిష్ఠం పూజనం స్మృతమ్ ॥
– బ్రహ్మసంహిత

కాని సాధకుల పరిమితుల దృష్ట్యా కొన్ని ప్రత్యామ్నాయములు, వెసులుబాట్లు సూచించబడినవి. ఆ ప్రకారము సాధకుడి అర్హతపై పూజ ఆధారపడియుండునని శారదాతిలక తంత్రము తెలుపుచున్నది.

అధికారి నిమిత్తాభ్యాం భిద్యతే శతథా పునః

సాధకుడి గుణము – సాత్త్వికము, రాజసికము, తామసికము – ననుసరించి పూజా పద్ధతి విభజించబడి చెప్పబడెను.

పూజాక్రమములో అత్యంత ప్రాముఖ్యము కలది ధ్యానము. ధ్యానమనగా మనస్సును, జ్ఞానేంద్రియములను నిగ్రహించి అదుపులో నుంచుట అని కులార్ణవ తంత్రము నిర్వచించుచున్నది. ధ్యానమనగా ఇష్టదైవమును క్రమశిక్షణతోనున్న మనస్సు, ఉన్నతస్థాయి అంతరాత్మలతో తలంచుట అని యాజ్ఞవల్క్య స్మృతి నిర్వచించెను. ధ్యానము మరల రెండు రకములు. ఒకటి సాకార దైవమును ధ్యానించుట. రెండవది నిరాకార దైవమును ధ్యానించుట. నిరాకార ధ్యానమును అరూపధ్యానమందురు. దీనికి ఏకాగ్రత చాల అవసరము. ఇది సూక్ష్మమైనది, ఉత్తమమైనది కూడ.

ఊహ, భావములు మున్నగువాటితో కూడిన పూజను మానసిక పూజ అందురు. మానసిక పూజకు ఎటువంటి ద్రవ్యములు అవసరము లేదు. కేవలము దేవీ నామజపము సరిపోవును. తాంత్రిక గ్రంథములు ఇట్టి పూజను ఉత్తమమైనదిగా పేర్కొనుచున్నవి.

సర్వేషాం కర్మణాం జపయజ్ఞః శ్రేష్ఠః
జపేన దేవతా నిత్యం స్తూయమానా ప్రసీదతి
–యోగినీ హృదయము

జపము 108 పర్యాయములు లేక 28 పర్యాయములు లేక కనీసం 10 పర్యాయములు చేయవలెను.

అష్టోత్తరశతం నిత్యమష్టవింశతిరేవ వా
విధినా దశకం వాஉపి త్రికాలేషు జపేద్బుధః
– వ్యాసస్మృతి

బహిః పూజలో అనేక అంగములు ఉన్నవి. అవి: ఋషి, ఛందస్సు, దేవత, లగ్నము చేయుట, బీజము, శక్తి, కీలకము, న్యాసము, ధ్యానము, నియమము, పూజ, ఇత్యాది.

ఋషయచ్ఛందోదైవతవినిర్యోగా బీజశక్తికీలాని
న్యాసా ధ్యానం నియమాః పూజాదీని బహిరంగాణి
– వరివస్యా రహస్యము

అంతరంగపూజ లేక మానసిక పూజయొక్క అంగములు గుప్తమైనవి, సులభముగా అర్థము కానివి. భాస్కరరాయలు బహిరంగపూజ, అంతరంగపూజలను వరుసగా వృక్షము, దాని వేరులతో సరిపోల్చెను.

అంతరంగపూజ చేయు దశను చేరుకొనుటకు సాధకుడు మొదట బహిరంగ పూజాపద్ధతి నలవరచుకొనవలెను. ప్రారంభ దశలలో చక్రము కూడ ఉపయోగపడకపోవచ్చును. సాధకుడు ధ్యానించుటకు, పూజించుటకు రూపము కావలెను. నిర్విరామంగా, నిర్ణీతపద్ధతిలో ఏకాగ్రతతో కొంతకాలము పూజ చేసినపుడు, సాధకుడు ఒక స్థాయి చేరుకొనును. అప్పుడు అతని మనస్సు, దేవీరూపము లేకుండ, శ్రీచక్రముపై ధ్యానము

చేయగలుగును. వీటన్నిటిని సక్రమంగా చేయుటకు, తాంత్రిక గ్రంథములు పదే పదే ఉద్ఘాటించినట్లు, తగిన గురువుయొక్క ఆవశ్యకత కలదు.

శ్రీచక్రోపాసనకు ఉపదేశము, మంత్రార్థము, మంత్రజ్ఞానము, గురువు పాదములందు దృఢమైన భక్తి, శ్రీచక్ర, శ్రీవిద్యలకు సంబంధించిన కర్మకాండ, అధ్యాత్మిక వివరములను గ్రహించుటకు నిశ్చలమైన మనస్సు ఉండవలెను. కాని శ్రీచక్రము నర్థము చేసికొను ఉద్దేశము, సంకల్పము ఉండినచో గురూపదేశము లేకుండినను, ఉపాసన చేయవచ్చును. అయితే వారు నవావరణ పూజ చేయుటకు వీలు లేదు. ఎందుచేతననగా, ఒకొక్క ఆవరణము ప్రత్యేకమైన క్రమములో ఆయా మంత్రములను, పద్ధతిని అనుసరించి ఉపాసించవలెను. ఇది కేవలము ఉపదేశము పొందినవారు క్రింది క్రమములో చేయవలెను.

గురుపాదుకా మంత్రపఠనము
ఘంటాపూజ
సంకల్పము
ప్రాణప్రతిష్ఠ
ధ్యానము
అంగన్యాస, కరన్యాసములు
కళాత్మక పూజ
అంతర్యాగము
రుద్రాభిషేకము
పురుషసూక్తము
విష్ణుపూజ
షట్చక్రపూజ
నవావరణ పూజ
ధూపము
దీపము
నైవేద్యము
మంత్రపుష్పము
బలిహరణము
ఉద్వాసన
అమృతా ఉస్వాదనము

ఈ పూజ అనేక ఆసనములు, ముద్రలతో కూడియున్నది, ఇవి కనీసము 10 నుండి 32 వరకు లేక అంతకు మించి కూడ యుండవచ్చును.

గురూపదేశము పొందని వారు శ్రీచక్రోపాసన చేయగోరినచో, వారికి సామాన్య ఉపాసనా మార్గములు చెప్పబడెను. మంత్రము, పూజాక్రమముతో కొన్ని, అవి లేకుండ కొన్ని కలవు. పూజ, లలితా కల్పము లేక పురుషసూక్తము గాని శ్రీసూక్తము గాని, లేక ఇతర మంత్రములతో గాని గురువు దర్శకత్వములో చేయవచ్చును.

దేవీ ఖడ్గమాల మరొక ముఖ్య గ్రంథము. దీనిని శ్రీచక్రోపాసనలో కూడ ఉపయోగించవచ్చును. శ్రీసూక్తముద్వారా శ్రీచక్రార్చన ఇచట ఉదాహరణగా చెప్పబడెను. ప్రాథమిక పూజానంతరము, ఈ క్రింది పూజాక్రమమును పాటించవచ్చును.

ఇది సంపూర్ణము, సమగ్రము కాదు. అయితే అసంపూర్ణమనుటకు కూడ వీలు లేదు. ఇంకను అధికముగా కోరువారు త్రిపురసుందరీదేవి ఆశీస్సులు ఉండినచో తెలిసికొనగలరు.

కేవలము శ్రీచక్రమును దర్శించినంత మాత్రమున, శతయాగములు చేసిన ఫలితము నందుకొనవచ్చునని తాంత్రిక గ్రంథములు చెప్పుచున్నవి.

సమ్యక్ శతం క్రతూన్ కృత్వా యత్ఫలం సమవాప్నుయాత్ ।
తత్ఫలం సమవాప్నోతి కృత్వా శ్రీచక్రదర్శనమ్ ॥

9 శ్రీసూక్తానుసారము శ్రీచక్ర పూజా విధానము

ధ్యానమ్

అస్యమధ్యే మరుత్సేవ్యం చతుర్ద్వార సముజ్జ్వలమ్ ।
చతురస్రత్రిరేఖాఢ్యం చారు త్రివలయాంకితమ్ ॥
కళాషోడశభిర్యుక్తమ్ అష్టపల్లవసంయుతమ్ ।
చతుర్దశారరుచిరం దశారద్వితయాన్వితమ్ ॥
అష్టకోణయుతం దివ్యమ్ అగ్నికోణసముజ్జ్వలమ్ ।
యోగిభిః పూజితం నిత్యం యోగినీగణ సేవితమ్ ॥
కూష్మాండగ్రహవేతాలక్రూరదానవవిగ్రహమ్ ।
ఉపాసితముమాకాంతముకుందాం భోజసంభవైః ॥
ఆశాభిపూరకం నిత్యమ్ అర్చకానామ్ అహర్నిశమ్ ।
అష్టాదశకమర్మాఢ్యం చతుర్వింశతిసంధికమ్
శ్రీమదిందుగ్రహోపేతం శ్రీచక్రం ప్రణమామ్యహమ్
ధ్యానం సమర్పయామి ।

ఆవాహనమ్

హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజతస్రజామ్ ।
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ ॥
ఇత్యావాహనం సమర్పయామి ।

ఆసనమ్

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమనపగామినీమ్ ।
యస్యాం హిరణ్యం విందేయం గామశ్వం పురుషానహమ్ ॥
ఇత్యాసనం సమర్పయామి ।

ప్రాణప్రతిష్ఠ

అసునీతే పునరస్మా సుచక్షుః పునః ప్రాణమిహ నో దేహి భోగమ్ ।
జ్యోక్పశ్యేమ సూర్యముచ్చరంత మనుమతే మృడయానః స్వస్తి।
అమృతం వై ప్రాణా అమృతమాపః ప్రాణానేవ యథాస్థానముపహ్వాయతే ॥

ఆవాహితో భవ, స్థాపితో భవ, సుప్రసన్నో భవ, వరదో భవ, అవకుంఠితో భవ, స్థిరాసనం కురు ప్రసీద, ప్రసీద, ప్రసీద ।

పాద్యమ్

అశ్వపూర్వాం రథమధ్యాం హస్తినాద ప్రబోధినీమ్ ।
శ్రియం దేవీముపహ్వయే శ్రీర్మా దేవీర్జుషతామ్ ॥
ఇతి పాద్యం సమర్పయామి ।

అర్ఘ్యమ్

కాం సోస్మితాం హిరణ్యప్రాకారామార్ద్రాం జ్వలంతీం నిత్యతృప్తాముదారామ్ ।
పద్మే స్థితాం పద్మావర్ణాం తామిహోపహ్వయే శ్రియమ్ ।
ఇత్యర్ఘ్యం సమర్పయామి ।

ఆచమనమ్

చంద్రాం ప్రభాసాం యశసా జ్వలంతీం శ్రియం లోకే దేవజుష్టాముదారామ్ ।
తాం పద్మినీమీం శరణమహం ప్రపద్యే అలక్ష్మీర్మే నశ్యతాం త్వాం వృణే ॥
ఇత్యాచమనీయం సమర్పయామి ।

స్నానమ్

అదిత్యవర్ణే తపసోఽధిజాతో వనస్పతిస్తవ వృక్షోఽథ బిల్వః ।
తస్య ఫలాని తపసా నుదంతు మాయాంతరాయాశ్చ బాహ్యో అలక్ష్మీః॥
ఇతి స్నానమ్ ।

వస్త్రమ్

ఉపైతు మాం దేవసఖః కీర్తిశ్చ మణినా సహ ।
ప్రాదుర్భూతోఽస్మి రాష్ట్రేఽస్మిన్ కీర్తిమృద్ధిం దదాతు మే ॥
వస్త్రయుగ్మం సమర్పయామి ।

కంఠసూత్రమ్

క్షుత్పిపాసామలాం జ్యేష్ఠామ్ అలక్ష్మీర్నాశయామ్యహమ్ ।
అభూతిమసమృద్ధిం చ సర్వాం నిర్ణుద మే గృహాత్ ॥
కంఠసూత్రం సమర్పయామి ।

శ్రీచందనమ్

గంధద్వారాం దురాధర్షా నిత్యపుష్టాం కరీషిణీమ్ ।
ఈశ్వరీం గ్‌ం సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియమ్ ॥
దివ్యశ్రీచందనం సమర్పయామి ।

కుంకుమమ్

మనసః కామమాకూతిం వాచ సత్యమశీమహి ।
పశూనాం రూపమన్నస్య మయి శ్రీః శ్రయతాం యశః ॥

అథాంగపూజ

శ్రీమహాసింహాసనేశ్వర్యై నమః	పాదౌ పూజయామి ।
లలితాయై నమః	గుల్ఫౌ పూజయామి ।
మహారాజ్ఞ్యైనమః	జంఘే పూజయామి ।
పరాంకుశాయై నమః	జానునీ పూజయామి ।
సుచాపిన్యై నమః	ఊరూం పూజయామి ।
త్రిపురాయై నమః	కటిం పూజయామి ।

మహాత్రిపురసుందర్యై నమః నాభిం పూజయామి ।
సుందర్యై నమః వలిత్రయం పూజయామి ।
చక్రనాథాయై నమః ఉదరం పూజయామి ।
సామ్రాజ్ఞై నమః హృదయం పూజయామి ।
చక్రిణ్యై నమః కంఠం పూజయామి ।
చక్రేశ్వర్యై నమః ఓష్ఠౌ పూజయామి ।
మహాదేవ్యై నమః కపోలం పూజయామి ।
కామేశ్వర్యై నమః దంతపంక్తిం పూజయామి ।
పరమేశ్వర్యై నమః చుబుకం పూజయామి ।
కామరాజప్రియాయై నమః నాసికాం పూజయామి ।
కామకోటికాయై నమః భ్రూమధ్యం పూజయామి ।
చక్రవర్తిన్యై నమః నేత్రద్వయం పూజయామి ।
మహావిద్యాయై నమః శ్రోత్రద్వయం పూజయామి ।
శివానంగవల్లభాయై నమః ఫాలం పూజయామి ।
సర్వపాటలాయై నమః ముఖం పూజయామి ।
కులనాథాయై నమః పార్శ్వే పూజయామి ।
ఆమ్నాయనాథాయై నమః శిరః పూజయామి ।
సార్వామ్నాయనివాసిన్యై నమః పాదుకే పపూజయామి ।
మహాశృంగారనాయికాయై నమః సర్వాణ్యంగాని పూజయామి ।

అనంతరం లలితా త్రిశతీం లలితాష్టోత్తరశతం లలితా సహస్రం వా కుర్యాత్।

ధూపమ్

కర్దమేన ప్రజా భూతా మయి సంభవ కర్దమ ।
శ్రియం వాసయమే కులే మాతరం పద్మమాలినీమ్ ।
ధూపమాఘ్రాపయామి ।

దీపమ్

ఆపః సృజంతు స్నిగ్ధాని చిక్లీత వస మే గృ హే ।
ని చ దేవీం మాతరం శ్రియం వాసయ మే కులే ॥
దీపం దర్శయామి । ధూపదీపానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి ।

నైవేద్యం

ఆర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీమ్ ।
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ ॥
నైవేద్యం సమర్పయామి ।

తాంబూలం

ఆర్ద్రాం యః కరిణీం యష్టిం సువర్ణాం హేమమాలినీమ్ ।
సూర్యాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ ॥
తాంబూలం సమర్పయామి।

నీరాజనమ్

తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీం అనపగామినీమ్ ।
యస్యాం హిరణ్యం ప్రభూతమ్ గావో దాస్యోఽశ్వాన్ విందేయం పురుషావహమ్ ॥
కర్పూరనీరాజనం సమర్పయామి ।

మంత్రపుష్పమ్

యః శుచిః ప్రయతో భూత్వా జుహు యాదాజ్య మన్వహమ్ ।
శ్రియః పంచదశర్చం చ శ్రీకామః సతతం జపేత్ ॥
సువర్ణదివ్యమంత్రపుష్పం సమర్పయామి ।

ఆత్మప్రదక్షిణమ్

యాని కాని చ పాపాని జన్మాంతరకృతాని చ ।
తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥
పాపోఽహం పాపకర్మాహం పాపాత్మా పాపసంభవః ।
త్రాహి మాం కృపయా దేవి శరణాగతవత్సలే ॥
అన్యథా శరణం నాఽస్తి త్వమేవ శరణం మమ ।
తస్మాత్కారుణ్యభావేన రక్ష రక్ష మ హేశ్వరి ॥
ఆత్మప్రదక్షిణనమస్కారాన్ సమర్పయామి ।

పునఃపూజా
ఛత్రం ధారయామి ।
చామరం వీచయామి ।
నృత్యం దర్శయామి ।
గీతం శ్రావయామి ।
రథానారోహయామి ।
గజానారోహయామి ।
ఆందోలికామారోహయామి ।
సమస్తరాజోపచార మంత్రోపచార తంత్రోపచారాన్ సమర్పయామి।

ఏతత్ ఫలం మహాకాళీ–మహాలక్ష్మీ–మహాసరస్వతీ–శ్రీ–శ్రీ–శ్రీ–శ్రీచక్రనగర సామ్రాజ్ఞీ
సాంగసాయుధ–సపరివార శ్రీలలితాత్రిపురసుందరీ దేవతార్పణమస్తు ।
లలితాత్రిపురసుందరీదేవతా సుప్రీతా సుప్రసన్నా వరదా భవతు ।
యదక్షర పదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ ।
తత్సర్వం క్షమ్యతాం దేవి నారాయణి నమోఽస్తు తే ॥
లోకాః సమస్తాః సుఖినో భవన్తు ।

10 దశ ముద్రలు

శ్రీచక్రపూజలో నవావరణములలోని ఒకొక్క ఆవరణకు ప్రత్యేకమైన పూజ కలదు. చక్రము మొత్తమునకు ఒక ముద్ర కలదు. అనగా మొత్తము దశ (పది) ముద్రలు కలవు. అందుచే లలితా సహస్రనామములో దేవి 'దశముద్రా సమారాధ్యా' (977) అని స్తుతించబడుచున్నది.

'ముద్ర' పదమునకు మూసివేయు (seal) అని సామన్యంగా అనువదింపబడుచున్నది. ఈ పదమునకు వివరణ ఏమనగా: 'ముద్ర' అనునది 'ముద్' (ఆనందము)ను 'ద్ర' (లయము)తో చేర్చుట వలన ఏర్పడుచున్నది. ఆవిధముగా ద్వంద్వమును లయముచేసి, దేవి లేక దేవతను సాధకుని ఒకటిగా చేయునది ముద్ర. అనేక భారతీయ పదములకువలె సందర్భము ననుసరించి, 'ముద్ర' పదమునకు అనేక అర్థములు చెప్పబడెను.

శ్రీచక్రము మొదటి ఆవరణలోని పసుపు వర్ణముగల మూడవరేఖ పది స్త్రీ దేవతలను (ముద్రాశక్తులు) సూచించును. ప్రమాణముగల ఈ ముద్రాశక్తులు దశదిశలందున్న దిక్పాలురను నిగ్రహించును.

శ్రీచక్రోపాసనలో ఉపయోగించబడు దశ ముద్రలు ఒకొక్క ఆవరణయొక్క దేవీశక్తినిప్రతిబింబించును. ముద్రల నభ్యసించుటలో ప్రాంతీయమైన అంతరములు (భేదములు) గోచరించును. కాబట్టి వాటిని గురువునుండి ప్రత్యక్షముగా నేర్వవలెను.


1. సర్వసంక్షోభిణీ ముద్ర:



త్రైలోక్యమోహన చక్రమునకు ఈ ముద్ర నుపయోగించెదరు. ఈ చక్రము భూపుర చతురస్రముచే సూచించబడుచున్నది.

రెండుహస్తముల చూపుడు వ్రేళ్ళు ఊర్ధ్వదిశగా నుండగా, మిగిలిన వ్రేళ్ళను బొటనవ్రేలు పట్టి ఉంచును. రెండు బొటన వ్రేళ్లు పరస్పరము కలిసియుండును.


2. సర్వ విద్రావిణీ ముద్ర:



ఈ ముద్ర షోడశదళపద్మము – సర్వాశాపరిపూరక చక్రమునకు కేటాయించబడెను.


చూపుడువ్రేలు మధ్యవ్రేలు కలిసి ఊర్ధ్వ దిశగా నుండగా, ఇతర వ్రేళ్ళను బొటనవ్రేలు పట్టి ఉంచును. బొటనవ్రేళ్ళు రెండు పరస్పరము కలిసియుండును.

3 సర్వాకర్షిణీ ముద్ర:




ఈ ముద్రను మూడవ ఆవరణ, అష్టదళపద్మము – సర్వసంక్షోభణ చక్రములో ఉపయోగింతురు. ఈ ముద్ర ఇంతకు ముందు ముద్రవలె ఉండును, ఒక్క విషయములో తప్ప. బొటనవ్రేళ్లు మినహా అన్ని వ్రేళ్ళు వంగియుండును.

4 సర్వ వశంకరీ ముద్ర:




నాల్గవ ఆవరణ, చతుర్దశ కోణవయులుగల సర్వసౌభాగ్యదాయక చక్రమునందు ఈ ముద్రను వాడుదురు. ఈ ముద్రలో రెండు చేతుల వ్రేళ్ళు చేరి పిడికిలి రూపములో నుండును.

5 సర్వోన్మాదినీ ముద్ర:



సర్వార్థసాధకమనే బహిర్దశార చక్రములో ఈ ముద్ర నుపయోగించెదరు. ఈ ముద్రలో రెండు చేతుల బొటన వ్రేళ్ళు, చిటికెన వ్రేళ్ళు, మధ్య వ్రేళ్లు కలిసియుండగా, మిగిలిన రెండు వ్రేళ్ళు సూటిగా ఒకదానితో కలుపబడును. పటములో చూపినట్లు రెండు చేతులు కలిసియుండును.

6 సర్వ మహాంకుశ ముద్ర:



సర్వరక్షాకరమనే అంతర్దశార చక్రములో ఈ ముద్ర వాడబడును. ఈ ముద్రలో రెండు చేతుల చిటికెన వ్రేళ్ళు సూటిగా కలిసియుండును. మిగిలిన నాలుగు వ్రేళ్ళు ఒకటిగా నుండును. చూపుడు వ్రేళ్ళు కొద్దిగా వంగియుండును.

7 సర్వఖేచరీ ముద్ర:



సర్వరోగహరమను అష్టకోణ చక్రములో ఈ ముద్ర ఉపయోగించబడును. ఈ ముద్రను రెండు చేతులు కలిసి ముఖమున కెదురుగా ఎడమచేతిపై కుడిచేయి, యోని ముద్రలోవలె (తొమ్మిదవ ముద్ర) నుండును.



8. సర్వబీజ ముద్ర:

సర్వసిద్ధిప్రదాయకమను ఎనిమిదవ ఆవరణ, త్రిభుజమునకు ఈ ముద్ర వాడబడును. ఈ ముద్రలో రెండు చేతుల చిటికెన వ్రేళ్ళు ఒకదాని కెదురుగా నొకటి యుండగా, ఎడమచేతి చూపుడువ్రేలు కుడిచేతి చిటికెనవ్రేలుపైని, కుడిచేతి ఉంగరము వ్రేలు ఎడమచేతి చిటికెనవ్రేలుపైని, రెండుచేతుల మధ్యవ్రేళ్ళు ఒకదానితో నొకటి కలిసియుండును.



9. సర్వయోని ముద్ర:

సర్వానందమయ చక్రములో కేంద్రబిందువుకు ఈ ముద్ర ఉపయోగించబడును. ఈ ముద్రలో రెండు చిటికెన వ్రేళ్ళు ముందుకు వంగి, కుడిచేతి చూపుడువ్రేలు ఎడమచేతి ఉంగరమువ్రేలు చుట్టూ అల్లుకొని యుండును. బొటనవ్రేళ్ళు, చిటికెనవ్రేళ్ళు అధోదిశగా కలిసియుండును.

10. సర్వత్రిఖండ ముద్ర:



ఈ ముద్ర చక్రము మొత్తమునకు వర్తించును. అన్ని ఆవరణల దేవతల నాహ్వానించుటకు ఈ ముద్ర ఉపయోగించబడును. ఈ ముద్రలో చేతులు మొదట యోనిముద్రలోవలె ఉంచబడి, చిటికెనవ్రేళ్ళు అధోదిశగాను, బొటనవ్రేళ్ళు ఊర్ధ్వదిశగాను, అరచేతులు ఒకదానికొకటి లంబముగను ఉంచబడును.

కేవలము పటములను చూసి ఈ ముద్రలను చూపుటకు ప్రయత్నించరాదు. గురువు సహాయముతో ఈ ముద్రల నభ్యసించవలెను. పాఠకుల అవగాహనకొరకు మాత్రము ఈ పటములు చూపించబడెను.

11 శ్రీచక్రశాస్త్ర గ్రంథములు

శ్రీవిద్యా శ్రీచక్రములపై శాస్త్రగ్రంథములు

భారతదేశమంతట విస్తరించిన శ్రీవిద్యా వాదము చాలవరకు ప్రాచీనత సంతరించుకున్నది. అయితే ప్రాంతీయ భేదములు లేకపోలేదు. శ్రీవిద్యా మార్గము గోప్యముగా నుంచబడినను, శ్రీవిద్యా సాహిత్యము విరివిగా ఉన్నదని తెలియును. కాలమాన ప్రకారము ఈ గ్రంథములను పరిశీలించినచో క్రీ.శ. ఆరవ శతాబ్దమునకు పూర్వము వ్రాయబడిన గ్రంథములు అతి తక్కువగా నున్నట్లు కన్పించును. శ్రీవిద్యా శ్రీచక్రములపై కొన్ని ఉపనిషత్తులు ఉన్నవి. అనేక తాంత్రిక గ్రంథములు ఆచరణాత్మక గ్రంథములు శ్రీవిద్యలోని వివిధ భాగములను వివరించుచు వ్రాయబడెను. భారతదేశములో పదునెనిమిది శక్తిపీఠములు కలవు. ఇవి అన్ని ప్రాంతములలో ఉన్నవి. సుమారు ఏబది ప్రాంతములలో శ్రీచక్రము యొక్క ప్రభావము అధికముగా నున్నది. కొన్ని యిటీవల ఏర్పడినవి. శ్రీచక్రమును విశ్వసించు వర్గములు భారతదేశపు ఎల్లలు దాటి, హిమాలయ ప్రాంతములైన నేపాల్, టిబెట్‌లలో కూడ ఏర్పడెను. కొందరు వైదిక, తాంత్రిక అభ్యాసములను సమాంతరముగా పరిగణింతురు. శ్రీవిద్యకు సంబంధించిన అనేక గ్రంథములు, ఈ రెండింటిని సమన్వయపరచుటకు ప్రయత్నించెను. శ్రీవిద్య వైదికమతములో ఒక భాగముగా చూపుటకు కృషి జరిగెను.

ఈ రెండు సిద్ధాంతములు నేడు పరిపూర్ణముగా కలిసిపోయి యున్నవి. తాంత్రిక పద్ధతులను తీవ్రముగా బలపరచువారు కూడ వైదిక, తాంత్రిక సంప్రదాయములు రెండు కలవని అంగీకరింతురు. కాబట్టి శ్రీవిద్యా తత్త్వమును బలపరచు గ్రంథకర్తలకు తాంత్రిక, వైదిక కర్మకాండ సంప్రదాయములను సమన్వయపరచవలసిన అవసరమేర్పడినది. ఈ దృక్పథము లోల్ల లక్ష్మీధర, భాస్కరరాయల రచనలలో ప్రస్ఫుటముగా గోచరించును. లక్ష్మీధరుడు సౌందర్యలహరిపై అందరి మన్ననలు చూరగొన్న భాష్యము రచించిరి. వరివస్యా రహస్యమును రచించిన భాస్కరరాయలు వామకేశ్వర తంత్రముపై సేతుబంధమను భాష్యమును, లలితా సహస్రనామముపై సౌభాగ్యభాస్కరమను భాష్యమును, దుర్గాసప్తశతి భావానోపనిషత్తులపై భాష్యములను వ్రాసిరి. ఇవికాక, అనేక ఇతర గ్రంథములను రచించిరి. ఈ అధ్యాయములో శ్రీవిద్యా, శ్రీచక్రములపై వ్రాయబడిన కొన్ని ప్రముఖ గ్రంథములు సంక్షిప్తముగా ప్రస్తావించబడుచున్నవి.

సౌందర్యలహరి

ఆదిశంకరులు వారాణసిలో స్వయముగా శ్రీవిద్యా ఉపదేశము పొందిరి. ఆయన రచించిన సౌందర్యలహరిలో నూరు శ్లోకములు ఉన్నవి. ఈ గ్రంథములో వారు సహజముగా తాంత్రిక, మంత్ర, యంత్ర వివరములను పొందుపరచిరి. మొదటి నలుబదియక్క శ్లోకములు ఆనందలహరియని, మిగిలిన ఏబది తొమ్మిది శ్లోకములు సౌందర్యలహరియని పేర్కొనబడుచున్నవి. మూడు శ్లోకములు అన్వయశ్లోకములుగా పరిగణించబడుచున్నవి.

ఈ గ్రంథముపై సుమారు నలుబది భాష్యములు వ్రాయబడెను. శ్రీవిద్యా శ్రీచక్రములపై అనేక విషయములు విపులముగా వివరించబడెను.

త్రిపురోపనిషత్తు

సుమారు ఎనిమిది శాక్తేయ ఉపనిషత్తులు కలవు. వీటిలో త్రిపురోపనిషత్తు ప్రామాణికమైనది. ఈ ఉపనిషత్తులో కేవలము పదహారు శ్లోకములు, పదహారు బీజాక్షరములు, షోడశి ఉన్నవి. పదహారు

శ్లోకములలో మూడువందల పదములు మాత్రము ప్రతీకలుగా గోచరించును. పరోక్షముగా ఇవి లలితా త్రిశతిని సూచించును.

భావనోపనిషత్తు

ఈ ఉపనిషత్తు అథర్వవేదమునకు సంబంధించినదిగా చెప్పబడుచున్నది. మానవశరీరము, శ్రీచక్రములు ఈ ఉపనిషత్తులో విపులముగా వివరించబడెను. అధ్యాత్మిక పురోగతి సాధించిన భక్తులకు మానసిక పూజావిధానము వివరించబడెను. నలుబది తొమ్మిది సూత్రములుకల ఈ ఉపనిషత్తులో మొదటి పది సూత్రములు మానవశరీరమునకు సంబంధించిన విషయములను దేవి అంగములుగా చెప్పుచున్నవి. పదకొండవ సూత్రమునుండి ఇరువది నాల్గవ సూత్రము వరకు శ్రీచక్రము, అందులోని నవావరణములు విశదముగా తెలియజేయబడెను. ఇరువదియైదవ సూత్రమునుండి నలుబది తొమ్మిదవ సూత్రమువరకు అంతర్యాగము లేక మానసిక పూజావిధానము చెప్పబడెను. ఈ ఉపనిషత్తుపై రెండు ప్రముఖ భాష్యములను భాస్కరరాయలు, అప్పయ్య దీక్షితులు రచించిరి. మరియు త్రిపురతాపిని, దేవి, సౌభాగ్యలక్ష్మి, బహ్వృచ మొదలగు శాక్తేయ ఉపనిషత్తులు కలవు.

యోగినీ హృదయము

కౌలమార్గము నవలంబించువారు యోగినీ హృదయమును ప్రామాణిక గ్రంథముగా పరిగణింతురు. ఇందులో మొత్తము 383 శ్లోకములు ఉన్నవి. వాటిలో 86 శ్లోకములు యంత్రమునకు, 85 శ్లోకములు మంత్రమునకు, 212 శ్లోకములు తంత్రమునకు సంబంధించినవి. గ్రంథము మొత్తము శ్రీవిద్య గురించి శివుడు పార్వతికి చెప్పినట్లు కలదు. యోగినీ హృదయముపై భాస్కరరాయలు, అమృతానందుడు, మరికొందరు భాష్యములు వ్రాసిరి.

కామకలా విలాసము

అనేకమంది గ్రంథనామముబట్టి కామక్రీడలకు సంబంధించిన గ్రంథమని పొరపాటు పడుదురు. శ్రీవిద్య నభ్యసించువారిలో 'హాది' వర్గమువారు దీనిని ప్రామాణిక గ్రంథముగా పరిగణించెదరు. 'కామకలా' అను పదమునకు 'శివశక్తు'లని అర్థము. శ్రీవిద్యపై ఉన్న గ్రంథములలో ఇది చాల ముఖ్యమైనది. తరువాతి కాలములో వచ్చిన అనేక తాంత్రిక గ్రంథములు, పై గ్రంథమును ప్రామాణికమైనదిగా పేర్కొనెను. ఏబదియైదు శ్లోకములున్న ఈ గ్రంథము శ్రీవిద్య, శ్రీచక్రములోని నవావరణములపై పలు సున్నితమైన సూక్ష్మ విషయములను వివరించెను. ఈ గ్రంథము నాలుగు భాగములుగా – అవిద్యాపాదము, విద్యాపాదము, ఆనందపాదము, తురీయపాదము – విభజించబడెను. దీని గ్రంథకర్త పుణ్యానందనాథుడు. ఈ గ్రంథముపై అనేక భాష్యములు రచించబడెను. చిదానందులవారి భాష్యము వాటిలో ప్రముఖమైనది.

శుభగోదయము

ఆదిశంకరులవారికి పరమగురువైన గౌడపాదాచార్యులవారు ఈ గ్రంథమును రచించినట్లు తెలియుచున్నది. ఈ గ్రంథములోని ఏబదిరెండు శ్లోకములు కుండలినీ, షట్చక్రములకు శ్రీచక్రముతోగల సంబంధమును వివరించుచున్నవి. ఈ గ్రంథమునకు అనేక భాష్యములు కలవు. గౌడపాదాచార్యులవారు శ్రీవిద్యారత్నసూత్రము లేక శక్తిసూత్రమును కూడ రచించినట్లు తెలియుచున్నది. కాని అవి ప్రస్తుతము అలభ్యము.

వరివస్యా రహస్యము

ఇది శాస్త్రీయమైన ఒక బృహద్గ్రంథము. శక్తి ఆగములలో విశదముగా చెప్పబడిన ఉపాసనా రహస్యమును ఈ గ్రంథము వివరించుచున్నది. ఇందులో బహిరంగ ఉపాసన, అంతరంగ ఉపాసన కూడ

చర్చించబడెను. ఈ గ్రంథములో నూటఅరువదియేడు శ్లోకములున్నవి. 'వరివస్యా' పదమునకు అర్థము ఉపాసన, లేక ఉపదేశించబడిన ఉపాసనాభ్యాసము. ఉపాసనకు ఆధారము మంత్రము. సాధకుడు, మంత్రోపాసనకు, ఉపాసనాభ్యాసమునకు ఉపదేశము పొందవలసిన ఆవశ్యకత ఉన్నది. మంత్రములు ద్రష్టలకు స్ఫురించగా, వారు తమ శిష్యులకు ఉపాసనాకళ నుపదేశించిరి. శ్రీవిద్యా, శ్రీచక్రములకు సంబంధించిన రహస్యములు ఈ గ్రంథములో వివరించబడెను. పలువురిచే కొనియాడబడిన ఈ గ్రంథరచయిత, భాస్కరరాయలు పదునెనిమిదవ శతాబ్దమునకు చెందినవాడుగా చెప్పబడుచున్నాడు. అనేక గ్రంథముల నతడు రచించినట్లు తెలియుచున్నది.

జ్ఞానార్ణవ తంత్రము

ఇరువది యారు అధ్యాయములుగల ఈ గ్రంథములోని విషయమును ఈశ్వరుడు పార్వతీదేవికి చెప్పినట్లు భావించబడుచున్నది. ఈ గ్రంథములోని ప్రధాన అధ్యాయములు శ్రీచక్రము, శ్రీవిద్య, ఉపాసనా పద్ధతులు, దేవి వివిధ రూపములకు సంబంధించిన మంత్రములు, శ్రీవిద్యా రహస్యములను వివరించుచున్నవి. జ్ఞానార్ణవ తంత్రమునకు అనేక భాష్యములు వ్రాయబడినవి. శ్రీవిద్యకు సంబంధించిన గ్రంథములలో ప్రముఖ గ్రంథముగా ఎంచబడుచున్నది.


నిత్య షోడశీకార్ణవ తంత్రము

ఈ గ్రంథము శ్రీవిద్యా తత్త్వములోని అప్రసిద్ధ గుప్తవిషయములను ప్రస్తావించెను. అయిదు అధ్యాయములుగల ఈ గ్రంథమునందు పూజావిధానము, ప్రయోగము, ముద్ర, విద్య, జపము వివరించబడెను. త్రిపురోపాసన విపులముగా ప్రతిపాదించబడెను. ఈ గ్రంథముపై అనేక భాష్యములు వెలువడెను. శివానంద, విద్యానందుల వారి భాష్యములు ముఖ్యమైనవి.

ఇతర గ్రంథము లనేకము కలవు. వామకేశ్వర తంత్రము, రుద్రయామల తంత్రము, సౌభాగ్యకల్పద్రుమము, లలితార్చన చంద్రికా, షట్చక్ర నిరూపణ, నిత్యోత్సవము, సేతుబంధనము మొదలైనవి.

శ్రీవిద్యారణ్య తంత్రము మరొక గొప్ప గ్రంథము. సుమారుగా క్రీ.శ. పదునాల్గవ శతాబ్దములో రచింపబడినది. ఈ కాలమునందే తంత్రరాజ తంత్రము, మాతృకార్ణవ తంత్రము రచించబడినవి.

శ్రీవిద్యా, శ్రీచక్రములపై అనేక గ్రంథములు, స్తోత్రములు రచించబడినవి. ఈ గ్రంథములపై తగినంత అవగాహన సాధకుని జ్ఞానము పెంపొందుటకు దోహదము చేయును. మరియు శ్రీవిద్యావాదములోని సూక్ష్మవిషయములు, రహస్యములు అవగతమగును.



12 ముత్తుస్వామి దీక్షితర్ నవావరణ కృతులు

ముత్తుస్వామి దీక్షితర్ (1775–1835)

కర్ణాటక సంగీత వాగ్గేయకారులు ఒకే కాలములో ఒకే ప్రదేశములో నివసించుట దివ్యసంఘటనకు గొప్ప నిదర్శనము. త్యాగరాజస్వామి (1769–1847), శ్యామశాస్త్రి (1762–1827), ముత్తుస్వామి దీక్షితర్ (1775–1835) మనకు గొప్ప సంగీత సంపదను ప్రసాదించిరి. దీక్షితర్ అందరిలోకి చిన్నవారు, ఎక్కువగా సంచారము చేసినవారు.

ముత్తుస్వామి దీక్షితర్ అయిదు సంవత్సరములకు పైగా వారాణసిలో నివసించిరి. అచటనే వారు శ్రీవిద్యా ఉపదేశము పొందిరని సుబ్బరామ దీక్షితర్ వారి సంగీతసంప్రదాయ ప్రదర్శిని తెలియజేయుచున్నది. శ్యామశాస్త్రియే దీక్షితర్‌కు శ్రీవిద్యా ఉపదేశము చేసిరని కొందరి విద్వాంసుల అభిప్రాయము. వారాణసిలో నివసించుచున్న కాలమునందే దీక్షితర్ అనేక రంగములలో పాండిత్యము సంపాదించిరి. ప్రత్యేకముగా పేర్కొనదగినవి దిగ్భ్రాంతి కలిగించు మంత్రశాస్త్ర జ్ఞానము, హిదుస్తానీ సంగీతములోని మెలకువలు.

దీక్షితర్ కృతులన్నిటిలో రాగప్రస్తారము, విస్తరణ శాస్త్రీయముగా కన్పించును. ఆయన గొప్ప వైణికుడు కూడ. వైణికుడిగా ఆయన పాండిత్యము గమకములందు, విలంబకాల మధ్యమకాల సాహిత్యములందు ప్రతిబింబించును. ఆయన రాగములను, అపూర్వ పదములను ఉపయోగించిన తీరు ఒకొక్కచోట వారి కృతులకు అసామాన్య శ్రావ్యతను, తేజస్సును చేకూర్చెను.

దీక్షితర్‌గారి వీణా విన్యాసములు, సంస్కృత గద్యపద్యములతో సౌకర్యము మొదలైన గొప్ప పాండితీవిన్యాసములు, అనేక కృతులందు విభక్తులతో ప్రయోగములు చేయుటేకాక, కొన్నిటిలో ఎంతో క్లిష్టమైన అలంకారములు, నిర్ణీత క్రమపద్ధతిలో గోపుచ్ఛయతి స్రోతోవహయతులను ఉపయోగించిరి. గోపుచ్ఛయతిలో విశాలమైన అలంకారముతో ఆరంభమై క్రమముగా ఆవుతోక వలె సన్నబడును. స్రోతోవహయతిలో ఇది సన్నదిగా ఆరంభమై నదీప్రవాహమువలె విశాలముగా చివరలో ముగియును. ఈ రెండు పద్ధతులను దీక్షితర్ త్యాగరాజ యోగవైభవమను ఆనందభైరవి కృతిలో ప్రవేశపెట్టిరి. ఇతర కృతులలో వీటిని విడివిడిగా ఉపయోగించిరి.

ఈ రెండు పద్ధతులు ఆనందభైరవి కృతిలో ఉపయోగించిన పద్ధతి ఉదాహరణగా ఇవ్వబడుచున్నది.

గోపుచ్ఛయతి

త్యాగరాజ – యోగవైభవమ్
అగరాజ – యోగవైభవమ్
రాజయోగ వైభవమ్
యోగవైభవమ్
వైభవమ్
భవమ్
వమ్

ఇదే కృతియందు అనుపల్లవిలో స్రోపవహాయతి నుపయోగించిరి. ఇచట కావ్యము 'శివశక్త్యాది సకలతత్త్వస్వరూపప్రకాశమ్. ఇది క్రింది విధముగా గానము చేయబడుచున్నది.

శమ్
ప్రకాశమ్
స్వరూపప్రకాశమ్
తత్త్వస్వరూపప్రకాశమ్
సకలతత్త్వస్వరూపప్రకాశమ్
శక్త్యాదిసకలతత్త్వస్వరూపప్రకాశమ్
శివశక్త్యాదిసకలతత్త్వస్వరూపప్రకాశమ్

సంస్కృతములో కృతులను రచించుటలో దీక్షితర్ ఆద్యుడు. ఆయన పాశ్చాత్య శ్రావ్యగీతములకు, బ్రిటన్ జాతీయగీతముతో సహా, సంస్కృతములో చరణములు రచించిరి. పులివలలోని వేంకటాచలపతిని స్తోత్రము చేయుచు, మణిప్రవాళమును తమిళ, తెలుగు, సంస్కృత భాషలలో కాపీ రాగములో కూర్చిరి.

కర్ణాటకసంగీత వాగ్గేయకార త్రయములో త్యాగరాజస్వామివారి కృతులలో శ్రావ్యత, సాహితీసౌందర్యము; శ్యామశాస్త్రి కృతులలో స్వచ్ఛత, సౌలభ్యము; దీక్షితర్ కృతులందు సంగీత సాహిత్యములలో అత్యంత సున్నితమైన మెలకువలు స్థూలముగా గోచరించును. దీక్షితర్ కృతులలోని దీర్ఘసంస్కృత సమాసములు స్వాభావికముగా నుండును. అవి వివిధ రంగములలో, జ్యోతిషము నుండి మంత్రశాస్త్రము వరకు, గద్యపద్యములనుండి సంగీతశాస్త్రము వరకు, హిందుస్తానీ సంగీతము నుండి పాశ్చాత్యసంగీతము వరకు దీక్షితర్ పాండిత్య ప్రతిభను ప్రతిబింబించును.

దీక్షితర్ కృతులకు ప్రత్యేకముగా కొన్ని విశిష్ట లక్షణములు కలవు. వారి కృతులలో ఒక చరణమునకు మించినవి అరుదు. వారి కృతు లనేకము అనుపల్లవి లేనివి. కేవలము పల్లవి, చరణము ఉన్నటువంటి కృతులను సమష్ఠి కృతులందురు. కమలాంబా నవావరణ కృతులలో మంగళకృతి ఇందుకు ఉదాహరణ.

సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో సమష్ఠి చరణ కృతి అనునది కన్పించదు. కాని దీక్షితర్ కృతులలో 147 కృతులు సమష్ఠికృతి తరగతికి చెందినవి.

దీక్షితర్ ఎక్కువగా సంస్కృతభాషలో కృతులను రచించిరి. వారి సముదాయ కృతులు సాటి లేనివి; వాటికవే సాటి. ప్రసిద్ధ సముదాయ కృతులు కొన్ని:

. పంచలింగస్థల కృతులు – పంచభూతములకు (భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము) పంచశివలింగములు ఉన్న స్థలములు, వరుసగా కాంచీపురము, జంబుకేశ్వరము, తిరువన్నామలై, కాళహస్తి, చిదంబరం.

. నవగ్రహ కృతులు. వీటిలో ఏడు మాత్రము దీక్షితర్ రచించినవి. మిగిలిన రెండు విస్తరణలని పండితుల అభిప్రాయము.

. శివుని పత్ని అభయాంబపై తొమ్మిది కృతులు. ఈమె మాయవరం దేవాలయంలోని దేవి.

. షోడశగణపతి కృతులు – షోడశ గణపతులపై. వీటిలో ప్రసిద్ధమైనవి హంసధ్వనిరాగంలోని 'వాతాపిగణపతింభజే', మల్హారి రాగంలోని 'పంచమాతంగముఖగణపతి' మొదలైనవి.

. కమలాంబా నవావరణ కృతులు. ఇవి శ్రీచక్రములోని నవావరణలపై తిరువారూరు దేవాలయంలోని త్యాగరాజస్వామి పత్ని కమలాంబాను సంబోధిస్తూ వ్రాయబడినవి.

. సుబ్రహ్మణ్యస్వామిపై ఎనిమిది విభక్తులలో ఎనిమిది కృతులు. వీటిలో మొదటి కృతి మాలవరాగంలోని 'శ్రీనాథాది గురుగుహ జయతి'. ఈ కృతులు విభక్తి కృతులని పేర్కొనబడుచున్నవి.

. ఇవి కాక పుణ్యక్షేత్రములపై వివిధ పాట సముదాయములు – కాంచీపురం వైదీశ్వరన్ కోవెల, తిరువారూరులో త్యాగరాజస్వామి ఆలయము – రచించబడినవి. మరియు నాగపట్టణము, మధుర, కుల్లిక్కరై, మన్నార్గుడి. తిరువైయారు, తిరుచి, శ్రీరంగం దేవాలయాలపై పాటలు వ్రాయబడెను.

నవావరణ కృతుల తరగతిలో పదకొండు కృతులే కాక, దీక్షితర్ సుమారుగా ఇరువది కృతులను; శ్రీవిద్య, లలితోపాఖ్యానము, దేవిపై సుమారు ఏబది కృతులు; సరస్వతీదేవిపై పది కృతులు; లక్ష్మీదేవిపై ఏడు కృతులు; నీలోత్పలాంబికపై తొమ్మిది కృతులు; అభయాంబికపై తొమ్మిది కృతులను రచించిరి. దీక్షితర్ కృతులు మొత్తము 437 మనకు లభ్యమగుచున్నవి. వీటిలో నాల్గవవంతుకుపైగా ఏదో ఒక రూపములో దేవికి సంబంధించిన కృతులు. ఇవి పైన చెప్పబడిన పుణ్యక్షేత్రములు, దేవాలయములపై దేవికి అంకితమిస్తూ రచించిన కృతులకు అదనము.

కమలాంబా నవావరణ కృతులు

తిరువారూరులోని కమలాంబను సంబోధిస్తూ రచించబడిన కృతులు కమలాంబా నవావరణ కృతులు. ఈ కృతులు శ్రీచక్రము, శ్రీచక్రముయొక్క అధ్యాత్మిక ప్రాముఖ్యము, క్షేత్రగణితపద్ధతి, చక్రములోని ఆవరణలు, వాటిలో నిక్షిప్తము చేయబడిన మంత్రములు, శ్రీచక్రమునకు సంబంధించిన అనేక సున్నితమైన సూక్ష్మ విషయముల గురించి వ్రాయబడెను.

శ్రీచక్రోపాసనకు గురూపదేశము ఆవశ్యకమని ఇంతకు పూర్వము చెప్పబడెను. కాని నవావరణ కృతుల నధ్యయనము చేయుటకు, గానము చేయుటకు గురూపదేశము అవసరము లేదు. కాబట్టి ఇది అందరకు ఒసగబడిన అమూల్యప్రసాదము.

శ్రీచక్రము, అందులోని ఆవరణములపై కృతులను రచించిన వాగ్గేయకారులు కేవలము ఇద్దరు. ఒకరు ముత్తుస్వామి దీక్షితర్, రెండవవారు ఊతుకాడు వేంకట సుబ్బయ్యర్. ఊతుకాడు వేంకట సుబ్బయ్యర్ నర్తన కృష్ణుని భక్తుడు. నర్తన కృష్ణునిపై ఆయన రచించిన కృతులు బహుళ ప్రఖ్యాతి గాంచినవి. ఊతుకాడు వేంకట సుబ్బయ్యర్ (1700–1765) రచించిన నవావరణ కృతులన్నియు సంస్కృతములో ఉన్నవి.

	కృతి	రాగము	ఆవరణము
1	.శ్రీ గణేశ్వర	షణ్ముఖప్రియ	ప్రార్థన గీతం
2	వాంఛసి యది కుశలమ్	కల్యాణి	ధ్యాన శ్లోకము
3	సంతతం అహం సేవే	బిలహరి	ప్రథమ ఆవరణ
4	భజస్వ శ్రీ	నాదనామక్రియ	ద్వితీయ ఆవరణ
5	సర్వ జీవ దయాపరే	శుద్ధసావేరి	తృతీయ ఆవరణ
6	యోగయోగేశ్వరీ	ఆనందభైరవి	చతుర్థ ఆవరణ
7	నీలలోహిత రమణీ	బలహంస	పంచమ ఆవరణ
8	సదానందమయీ	హిందోళం	షష్ఠ ఆవరణ
9	సదానందమయీ (ప్రత్యామ్నాయ కృతి)	హిందోళం	
10	సకలలోక నాయికె	ఆరభి	సప్తమ ఆవరణ
11	శంకరీ శ్రీ	మధ్యమావతి	అష్టమ ఆవరణ
12	నతజన కల్పవల్లి	పున్నాగవరాళి	నవమ ఆవరణ
13	శ్రీచక్రమాతంగి (ప్రత్యామ్నాయ కృతి)	సురటి	
14	హలధరానుజమ్	మణిరంగు	ముగింపు (ఉపసంహారము)

ఈ కృతులలో, ముఖ్యముగా అయిదవ ఆరవ ఆవరణల మధ్య, ఏడవ ఎనిమిదవ ఆవరణల మధ్య కొన్ని అసంబద్ధములు, తప్పుడు వర్ణనలు కలవని కొందరు పండితుల అభిప్రాయము. కృతుల రచయిత శ్రీవిద్యా ఉపాసకుడు కాకపోవుటచేత బహుశః ఈ అసంబద్ధములకు అవకాశ మేర్పడియుండవచ్చును.

ఇందుకు భిన్నముగా ముత్తుస్వామి దీక్షితర్ కృతులలో గొప్ప పాండిత్యము, శ్రీవిద్య ఎడల పరిపూర్ణ నిబద్ధత గోచరించును. ఈ కృతుల నాధారముగా జేసికొని కొందరు విద్వాంసులు, కర్ణాటక సంగీతములో ముత్తుస్వామి దీక్షితర్ ఆదిశంకరులవంటివారని ప్రశంసించిరి. ముత్తుస్వామి దీక్షితర్ తిరువారూరు ఆలయములో త్యాగరాజు నామముతో విలసిల్లు శివభక్తుడు. ఈ దేవునికి ఇద్దరు పత్నులు – కమలాంబ, నీలోత్పలాంబ. నవావరణ కృతులన్నిటిని కమలాంబపై రచించబడుట గమనించదగిన విశేషము. దశమహావిద్యలలో, కమల ఒక విద్యయొక్క నామముగా ఉండుట ఇందుకు కారణము. దీక్షితర్‌వారి నవావరణ కృతులలో ప్రతి ఆవరణయొక్క సాంకేతిక వివరములు, ఆవరణ నామములు, అధిదేవతలు, యోగినులు, బీజాక్షరములు. ముద్రలు, తదితర సూక్ష్మ వివరములు మనకు గోచరించును. మొత్తము పదకొండు కృతులలో మొదటిది ధ్యాన కృతి, చివరిది మంగళ కృతి. మధ్యనున్న తొమ్మిది కృతులు శ్రీచక్రములోని నవావరణములపై వ్రాయబడినవి. కొందరు గాయకులు పైని చెప్పిన పదకొండు కృతులకు ముందు, గణపతిపై 'శ్రీమహాగణపతిరవతుమాం' అను గౌళరాగకృతిని, సుబ్రహ్మణ్యేశ్వరునిపై 'బాలసుబ్రహ్మణ్యం భజేవహమ్' అను సురటిరాగ కృతిని చేర్చుదురు. సాహిత్య నిర్మాణము, సంగీత ఉత్కృష్టత, రాగభావము, రాగతాళముల ఎంపిక, మొదలుగా అన్ని విషయములలో ప్రతి ఒక్క కృతి విశిష్టమైనది, అసామాన్యమైనది.

పైని వివరించినట్లు, పదకొండు కృతులలో మొదటి కృతి ధ్యానకృతి. తరువాతి తొమ్మిది కృతులు శ్రీచక్రములోని నవావరణములలో ఒకొక్క ఆవరణముపై వ్రాసినవి. చివరిది మంగళకృతి. తొమ్మిది కృతులు 'కమలాంబా' లేక 'కమలాంబికా' అను నామవాచకముయొక్క అన్ని విభక్తులలో రచించబడెను. తొమ్మిదవ

కృతి అన్ని విభక్తులను చేర్చి కూర్చబడెను. ప్రతి కృతిలోను దీక్షితర్ జాగ్రత్తగా చక్రనామము, చక్రముయొక్క క్షేత్రగణితము, చక్రమునకు సంబంధించిన ప్రత్యేక లక్షణములను, సంబంధిత దేవతలను పేర్కొనిరి.

'గురుగుహ' అను పదము దీక్షితర్ ముద్రగా అన్ని కృతులలోను (అనేకార్థములతో) కనిపించును. రాగముద్ర శ్లేషతో (ద్వంద్వార్థము) అనేక కృతులలో చెప్పబడెను. తోడిరాగములోని ధ్యానకృతిలో రాగముద్ర కనిపించదు. మొదటి ఆవరణపై ఆనందభైరవి కృతియందు, మూడవ ఆవరణపై శంకరాభరణ కృతియందు, రాగముద్ర సాక్షికముగా ఉన్నది. కాంభోజి, సహన, ఆహిరి కృతులలో రాగముద్ర మూడు రూపములలో ఉన్నది. తదితర కృతులలో సరియైన రాగముద్ర ఉన్నది.

సంస్కృతభాషలో నామవాచకములకు ఏడు విభక్తులు కలవు. అవి: (1) ప్రథమా విభక్తి (2) ద్వితీయా విభక్తి (3) తృతీయా విభక్తి (4) చతుర్థీ విభక్తి (5) పంచమీ విభక్తి (6) షష్ఠీ విభక్తి (7) సప్తమీ విభక్తి. సంబోధన విభక్తి (ప్రథమయే).

కమలాంబా లేక కమలాంబికా అను నామవాచకపదములకు ఎనిమిది విభక్తులు క్రిందివిధముగా నుండును.

1. కమలాంబా/కమలాంబికా
2. కమలాంబాం/కమలాంబికాం
3. కమలాంబయా/కమలాంబికయా
4. కమలాంబాయై/కమలాంబికాయై
5. కమలాంబాయాః/కమలాంబికాయాః
6. కమలాంబాయాః/కమలాంబికాయాః
7. కమలాంబాయామ్/కమలాంబికాయామ్
   (కమలాంబే/కమలాంబికే)

మొదటి ధ్యానకృతి, చివరి మంగళకృతి సంబోధన విభక్తిలో నున్నవి. మధ్యనున్న తొమ్మిది కృతులు నవావరణలపై అన్ని విభక్తులలోను, తొమ్మిదవది అన్ని విభక్తులలోను క్రింది పట్టికలో సూచించినట్లు ఉన్నవి.

ముత్తుస్వామి దీక్షితర్‌వారి నవావరణ కృతులు.

కృతి సంఖ్య	చక్రము	కృతి/చక్ర నామము	మొదటి పంక్తి	విభక్తి	రాగం	తాళం
1		ధ్యానకృతి	కమలాంబికే	సంబోధన	తోడి	రూపక
2	భూపుర	త్రైలోక్యమోహన	కమలాంబా	ప్రథమా	ఆనంద భైరవి	తిస్రజతి
3	షోడశదళ	సర్వాశాపరిపూరక	కమలాంబా	ద్వితీయా	కల్యాణి	ఆది
4	అష్టదళ	సర్వసంక్షోభణ	శ్రీకమలాంబికయా	తృతీయా	శంకరా భరణం	రూపక
5	చతుర్దశార	సర్వసౌభాగ్య దాయక	కమలాంబికాయై	చతుర్థీ	కాంభోజి	అట

6	బహిర్దశార	సర్వార్థసాధక	శ్రీకమలాంబికాయాః	పంచమీ	భైరవి	ఝంప
7	అంతర్దశార	సర్వరక్షాకర	కమలాంబికాయాః తవ	షష్ఠీ	పున్నాగవరాళి	రూపక
8	అష్టకోణ	సర్వరోగహర	శ్రీకమలాంబికాయామ్	సప్తమీ	సహన	త్రిపుట
9	త్రికోణ	సర్వసిద్ధిప్రద	శ్రీకమలాంబికే అవావ	సంబోధన	ఘంటా	ఆది
10	బిందు	సర్వానంద మయ	శ్రీకమలాంబా జయతి	అన్ని విభక్తులు	ఆహిరి	రూపక
11	మంగళమ్		శ్రీకమలాంబికే	సంబోధన	శ్రీ	ఖండఏకమ్

1 కమలాంబికే (ధ్యానకృతి, తోడి. రూపకం), సంబోధనా విభక్తి
2 కమలాంబా సంరక్షతు మామ్ (ఆనందభైరవి, తిస్రజతి త్రిపుట), ప్రథమా విభక్తి
3 కమలాంబాం భజరే (కల్యాణి, ఆది), ద్వితీయా విభక్తి
4 శ్రీ కమలాంబికయా (శంకరాభరణము, రూపకం), తృతీయా విభక్తి
5 కమలాంబికాయై (కాంభోజి, అట), చతుర్థీ విభక్తి
6 శ్రీకమలాంబికాయాః పరమ (భైరవి, ఝంప) పంచమీ విభక్తి
7 కమలాంబికాయాః తవ (పున్నాగవరాళి, రూపకం), షష్ఠీ విభక్తి
8 శ్రీకమలాంబికాయామ్ (సహన, త్రిపుట), సప్తమీ విభక్తి
9 శ్రీకమలాంబికే అవావ (ఘంట, ఆది), సంబోధన విభక్తి
10 శ్రీకమలాంబా జయతి (ఆహిరి, రూపకం), అన్ని విభక్తులు
11 శ్రీకమలాంబికే (మంగళమ్, శ్రీ, ఖండఏకమ్), సంబోధన విభక్తి



ధ్యాన కృతి

మొదటి కృతి ధ్యాన కృతి. ఇది తోడిరాగం, రూపకతాళం, సంబోధనా విభక్తి. ఈ కృతిలో రాగముద్ర లేదు. చివరి నాలుగు చరణములు శబ్దాలంకారములో (ప్రతిశబ్దమునకు మొదట ఒకే అక్షరము ఉండుట) కర్ణములకు ఇంపుగా,'అఘహరణే', 'అరుణే', 'అంతఃకరణే', 'సంపూర్ణే' అని ఉన్నవి. ఈ కృతి తిరువారూరు దేవాలయంలోని త్యాగరాజు పత్నులలో ఒకరైన కమలాంబను వర్ణించుచున్నది. శ్రీచక్రములో కమలాంబ విచిత్రమైన తీరులో ఆసీనురాలై ఉండగా, నీలోత్పలాంబ వ్రేలిని సుబ్రహ్మణ్యస్వామి పట్టుకొనియున్నట్లు కనిపించును. వారు గోచరించుచున్న తీరులో భేదము ఉండగా, దీక్షితర్ శ్రీచక్రమును, అందులోని నవావరణములను వర్ణించుటకు కమలాంబ నెంచుకొని ప్రశంసించుచు గానము చేయుట సముచితముగా నున్నది.

దశమహావిద్యలలో ఒకదాని నామము 'కమల' అనునది గమనార్హము. దేవాలయములోని ఇతర దేవతలు – గణేశ, సుబ్రహ్మణ్య, దక్షిణామూర్తి, రౌద్రదుర్గలు – ఈ ఆలయమునకు శ్రీవిద్యా ఎట్లు తగియున్నదో నిరూపించుచున్నవి. ఐదు ఎకరముల స్థలములో ఈ దేవాలయము, అంతే విస్తీర్ణముగల కమలాలయమను సరోవరము ప్రక్క ఉన్నది. కమలాలయమనగా పద్మములకు నిలయము.

ముత్తుస్వామి దీక్షితర్ ధ్యానకృతిలో కమలాంబయొక్క నిర్గుణ, నిరాకార, సగుణ, సాకార లక్షణములను వివరించిరి. 'కమల' పదము పలుమార్లు ప్రయోగించబడెను. ఆమె నిలయము కమలాలయమని, ఆమె పాదములు పద్మములని (కమలపాదే), బ్రహ్మాది దేవతలచే పూజించబడుచున్నదని (కమలాసనాది పూజిత) తెలుపుటకు కమల పదము పదే పదే ప్రయోగించినట్లు తెలియును. ఆమెను స్తోత్రము చేయుచు, గానము చేయువారికి కవిత్వ సంపదను ప్రసాదించునదిగను, సంగీతరసికురాలిగను, దీక్షితర్ ఆమెను సంబోధించిరి (సంగీతరసికే సుకవిత్వ ప్రదాయికే). తమయొక్క సంగీతము, కవిత్వము ఆమెయొక్క ఆశీఃఫలమను సూచన స్పష్టముగా గోచరించును. ఆమె అన్ని అక్షరములు మూర్తీభవించిన స్వరూపమని కూడ వర్ణించిరి (అకచటతపాది).

ఈ కృతిలో గమనించదగిన మరొక ముఖ్య విషయము ఆమె ఆసీనురాలైయున్న తీరు – వినోదచరణే, అనగా వినోదము నందించుచున్న ఆమె పాదములు. ఏ ఇతర దేవాలయములోను దేవి ఈవిధంగా కూర్చొనియుండుట కానరాదు.

తోడిరాగము కరుణరసమును ప్రతిబింబించును. దీక్షితర్ ఉన్నత షడ్జమముతో (స) పాట నారంభించిరి. ఇది పాటయొక్క ధ్యానపూర్వక స్వభావమునకు అనుగుణముగా నున్నది.

శ్రీ కమలాంబా నవావరణమ్

ముత్తుస్వామి దీక్షితః

కమలాంబికే

నవావరణ ధ్యానకీర్తనమ్

రాగం: తోడి　　　　　　　　　　　　తాళం: రూపకం

పల్లవి

కమలాంబికే ఆశ్రితకల్పలతికే చండికే
కమనీయారుణాంశుకే కరవిధ్రుతశుకే మామవ

అనుపల్లవి

కమలాసనాదిపూజితకమలపదే బహువరదే
కమలాలయతీర్థవైభవే శివే కరుణార్ణవే

చరణమ్

సకలలోకనాయికే సంగితరసికే
సుకవిత్వప్రదాయికే సుందరి గతమాయికే
వికళేబరముక్తిదాననిపుణే అఘహరణే
వియదాదిభూతకిరణే వినోదచరణే అరుణే
సకళే గురుగుహకరణే సదాశివాంతఃకరణే
అకచటతపాదివర్ణే అఖండైకరసవర్ణే

ప్రతిపదార్థము

పల్లవి

కమలాంబికే – ఓ దేవి కమలాంబికా!
ఆశ్రితకల్పలతికే – కల్పకతీగెవలె నిన్నాశ్రయించినవారికి వరములిచ్చుదానా
చండికే – ఉగ్రరూపము కలది (పది శక్తిఅంశములలో ఒకటి)
కమనీయారుణాంశుకే – ఆకరకమైన ఎఱ్ఱని వస్త్రము ధరించినది
కరవిధృతశుకే – హస్తమునందు చిలుకను పట్టుకొనియున్నది
మామ్ – నన్ను
అవ – రక్షించు

అనుపల్లవి

కమలాసనాదిపూజితకమలపదే – బ్రహ్మాది దేవతలు పూజించు పద్మములవంటి పాదములు కలది
బహువరదే – అనేక వరములు వర్షించునది
కమలాలయతీర్థవైభవే – కమలాలయమను సరోవరమునకు వైభవము కల్పించునది
శివే – మంగళకరమైన
కరుణార్ణవే – దయాసముద్రమైన

చరణమ్

సకలలోకనాయికే – ముల్లోకములను పాలించునది
సంగీతరసికే – సంగీతములో ఓలలాడు
సుకవిత్వప్రదాయికే – కవితాప్రతిభ ననుగ్రహించు
సుందరి – అందమైన
గతమాయికే – భ్రమ లేనిది
వికళేబర ముక్తిదాననిపుణే – శరీరములేకుండ ముక్తి ననుగ్రహించుటలో చతుర (విదేహ)
అఘహరణే – సకల పాపములను హరించునది
వియదాదిభూతకిరణే – పంచభూతములను (భూమి, వాయువు, అగ్ని, జలము, ఆకాశము) ప్రకాశింపజేయు
వినోదచరణే – మనోహరమైన పాదములుగల
అరుణే – ఎర్రనిది
సకలే – సమస్తమైనది
గురుగుహకరణే – గురుగుహుని తల్లి
సదాశివాంతఃకరణే – శివుని హృదయమైనది
అకచటతపాది వర్ణే – అన్ని వర్ణములు (అ నుండి క్ష వరకు) గలది
అఖండైకరసపూర్ణే – పరమానందముతో నిండియున్నది

తాత్పర్యము

పల్లవి:

ఓ దేవి కమలాంబికా! చండికా! ఉగ్రరూపము కలదానా! నన్ను రక్షింపుము. నీవు ఆకర్షకమైన ఎరుపు వస్త్రము ధరించి, చేతిలో చిలుకను పట్టుకొనియున్నావు. నీవు కల్పకతీగెవలె, నిన్ను ఆశ్రయించిన వారికి వరములను ప్రసాదించెదవు.

అనుపల్లవి:

ఓ మంగళప్రదమైన దేవీ! నీవు దయాసముద్రురాలవు. నీ పాదపద్మములను బ్రహ్మాదిదేవతలు పూజింతురు. కమలాలయ సరోవరవైభవము నీవే. అనేక వరములు వర్షించెదవు.

చరణము

ఓ సౌందర్యవతీ! ముల్లోకములను పాలించుదానవు. సంగీతప్రియురాలవు. కవితాప్రతిభను ప్రసాదింతువు. భ్రమ లేనిదానవు. శరీరము నశించిన తరువాత ముక్తి ననుగ్రహించు నిపుణురాలవు. పంచభూతములను ప్రకాశింపజేయుదువు. సమస్త వర్ణములు (అ క చ ట త ప..) నీ స్వరూపములు. ఓ దేవీ గురుగుహా! నీవు శివుని హృదయములో వసించుచు, పరిపూర్ణమైన ఆనందముతో నుందువు.

ప్రథమ ఆవరణ – భూపుర – త్రైలోక్యమోహన చక్రము

ఈ ఆవరణము భూపురమను చతురస్రము. భూమియందు సృష్టి యెట్లున్నదో, అటులనే చక్రమంతయు దీనిలో ఉన్నది. ఇది సరళరేఖలతోనున్న మూడు చతురస్రములుగా విభజించబడెను. ముల్లోకములను మోహింపజేయు ఆవరణము. అందుచే త్రైలోక్యమోహనచక్రము. భూపుర చక్రమునకు అధిదేవత త్రిపుర. సేవికలు ప్రకటస్వరూపులైన యోగినులు. ఈ చక్రమందు మూడు చతురస్రములు ఒకదానిలోనొకటి యుండును. అనేక శ్రీచక్రములలో చతురస్రమునకు నాలుగువైపుల ద్వారములు ఉండును.

మూడు సరళరేఖలతో కూడిన చతురస్రములు, బయటినుండి లోపలకు వరుసగా శ్వేతవర్ణము, రక్తవర్ణము, పసుపు వర్ణములతో నుండును. శ్వేతవర్ణములోని మొదటి చతురస్రమునకు పది సిద్ధిదేవిమాతలు ఆధిపత్యము వహించుచున్నారు. రక్తవర్ణములోని రెండవ చతురస్రమునకు ఎనమండుగురు మాతృకలు ఆధిపత్యము వహించుచున్నారు. పసుపువర్ణములోని మూడవ చతురస్రమునకు పది స్త్రీదేవతామూర్తులు ముద్రాశక్తితో దిక్పాలకులను నిర్దేశించుచున్నారు.

ఈ కృతి ఆనందభైరవి రాగములో ఉన్నది. కృతినామము దేవిని సూచించును. తిస్రజాతి త్రిపుటతాళములో కూర్చబడిన ఈ కృతి ప్రథమా విభక్తిలో ఉన్నది. మరియు రాగముద్ర పాక్షికముగా గోచరించును. దేవి ఆనంద, భైరవి యగుటచే ఆనందభైరవి రాగము సముచితంగా నున్నది.ఆవరణ లక్షణములన్నియు కృతిలో నిక్షిప్తము చేయబడెను. చరణమందు వివిధ విశేషణములతో దేవి వర్ణించబడెను.

త్రిపురాది చక్రేశ్వరీ
అణిమాది సిద్ధేశ్వరీ
క్షితిపుర త్రైలోక్యమోహనచక్రవర్తినీ
ప్రకట యోగినీ

కమలాంబా సంరక్షతు మామ్

ప్రథమావరణ కీర్తనమ్

రాగం: ఆనందభైరవి   తాళం: తిశ్ర త్రిపుట

పల్లవి

కమలాంబా సంరక్షతు మామ్
హృత్కమలానగరనివాసినీ – అంబ *

అనుపల్లవి

సుమనసారాధితాబ్జముఖీ సుందరమనః ప్రియకరసఖీ
కమలాంబానందబోధసుఖీ కాంతాతారపంజరశుకీ

చరణమ్

త్రిపురాది చక్రేశ్వరీ అణిమాది సిద్ధేశ్వరీ
నిత్యకామేశ్వరీ క్షితిపురత్రైలోక్యమోహనచక్రవర్తినీ
ప్రకటయోగినీ సురరిపుమహిషాసురాదిమర్దినీ
నిగమపురాణాదిసంవేదినీ
త్రిపురేశీ గురుగుహజననీ త్రిపురభంజనరంజనీ
మధురిపుసహోదరీ తలోదరీ త్రిపురసుందరీ మహేశ్వరీ
(*అంబ' పదము సుబ్బరామ దీక్షిత్‌గారి సంగితసంప్రదాయ ప్రదర్శినిలో లేదు)

ప్రతిపదార్థము

పల్లవి

కమలాంబా – దేవి కమలాంబా
సంరక్షతు – రక్షించు గాక !
మామ్ – నన్ను
హృత్కమలానగరనివాసినీ – హృదయపద్మమను నగరములో నివసించునది
అంబ – ఓ దేవీ

అనుపల్లవి

సుమనసారాధితా – నిర్మలమనస్కులైన భక్తులచే పూజించబడునది (దేవతలచే సేవించబడునది)
అబ్జముఖీ – పద్మమువంటి ముఖము కలది
సుందరమనః ప్రియకర సఖీ – సుందరేశ్వర, అనగా శివుని స్నేహితురాలిగా మోదము కూర్చునది
కమలజానంద బోధ సుఖీ – బ్రహ్మజ్ఞానానందము పొందునది
కాంతాతార పంజర శుకీ – శబ్దమను (ఓం) పంజరములో నివసించు అందమైన చిలుక

చరణమ్

త్రిపురాది చక్రేశ్వరీ – త్రిపురతో ప్రారంభమగు తొమ్మిది చక్రములను పాలించు దేవి
అణిమాది సిద్ధీశ్వరీ – అణిమాది మానవాతీత శక్తులను పాలించు దేవి
నిత్యకామేశ్వరీ – ఎల్లప్పుడు కోరికలను సిద్ధింపజేయునది
క్షితిపుర త్రైలోక్యమోహన చక్రవర్తినీ – యావత్తు భూమియందు సహజముగా ఉంటూ ముల్లోకములను మోహింపజేయునది
ప్రకట యోగినీ – యోగినీ వ్యక్తరూపము
సురరిపు మహిషాసురాదిమర్దినీ – దున్నపోతు ముఖము (పశుప్రవృత్తి) గల మహిషాసురుని వంటి దేవతల శత్రువును వధించినది
నిగమ పురాణా సంవేదినీ – పురాణేతిహాసములు, పవిత్ర వేదముల నెరిగినది
త్రిపురేశి – మూడునగరములకు దేవి
గురుగుహ జననీ – గురుగుహుని (సుబ్రహ్మణ్యుని) మాత
త్రిపురభంజన రంజనీ – మూడునగరములను ధ్వంసముచేసిన శివుని రంజింపచేయునది
మధురిపు సహోదరీ – మధు శత్రువగు విష్ణుమూర్తి సోదరి

తలోదరీ – సన్నని ఉదరము కలది
త్రిపురసుందరీ – త్రిపురసుందరీ దేవి
మహేశ్వరీ – గొప్ప దేవి

తాత్పర్యము

పల్లవి

మానవుని హృదయపద్మమందు నివసించు కమలాంబాదేవి నన్ను రక్షించుగాక!

అనుపల్లవి

సుందరేశ్వరుని మనస్సును రంజింపజేయు పద్మమువంటి ముఖముగల దేవి నిర్మల మనస్కులైన భక్తులచే, దేవతలచే కూడ పూజించబడుచున్నది. ఆమె ప్రణవనాదమైన ఓంకారమను పంజరములో అందమైన చిలుకవలె నివసించుచు, బ్రహ్మానందము అనుభవించుచున్నది.

చరణము

గొప్పదేవియైన త్రిపురసుందరి పవిత్ర గ్రంథములైన వేదపురాణేతిహాసముల నెరిగినది, త్రిపురాది తొమ్మిది చక్రములను పాలించునది, అణిమాది మానవాతీత శక్తులను నిగ్రహించునది. నిత్యకామేశ్వరిగా భక్తుల కోర్కెలను సిద్ధింపజేయును. ఈమె యోగినీ వ్యక్తరూపము, యావత్తు భూమియందు త్రైలోక్యమోహినీ చక్రమందు ఉన్నది. మూడు నగరములకు దేవిగా మహిషాసురునివంటి రాక్షసులను సంహరించినది. విష్ణుమూర్తి సోదరియైన దేవి శివుని రంజింపజేయును.

ద్వితీయ ఆవరణ – షోడశదళ – సర్వాశాపరిపూరక చక్రము

సర్వాశా పరిపూరకచక్రమను ద్వితీయావరణము సాధకుని కోర్కెలన్నిటిని నెరవేర్చును. ఈ చక్రమునకు అధిదేవత త్రిపురేశి. సేవికలు గుప్తయోగినులు. ఇది శ్వేతవర్ణములో షోడశదళపద్మమును సూచించును.

షోడశదళములు చంద్రుని షోడశ కళలకు ప్రతీకలు. సాధారణ కళలు పదిహేను, సచ్చిదానంద దేవతా స్వరూపము. పదహారు దళముల ద్వారా పదహారు ఆకర్షక శక్తులు, తూర్పునుండి అప్రదక్షిణముగా, సూచించబడుచున్నవి.

షోడశదళములు సూచించునవి:

1 వాంఛ లేక కోరిక	9 మనస్సు
2 బుద్ధి	10 ధైర్యము
3 అహంకారము	11 స్మృతి
4 శబ్దము	12 నామము
5 స్పర్శ	13 బీజము
6 రూపము	14 ఆత్మ
7 రుచి	15 అమృతత్వము
8 వాసన	16 దేహము

షోడశదళములు సూచించు షోడశ శక్తులను రెండు తరగతులుగా విభజించు సిద్ధాంతమొకటి కలదు. అవి: నిత్య, కాల. షోడశ దళములు 'అ' నుండి 'అః' వరకు గల అచ్చులను సూచించును.

ఈ కృతి కల్యాణి రాగము ఆది తాళములో ఉన్నది. ఇది ద్వితీయ ఆవరణ, షోడశదళపద్మములతో ద్వితీయా విభక్తిలో ఉన్నది. రాగముద్రలో 'నిత్యకల్యాణి' అను వాక్యమును దీక్షితర్ ప్రయోగించెను. దేవి నిత్య, కల్యాణి కూడ. ఈ కృతిలోని స్వరములు రెండువైపుల గానము చేయబడును. దీని వలన పాటకు ఎటువంటి ఇబ్బంది లేకపోగా, అందము టేకూరినది.

ఏ మానవునికైన మొదటి కోరిక ఎన్నడు దుఃఖము లేకుండుట. అందుచే ఆమె దుఃఖధ్వంసిని యని వర్ణింపబడుచున్నది. మరియు అందుకొనే పరమసుఖము మోక్షము లేక ముక్తి. అందుచేత ఆమె నిర్వాణనిజసుఖప్రదాయిని. ద్వితీయ ఆవరణకు సంబంధించిన సాంకేతిక వివరము లన్నిటిని దీక్షితర్ ఈ కృతిలో పొందుపరచిరి. లలితా సహస్రనామములోని సచామర రమావాణీసవ్యదక్షిణ సేవితా (614) అను నామమును 'కమలావాణీసేవితపార్శ్వామ్' సూచించుచున్నది.

పంద్రెండుగురు గొప్ప శ్రీవిద్యా ఉపాసకులలో దూర్వాసుడు ఒకడు. ఆయన పంచదశీ మంత్రద్రష్ట.

దీక్షితర్ ఈ క్రింది విశేషణములతో ఆవరణ లక్షణములను వివరించిరి.

సర్వాశాపరిపూరకచక్రస్వామినీమ్ (ఆవరణ నామము)
గుప్తయోగినీమ్ (సేవికల స్వభావము)

కామాకర్షిణ్యాది రంజనీమ్ (16 దళములు 16 ఆకర్షక శక్తులకు సూచకము)
ఉర్వీతత్త్వాది స్వరూపిణీమ్ (ఆవరణ స్వభావము)

కమలాంబాం భజరే

ద్వితీయావరణ కీర్తనమ్

రాగం: కల్యాణి తాళం: ఆది

పల్లవి

కమలాంబాం భజరే రే మానస
కల్పితమాయాకార్యం త్యజ రే

అనుపల్లవి

కమలావాణీసేవిత పార్శ్వామ్
కంబుజయగ్రీవాం నతదేవామ్
కమలాపురసదనాం మృదువదనామ్
కమనీయరదనాం కమలవదనామ్

చరణమ్

సర్వాశాపరిపూరకచక్రస్వామినీం
దుర్వాసార్చిత గుప్తయోగినీం దుఃఖధ్వంసినీం హంసినీమ్
నిర్వాణనిజసుఖప్రదాయినీం నిత్యకల్యాణీం కాత్యాయనీమ్
శర్వాణీం మధుప విజయవేణీమ్
సద్గురుగుహ జననీం నిరంజనీమ్
గర్వితభండాసుర భంజనీం కామాకర్షిణ్యాదిరంజనీమ్ *
నిర్విశేషచైతన్యరూపిణీం ఉర్వీతత్త్వాది స్వరూపిణీమ్
(* 'కామాకర్షణ్యాదిరంజనీం' సుబ్బరామదీక్షిత్ గారి సంగీతసంప్రదాయ ప్రదర్శినీ ప్రకారము)

ప్రతిపదార్థము

పల్లవి

కమలాంబామ్ – కమలాంబా దేవిని
భజ – పూజించెదను
రే రే – ఓ మనసా!
కల్పితమాయాకార్యామ్ – తన మాయచే కల్పించబడిన జగత్తు గలది
త్యజ రే – త్యజించుము

అనుపల్లవి

కమలావాణీసేవిత పార్శ్వామ్ – లక్ష్మీ సరస్వతులచే ఇరువైపుల సేవించబడునది
కంబుజయగ్రీవామ్ – శంఖ సౌందర్యముగల మెడ గలది
నతదేవామ్ – వంగిన దేవతలు గలది
కమలాపురసదనామ్ – పద్మనగరిలో నివసించునది
మృదువదనామ్ – సరళమైన ముఖము గలది
కమనీయ రదనామ్ – ఆకరకమైన పలువరుస గలది
కమలవదనామ్ – పద్మమువంటి వదనము గలది

చరణమ్

సర్వాశాపరిపూరకచక్రస్వామినీమ్ – సర్వాశాపరిపూరకమను నామముగల చక్రమునకు దేవి
(అన్ని కోర్కెలు నెరవేర్చునది – పదహారు దేవతలు)
పరమశివకామినీమ్ – పరమశివుని ప్రియపత్ని
దుర్వాసార్చిత గుప్తయోగినీమ్ – యోగినీ రహస్యమును పూజించు దూర్వాసముని గలది
దుఃఖధ్వంసినీమ్ – సకల దుఃఖములను నాశనము చేయునది
హంసినీమ్ – హంసవాహనము గలది
నిర్వాణనిజసుఖ ప్రదాయినీమ్ – ఆత్మానందము కలిగించునది
నిత్యకల్యాణీమ్ – నిత్యము మంగళప్రదమైనది
కాత్యాయనీమ్ – కాత్యాయన ఋషి పుత్రిక
శర్వాణీమ్ – శర్వుని (శివుని) పత్నియైన
మధుపవిజయవేణీమ్ – తేనెటీగల నలుపు వర్ణమును జయించు కురులు గలది
సద్గురుగుహ జననీమ్ – గురుగుహుని తల్లి
నిరంజనీమ్ – కల్మషరహిత, బంధరహితమైనది
గర్విత భండాసుర భంజనీమ్ – గర్వించిన భండాసురుని నాశనము గావించినది
కామాకర్షిణ్యాది రంజనీమ్ – కామాకర్షిణీ మున్నగు దేవతలకు ముదము కూర్చునది
నిర్విశేషచైతన్య రూపిణీమ్ – నిర్గుణ చైతన్యస్వరూపము
ఉర్వీతత్త్వాది స్వరూపిణీమ్ – పంచభూతముల రూపము గలది

తాత్పర్యము

పల్లవి

ఓ మనసా! కమలాంబాదేవిని పూజించు. భ్రాంతి వలన కలుగు ప్రాపంచిక సుఖములపై ఆసక్తి వీడుము.

అనుపల్లవి

లక్ష్మీ సరస్వతులచే ఇరువైపుల పూజించబడునది. ఆమె మెడ సౌందర్యము శంఖపు సౌందర్యమును మించినది. మరియు సరళభాషిణి, అందమైన పలువరుస గలది.

చరణమ్

రహస్య యోగినులు సేవికలు.దుర్వాసమహర్షిచే పూజించబడినది. సర్వాశాపరిపూరక చక్రమునకు అధిదేవత. పరమశివుని పత్ని, హంస వాహనముగా గలది. సర్వ క్లేశములను నాశనము చేసి ముక్తిని

ప్రసాదించును. నిత్యమంగళ స్వరూపిణి. కాత్యాయన మహర్షి పుత్రిక. శర్వుని (శివుని) ప్రియపత్ని, గురుగుహుని తల్లి. భండాసురుని సంహరించి, కామాకర్షిణీ మున్నగు దేవతలకు ముదము కూర్చినది. కల్మషరహిత, నిర్గుణ చైతన్యసమవరూపము. పంచభూతములందు వ్యక్తమైనది.

తృతీయ ఆవరణ – సర్వసంక్షోభణ చక్రము

సర్వసంక్షోభణ చక్రమను మూడవ ఆవరణ అందరకు అలజడి కలిగించును. అష్టదళపద్మము ఆకారముగల ఈ చక్రమునకు అధిదేవత త్రిపురసుందరి. సేవికలు గుప్తయోగినులు. చక్రముయొక్క వర్ణము జపాకుసుమము. అనగా మిక్కిలి ఎరుపుగల మంకెనపువ్వు.

అష్టదళములు ఎనిమిది మానసిక శక్తులను సూచించును. ఈ శక్తులు పూర్తిగా భౌతికమైన శక్తులు కావు. అష్టదళములు 'క' నుండి ఆరంభమగు హల్లులను సూచించును. చక్రము పూజ ప్రదక్షిణముగా చేయబడును.

ఈ కృతి శంకరాభరణ రాగం, రూపక తాళములో ఉన్నది. దేవి శంకరుని ఆభరణముగా నుండుటచే ఇది విశ్వవ్యాప్తమైన శంకరాభరణ రాగము. స్వరముల మధ్య విరామము ఒకే రీతిగానుండు ఈ రాగము పాశ్చాత్యసంగీతములో ప్రసిద్ధము. ఈ రాగమును నారదులవారి సంగీతమకరందము మొదట పేర్కొనినది. శృంగారదేవుడు సంగీతరత్నాకరములో ఈ రాగము పూర్వప్రసిద్ధ రాగమని చెప్పెను. ఈ రాగము గురించి విద్యారణ్య, రామామాత్య, వేంకటమఖి, తదితరులు తమ గ్రంథములలో ప్రస్తావించిరి.

తృతీయా విభక్తిలోనున్న ఈ కృతి చరణములో రాగముద్ర పాక్షికముగా కనిపించును. 'అనంత–కోట్యండ–నాయక–శంకర–నాయికయా'.

ఆవరణను వర్ణించు విశేషణములే కాక, ఉన్నత అధ్యాత్మిక విశేషణములు ఈ కృతిలో ఉన్నవి. ఈ ఆవరణ ఎనిమిది మానసిక శక్తులను సూచించును – 'అనంగ కుసుమాద్యష్టశక్త్యాకారయా'. ఆవరణ అరుణ వర్ణములో ఉన్నది – 'అరుణ–వర్ణ–సంక్షోభణ–చక్రాకారయా'. సేవికలు గుప్తయోగినులు – 'అష్టవర్గాత్మకగుప్తతరయా వరయా'. అష్టదళములు ఆవరణ భౌతికరూపము – 'అష్టదళాబ్జ–స్థితయా'

శ్రీకమలాంబికయా

తృతీయ ఆవరణ కీర్తనమ్

రాగం: శంకరాభరణం తాళం: రూపకమ్

పల్లవి

శ్రీకమలాంబికయా కటాక్షితోఽహం
సచ్చిదానంద పరిపూర్ణ బ్రహ్మోఽస్మి

అనుపల్లవి

పాకశాసనాది సకలదేవతా సేవితయా
పంకజాసనాది పంచకృత్యకృద్భావితయా
శోకహర చతురపదయా మూకముఖ్య వాక్ప్రదయా
కోకనదవిజయపదయా గురుగుహ తత్త్రైపదయా

చరణమ్

అనంగకుసుమాద్యష్ట శక్త్యాకారయా
అరుణవర్ణ సంక్షోభణ చక్రాఽకారయా *
అనంత కోట్యండనాయక శంకరనాయికయా
అష్టవర్గాత్మక గుప్తతరయా వరయా
అనంగాద్యుపాసితయా అష్టదళాబ్జస్థితయా
ధనుర్బాణధరకరయా దయాసుధాసాగరయా
(*'చక్రాఽగారయా' సుబ్బరాయ దీక్షిత్ సంగీత సంప్రదాయ ప్రదర్శిని ప్రకారము)

ప్రతిపదార్థము

పల్లవి

శ్రీ కమలాంబికయా – మంగళప్రదమైన కమలాంబికచే
కటాక్షితః – అనుగ్రహించబడితిని
అహమ్ – నేను
సచ్చిదానంద పరిపూర్ణ బ్రహ్మ – సత్ + చిత్ + ఆనంద రూపమైన
అస్మి – నేను అయిఉన్నాను

అనుపల్లవి

పాకశాసనాది సకల దేవితా సేవితయా – ఇంద్రాది దేవతలచే పూజించబడునది
పంకజాసనాది పంచకృత్య కృద్భావితయా – ఐదు విశ్వకార్యముల నాచరించు బ్రహ్మాది దేవతలచే ✓
స్మరించబడునది
శోకహరచతురపదయా – పాదములచే దుఃఖము బాపుటలో నేర్పరి
మూకముఖ్యవాక్ప్రదయా – మూగవారికి సైతము వాక్కు ప్రసాదించునది

కోకనదవిజయసదయా – ఎర్రకలువ సౌందర్యమును జయించు పాదములు గలది
గురుగుహ తత్రైపదయా – మూడు పదముల వాక్యము గురుగుహుడే

చరణమ్

అనంగకుసుమాద్యష్ట శక్త్యాకారయా – అనంగకుసుమ, ఇతర శక్తుల రూపములు గలది
అరుణవర్ణ సంక్షోభణ చక్రాఽకారయా – రక్తవర్ణపు సంక్షోభణ చక్రములో ప్రతిష్ఠించబడినది
అనంతకోట్యండనాయక శంకరనాయికయా – అనంత విశ్వములకు ప్రభువైన శివుని పత్ని
అష్టవర్గాత్మక గుప్తతరయా – గుప్తయోగినులచే సేవించబడునది, ఎనిమిది వర్గములుగా రూపొందించబడిన వర్ణమాలా రూపము
వరయా – అత్యంత శ్రేష్ఠమైనది
అనంగాద్యుపాసితయా – మన్మథాదులచే పూజించబడునది
అష్టదళాఽబ్జస్థితయా – అష్టదళపద్మములో నివసించునది
ధనుర్బాణధరకరయా – ధనుర్బాణములను ధరించునది
దయాసుధాసాగరయా – కరుణామృత సాగరము

తాత్పర్యము

పల్లవి

నేను పరబ్రహ్మమును, నిత్య చైతన్యానందముతో మంగళప్రదమైన కమలాంబికచే అనుగ్రహించ బడినవాడను.

అనుపల్లవి

ఇంద్రాది దేవతలచే పూజించబడుచు, బ్రహ్మాది దేవతలచే స్మరించబడుచున్నది. ఆమె పాదములు ఎర్రకలువల సౌందర్యమును జయించును. దుఃఖము తొలగించుటలో నేర్పరి. ఆమె మూడు పదముల వాక్యము, గురుగుహునిగా చెప్పబడుచున్నది. మూగవారికి సైతము వాక్కు ప్రసాదించగలిగినది.

చరణము

అనంగకుసుమ, తదితర శక్తులుగా రూపొందినది. సంక్షోభణ చక్రములో ప్రతిష్ఠించబడినది. ధనుర్బాణములను ధరించి అష్టదళపద్మములో వసించును. గుప్తయోగినులచే సేవింపబడుచున్నది. అష్టవర్గములుగా విభజించబడిన వర్ణమాలా స్వరూపము. మన్మథాదులచే కొనియాడబడుచున్నది. మూర్తీభవించిన కరుణామృత సముద్రము.

చతుర్థ ఆవరణ – సర్వసౌభాగ్యదాయక చక్రము

నాలుగవ ఆవరణ సర్వసౌభాగ్యదాయక చక్రము సమస్త లోకమునకు సంపదలు ప్రసాదించి మంగళము చేకూర్చును. చక్ర అధిదేవత త్రిపురవాసిని. సేవికలు సంప్రదాయ యోగినులు. వర్ణము దాడిమపుష్పవర్ణము. పదునాలుగు త్రిభుజములతో ఈ ఆవరణ చతుర్దశార లేక మన్వస్రమని (పదునాల్గురు మనువులకు సూచకముగా) పిలువబడుచున్నది. పదునాలుగు త్రిభుజములు ఏడు ఊర్ధ్వ లోకములను, ఏడు అధో లోకములకు ప్రతీకలు. అవి శరీరములోని పదునాలుగు నాడులను కూడ సూచించును. పదునాలుగు త్రిభుజములు మొదటి పదునాలుగు హల్లులను సూచించును. ఈ చక్రపు పూజ అప్రదక్షిణముగా చేయబడును.

ఈ ఆవరణ కృతి కాంభోజి రాగము అట తాళములో చతుర్థీ విభక్తిలో కూర్చబడినది – కమలాంబికాయై.

రాగముద్ర మారు రూపములో చరణమందున్నది 'సకలసౌభాగ్యదాయ కాంభోజ చరణాయై'.

కాంభోజి రాగము ప్రాచీనమైనది. రామాఉమాత్య, వేంకటమఖి నిషాదములో విభేదింతురు. రామా ఉమాత్య కాకలి నిషాదము నంగీకరించగా, వేంకటమఖి కైశికి నిషాదము నామోదింతురు. రెండు నిషాదములు సాధ్యమేనని కొందరి అభిప్రాయము. అట తాళములో పదునాలుగు క్రియలు కలవు. అవి ఈ ఆవరణలోని పదునాలుగు త్రిభుజములను సూచించును.

చాలవరకు రాగమాలికలలో శంకరాభరణము తరువాత కాంభోజి రాగము వచ్చుట అంగీకరించిన ఆచారము. దీక్షితర్ ఈ కృతి సముదాయంలో కనీసం రెండు పర్యాయములు దీనిని పాటించిరి.

నవావరణ కృతులన్నిటిలో 'కమల' పదమును దీక్షితర్ పలుమార్లు ప్రయోగించిరి. కాబట్టి సహజముగా కృతులన్నియు ఆమెపై ఉన్నవి. ఆమె శ్రీచక్రమునకు భిన్నము కాదు. శ్రీవిద్యా ఉపాసకులైన దీక్షితర్ శ్రీవిద్యా రహస్యములను సూక్ష్మముగా, సూచనప్రాయంగా లేక పరోక్షముగా తెలియజేసిరి. ఈ కృతిలో ఏకస్వర మంత్రము – భువనేశ్వరీదేవి ఏకాక్షర మంత్రమును తెలియజేసిరి. ఈ చక్రము పదునాలుగు భువనములను సూచించుట ఇందుకు కారణము. పదునాలుగు భువనములకు అధిదేవత భువనేశ్వరీదేవి, ఆమె యొక్క ఏకాక్షరీ మంత్రము 'హ్రీం'. ఈ కృతియందు మరొక రెండు ముఖ్య విశేషణములు – అపర్ణ, సుపర్ణ – కలవు. శివుడు తనను వివాహమాడుటకు, పార్వతి శివుని గురించి తపస్సు చేసెను. క్రమక్రమంగా ఆహారము, ఘనపదార్థము గాని ద్రవపదార్థము గాని తీసికొనుట మానివేసెను. ఒక దశలో ఆమె ఆకులను కూడ భుజించకుండెను. సంస్కృతభాషలో ఆకును 'పర్ణ' అందురు. అందుచే ఆమె 'అపర్ణ', అనగా ఆకులను కూడ భుజించనిది. ఆమెకు 'సుపర్ణ' అను నామము కూడ కలదు. సుపర్ణ అనగా మంచి రెక్కలు గలది. పరోక్షముగా ఇది హంసను సూచించును. అద్వైతములో పరమసత్యమునకు హంస ప్రతీక.

ఈ ఆవరణకు సంబంధించి ప్రత్యక్షముగా కృతిలో చెప్పబడిన విశేషణములు:

సకలసౌభాగ్యదాయకాంభోజచరణాయై – చక్రనామము

సంక్షోభణ్యాదిశక్తియుత చతుర్థాఉవరణాయై – పదునాలుగు వివిధ శక్తులుకల చతుర్థ ఆవరణము.

ప్రకట చతుర్దశభువనభరణాయ్యై – పదునాలుగు లోకములను సూచించి ఆవరణము
శోభనకరమనుకోణాయ్యై – పదునాలుగు కోణములు కలది

కమలాంబికాయ్యై

చతుర్థాఽవరణ కీర్తనమ్

రాగం: కాంభోజి తాళం: అట

పల్లవి

కమలాంబికాయ్యై కనకాంశుకాయ్యై
కర్పూరవీటికాయ్యై నమస్తే నమస్తే

అనుపల్లవి

కమలాకాంతానుజాయ్యై కామేశ్వర్యై అజాయ్యై
హిమగిరి తనుజాయ్యై హ్రీంకార పూజ్యాయ్యై
కమలానగరవిహారిణ్యై ఖలసమూహ సంహారిణ్యై
కమనీయరత్నహారిణ్యై కలికల్మష పరిహారిణ్యై

చరణమ్

సకలసౌభాగ్యదాయకాంభోజచరణాయ్యై
సంక్షోభిణ్యాదిశక్తియుత చతుర్థావరణాయ్యై
ప్రకట చతుర్దశభువనభరణాయ్యై
ప్రబల గురుగుహ సంప్రదాయాంతఃకారణాయ్యై
అకళంక రూపవర్ణాయ్యై అపర్ణాయ్యై సుపర్ణాయ్యై
సుకరధ్రుతచాపబాణాయ్యై శోభనకరమనుకోణాయ్యై
సకుంకుమాదిలేపనాయ్యై చరాచరాదికల్పనాయ్యై
చికురవిజితనీలఘనాయ్యై చిదానందపూర్ణఘనాయ్యై

ప్రతిపదార్థము

పల్లవి

కమలాంబికాయ్యై – కమలాంబికకు
కనకాంశుకాయ్యై – బంగారు వస్త్రము ధరించిన
కర్పూర విటికాయ్యై – కర్పూర తాంబూలము సేవించిన
నమస్తే నమస్తే – పదే పదే నమస్కరించుచున్నాను.

అనుపల్లవి

కమలకాంతానుజాయ్యై – లక్ష్మీవల్లభుని సోదరి
కామేశ్వర్యై – కామేశ్వరీదేవి

అజాయై – జన్మించనిది
హిమగిరి తనుజాయై – హిమవంతుని పుత్రిక
హ్రీంకార పూజ్యాయై – హ్రీం అను దివ్యశబ్దముచే పూజించబడునది
కమలానగర విహారిణ్యై – కమలానగరిలో నివసించునది
ఖలసమూహ సంహారిణ్యై – దుష్టసమూహమును సంహరించునది
కమనీయ రత్నహారిణ్యై – అందమైన రత్నహారమును ధరించునది
కలికల్మష పరిహారిణ్యై – కలిదోషములను నిర్మూలించునది

చరణమ్

సకలసౌభాగ్యదాయకాంభోజచరణాయై – అన్ని మంగళములను ప్రసాదించు పాదపద్మములు గలది
సంక్షోభిణ్యాది శక్తియుత చతుర్థాఽవరణాయై – 'సంక్షోభిణి' తదితర శక్తులు ఉన్న చతుర్థ ఆవరణములో నివసించునది
ప్రకట చతుర్దశ భువనభరణాయై – పదునాలుగు లోకములను పోషించునది
ప్రబలగురుగుహ సంప్రదాయాంతః కరణాయై – గురుగుహునకు చెందు ప్రసిద్ధ సంప్రదాయ మునకు కేంద్రము
అకళంకరూపవర్ణాయై – కల్మషరహితమైన ఆకారము, వర్ణము కలది
అపర్ణాయై – అపర్ణగా తెలియునది
సుపర్ణాయై – పౌరాణిక హంస
సుకరధృతచాపబాణాయై – ధనుర్బాణములను చేత ధరించినది
శోభనకరమనుకోణాయై – పదునాలుగు కోణములతో శోభించు చక్రమునందు నివసించునది
సకుంకుమాది లేపనాయై – ఎర్రని కుంకుమ పూసుకొనియున్నది
చరాఽచరాది కల్పనాయై – చరాచర వస్తువులకు కారణభూతురాలు
చికురవిజితనీల ఘనాయై – నల్లని మేఘములను మించిన నల్లని కురులు గలది
చిదానందపూర్ణఘనాయై – చైతన్యానందముల సంపూర్ణ సారము

తాత్పర్యము

పల్లవి

పద్మమువంటి ముఖముగల , బంగారు వస్త్రము ధరించిన, కర్పూరతాంబూలము సేవించు, కమలాంబాదేవికి నేను నమస్కరించుచున్నాను.

అనుపల్లవి

నీవు విష్ణుమూర్తి సోదరి, కామేశ్వరివి, హిమవంతుని పుత్రికవు. కమలానగరిలో నివసించుదువు. అందమైన రత్నాలహారమును ధరించు నీవు పూజించబడుచున్నావు. దుష్టులను సంహరించి, కలియుగ పాపములను నిర్మూలించుదానవు.

చరణము

నీ పాదపద్మములు సకల మంగళములను చేకూర్చును. సంక్షోభిణివంటి శక్తులు ఉండు చతుర్థ ఆవరణములో నీవు నివసించుచు, పదునాలుగు భువనములను పోషించుచుందువు. ఎటువంటి లోపము లేని ఆకారము, వర్ణముగల నీవు అపర్ణగా తెలియబడుచున్నావు. నీవు ధనుర్బాణములు చేతబట్టి, పదునాలుగు కోణములతో ప్రకాశించు చక్రములో నివసించుదానవు.

ఎర్రని కుంకుమ ధరించినదానవు. చరాఽచర వస్తువులకు కారణభూతురాలవు. నీవు చైతన్యానందముల సంపూర్ణ సారము.

పంచమ ఆవరణము – బహిర్దశారము – సర్వార్థసాధక చక్రము

పంచమ ఆవరణము బహిర్దశారము, దశ కోణములు గలది. ధర్మార్థకామమోక్షములను చతుర్విధ పురుషార్థముల నొసగుటచేత సర్వార్థసాధక చక్రమని పిలువబడుచున్నది. అధిదేవత త్రిపురశ్రీ. సేవికలు జ్ఞానేంద్రియములకు అందని కులోత్తీర్ణ యోగినులు. చక్రముయొక్క వర్ణము సిందూరము. దశకోణములు దశావతారములకు ప్రతీకలు.

భైరవి రాగము ఝంప తాళములో ఉన్న ఈ కృతి పంచమీ విభక్తిలో ఉన్నది. అనుపల్లవిలో రాగముద్రగా, దేవి నామములలో ఒకటైన భైరవి ప్రయోగించబడెను (సేవిత భైరవీ భార్గవీ భారత్యాః). ఝంపతాళమునందు పది క్రియలుండును. దీక్షితర్ ఉద్దేశపూర్వకంగా దశకోణ ఆవరణ కృతిని ఝంపతాళములో కూర్చినట్లు గోచరించును.

చరణములో దీక్షితర్ ఆవరణ లక్షణములను వివరించెను. పది వివిధ శబ్దములను, శరీరములోని పది వివిధ చక్రములను వర్ణించెను. క్రీగంటిచూపు ప్రసరించుట ద్వారా ఆమె దయ సాధకునిపై పడునని దీక్షితర్ సూచించెను. ఈ కృతిలో దీక్షితర్ ప్రయోగించిన విశేషణములు:

నాదమయ – దేవి యొక్క ప్రణవశబ్దమునకు ప్రతిబింబము
సర్వసిద్ధిప్రదాది దశశక్త్యారాధితమూర్తేః – దశ శక్తుల నామము
శ్రోత్రాదిదశకరణాత్మక – అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు
సర్వార్థసాధక స్ఫూర్తేః – ఆవరణ నామము
మూలాది నవాఽధారవ్యావృత్తదశధ్వనీ భేదజ్ఞః – మూలాధారమునుండి ఉద్భవించు పది వివిధ నాదములు. ఏకాగ్రతతో నిరంతరము ధ్యానము చేయునపుడు, దశవిధ నాదములు గ్రహించబడును.

మూలాధార చక్రమునకు సహస్రార చక్రమునకు మధ్య తొమ్మిది సూక్ష్మ చక్రములున్నవి. పరబ్రహ్మమందు లీనమయే దశనాడులకు సారూప్యముగా దశమండలములను అవి చూపించును.

శ్రీ కమలాంబాయాః పరమ్

పంచమావరణ కీర్తనమ్

రాగం: భైరవి   తాళం: ఝంప

పల్లవి

శ్రీకమలాంబాయాః పరం నహి రే రే చిత్త!
క్షిత్యాదిశివాంతతత్త్వ స్వరూపిణ్యాః

అనుపల్లవి

శ్రీకంఠవిష్ణువిరించాది జనయిత్ర్యాః
శివాత్మకవిశ్వకర్త్ర్యాః కారయిత్ర్యాః
శ్రీకరబహిర్దశారచక్రస్థిత్యాః
సేవిత భైరవీ భార్గవీ భారత్యాః

చరణమ్

నాదమయసూక్ష్మరూపసర్వసిద్ధిప్రదాది–దశశక్త్యారాధితమూర్తేః
శ్రోత్రాదిదశకరణాత్మకకుళకౌళికాది బహువిధోపాసితకీర్తేః
అభేదనిత్యశుద్ధబుద్ధముక్తాయాం–సచ్చిదానందమయపరమాఽద్వైతస్ఫూర్తేః
ఆదిమధ్యాంతరహితాఽప్రమేయగురుగుహమోదిత–సర్వార్థసాధకస్ఫూర్తేః *
మూలాదినవాధారవ్యావృత్తదశధ్వనిభేదజ్ఞయోగిబృంద సంరక్షణ్యాః
అనాదిమాయాఽవిద్యా కార్యకారణ వినోదకరణపటుతరకటాక్షవీక్షణ్యాః
* ('సర్వార్థసాధకపూర్తేః' సుబ్బరామ దీక్షిత్ గారి సంగీత సంప్రదాయ ప్రదర్శినీ ప్రకారము)

ప్రతిపదార్థము

పల్లవి

శ్రీ కమలాంబాయః పరమ్ – కమలాంబాదేవికంటె గొప్పది
న హి – వేరొకటి లేదు
రే రే చిత్త – ఓ మనసా!
క్షిత్యాది–శివాంత–తత్త్వస్వరూపిణ్యాః – భూమినుండి శివతత్త్వము వరకు సమస్త సిద్ధాంతముల సారము

అనుపల్లవి

శ్రీకంఠవిష్ణువిరించి జనయిత్ర్యాః – శివ, విష్ణు, బ్రహ్మలకు తల్లి
శివాత్మక విశ్వ కర్త్ర్యాః – విశ్వ సృష్టి కర్త్రి శివుని సారము
కారయిత్ర్యాః – సమస్త కార్యములకు మధ్యవర్తి
శ్రీకరబహిర్దశారచక్రస్థిత్యాః – మంగళకరమగు బహిర్దశారమందు (దశ త్రిభుజములలో) నివసించు
సేవిత భైరవీ భార్గవీ భారత్యాః – భైరవి (పార్వతి), భార్గవి (లక్ష్మి) భారతీ (సరస్వతి) లచే సేవించబడునది

చరణమ్

నాదమయ సూక్ష్మరూప సర్వసిద్ధి ప్రదాది దశశక్త్యారాధిత మూర్తేః – సర్వసిద్ధిప్రద మున్నగు దశశక్తులచే అనుగ్రహింపబడిన సూక్ష్మరూప శబ్దనాదము

శ్రోత్రాది దశకరణాత్మక కుళకౌళికాది బహువిధోపాసిత కీర్తేః – దశేంద్రియములకు సరిసమానమగు కుళకౌళ శక్తుల రూపములలో పూజించబడుటచే ప్రసిద్ధమైన

అభేదనిత్యశుద్ధబుద్ధముక్త సచ్చిదానందమయ పరమాద్వైత స్ఫూర్తేః – నిత్యము, నిర్మలము, వికసించిన బుద్ధి, విముక్తి మున్నగు సచ్చిదానంద అద్వైతబ్రహ్మముగా నిత్య శుద్ధ బుద్ధ ముక్తుడై వ్యక్తమగు

ఆదిమధ్యాంతరహితాఽప్రమేయ గురుగుహమోదిత – ఆది, మధ్యమము, అంతము లేని, తెలియబడని, గురుగుహునిచే వినోదించబడి, సర్వార్థసాధక చక్రముగా వ్యక్తము కాబడిన

మూలాది నవాధార వ్యావృత్త దశధ్వని భేదజ్ఞ యోగివృంద సంరక్షణ్యాః – యోగినులను రక్షించుచు, శరీరమందు మూలాధారమునుండి తొమ్మిది చక్రములలో నివసించుచు, దశశబ్ద జ్ఞాన భేదముచే వాటిని ఛేదించు నేర్పుగల

అనాది మాయాఽవిద్యా కార్యకారణ వినోదకరణ పటుతరకటాక్షవీక్షణ్యాః – కేవలము క్రీగంటి చూపుతో అనాదిగానున్న భ్రమ అజ్ఞానములను, కార్య కారణ శాసనములను నిర్మూలించు సామర్థ్యముగలది

తాత్పర్యము

పల్లవి

ఓ మనసా! కమలాంబాదేవి కంటె గొప్పది వేరేదియు లేదు. ఆమె, భూమినుండి ప్రభువైన శివునివరకు ఉన్నటువంటి సిద్ధాంతము లన్నిటి సారము.

అనుపల్లవి

ఆమె శివుడు, విష్ణువు, బ్రహ్మలకు తల్లి. సమస్త కార్యములకు ఆమె మధ్యవర్తి, సృష్టికర్త్రి. (అనగా శివుడని భావము). మంగళప్రదమైన బహిర్దశార చక్రములో నివసించును. ఆమె, భైరవి, భార్గవి, భారతులచే సేవించబడుచున్నది.

చరణము

ఆమె సూక్ష్మరూపము నాదము (శబ్దము). సర్వసిద్ధిప్రద మొదలగు శక్తులచే స్తోత్రము చేయబడుచున్నది. కుళ, కౌళ మున్నగు వివిధ పద్ధతులలో పూజించబడుటచే ఆమె ప్రసిద్ధి గాంచినది. ఆమె నిత్య శుద్ధ బుద్ధ సచ్చిదానందస్వరూపమైన అద్వైతబ్రహ్మముగా వ్యక్తమగుచున్నది.

ఆమె ఆదిమధ్యాంతరహిత, తెలియబడనిది. గురుగుహునిచే వినోదించబడుచున్నది. సర్వార్థసాధక చక్రము వ్యక్తస్వరూపము. శరీరములోని తొమ్మిది కేంద్రములలో నివసించు యోగులను రక్షించునది, దశశబ్ద జ్ఞానభేదముచే వాటిని ఛేదించుకొని వచ్చుటలో నేర్పరి. కేవలము ఆమె క్రీగంటిచూపు అనాదిగా వచ్చుచున్న భ్రమ అజ్ఞానములను, కార్యకారణ పరిణామములను నిర్మూలించగలదు.

షష్ఠ ఆవరణ – అంతర్దశారము – సర్వరక్షాకర చక్రము

ఈ ఆవరణ అంతర్దశారమను సర్వరక్షాకర చక్రము. లోపలి పది త్రిభుజములతో ఉన్నటువంటిది, రక్షించు శక్తి కలిగినది. అధిదేవత త్రిపురమాలిని. సేవికలు నిగర్భయోగినులు. గులాబి వర్ణములో నున్న ఈ ఆవరణ యొక్క పది మూలలు అగ్నియొక్క పది భాగములను సూచించును. అగ్ని యొక్క పది ప్రాణములు పది అంగములతో– అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు – సంబంధము కలిగియున్నవి.

పున్నాగవరాళి రాగము రూపక తాళములో నున్న ఈ కృతి షష్ఠీవిభక్తిలో దీక్షితర్ కూర్చిరి. ఈ ఆరవ కృతి తాళములో ఆరు క్రియలు ఉన్నవి.

రాగముద్రకు ఉపయోగించిన పదము దేవి కురులను వర్ణించును. ఈ కురులు పున్నాగవృక్షము చుట్టూ మూగే అందమైన నల్లని ఈగలను జయించును. సంగీతము క్షుణ్ణముగా తెలిసినదానిగా దీక్షితర్ ఆమెను సంబోధించెను. ఆవరణ గుణములన్నియు కలిగియున్న దేవిగా ఆమెను వర్ణించెను. దశకోణములుగల ఆరవ ఆవరణ లక్షణములను పది వివిధ విశేషణములతో వర్ణించెను.

‘శ్రీకరి’ అనగా మోక్షము నిచ్చునది.
విష్ణుసహస్రనామములో ‘శ్రీధరః శ్రీకరః శ్రీమాన్’,
లలితాసహస్రనామములో ‘సుమ–శరేక్షు కోదండపాశాంకుశపాణి మనోరూపేక్షు–కోదండ’, ‘
దశకళాత్మక వహ్నిస్వరూప ప్రకాశాంతర్దశార సర్వరక్షాకరచక్రేశ్వర్యాః’ – దశాగ్నులు, చక్రనామము,
‘ త్రిదశాదినుత–కచవర్గద్వయమయ సర్వజ్ఞాది దశశక్తిసమేతమాలినీ చక్రేశ్వర్యాః’ – చక్రాధిదేవత త్రిపురమాలిని,
‘దశముద్రాసమారాధితకౌళిన్యాః’ – దశ ముద్రలతో పూజించబడు దేవి,
‘దశకరణవృత్తిమరీచినిగర్భయోగిన్యాః’–నిగర్భయోగినులు సేవికలు, ‘ .
దూమూష్మాజ్వాలినీవిస్ఫులింగినీ–సుశ్రీ–సురూప–కపిల–హవ్యవాహినీ–కవ్యవాహినీ’ – అగ్నియొక్క దశ రూపములు,
‘దశముద్రా సమారాధ్యా’ – దశముద్రలచే పూజింపబడుచున్న దేవి. ఈవిధముగా విశేషణములతో దేవి వర్ణించబడెను.

కమలాంబికాయాః తవ

షష్ఠ్యావరణ కీర్తనమ్

రాగం: పున్నాగవరాళి తాళం: రూపకం

పల్లవి

కమలాంబికాయాస్తవ భక్తోఽహం
శంకర్యాః శ్రీకర్యాః సంగీతరసికాయాః శ్రీ

అనుపల్లవి

సుమశరేక్షుకోదండపాశాంకుశపాణ్యాః
అతిమధురతరవాణ్యాః శర్వాణ్యాః కల్యాణ్యాః
రమణీయ పున్నాగవరాళివిజితవేణ్యాః

చరణమ్

దశకలాత్మకవహ్నిస్వరూప ప్రకాశాంతర్దశార-సర్వరక్షాకర చక్రేశ్వర్యాః
త్రిదశాదినుత-కచవర్గద్వయమయసర్వజ్ఞాది దశశక్తి సమేత-మాలినీ చక్రేశ్వర్యాః
త్రిదశవింశాద్వర్ణ-గర్భిణీకుండలిన్యాః దశముద్రాసమృద్ధితా కౌళిన్యాః
దశరథాదినుతగురుగుహజనకశివబోధిన్యాః
దశకరణవృత్తిమరీచినిగర్భయోగిన్యాః శ్రీ

ప్రతిపదార్థము

పల్లవి

కమలాంబికాయై – కమలాంబికయొక్క
తవ – నీ యొక్క
భక్తాః – భక్తులు
అహం – నేను (అయి ఉన్నాను)
శంకర్యాః – మంగళము ప్రసాదించునది
శ్రీకర్యాః – సంపద ననుగ్రహించునది
సంగీతరసికాయాః – సంగీతము నానందించునది
శ్రీ – మంగళప్రదము

అనుపల్లవి

సుమసారేక్షు కోదండపాశాంకుశపాణ్యాః – పుష్పబాణములు, చెఱకుగడ, మునిగోల, ఉచ్చులను చేతులలో పట్టుకొనినది
అతిమధురతరవాణ్యాః – అత్యంత మధురమైన వాక్కు గలది

శర్వాణ్యాః – శర్వుని (శివుని) భార్య
కల్యాణ్యాః – నిరంతరము మంగళప్రదమైనది
రమణీయ పున్నాగవరాళి విజితవేణ్యాః – పున్నాగవృక్షము చుట్టూ మూగిన అందమైన నల్లని ఈగలను జయించిన అల్లిన కురులు గలది
శ్రీ – మంగళకరము

చరణము

దశకలాత్మక వహ్నిస్వరూప ప్రకాశాంతర్దశార సర్వరక్షాకర చక్రేశ్వర్యాః – దశవిధ అగ్నులు సహజ స్వభావముగా గలది, సర్వరక్షాకర చక్రములో వ్యక్తమైనది
త్రిదశాదినుత కచవర్గద్వయమయ సర్వజ్ఞాది దశశక్తి సమేతమాలినీ చక్రేశ్వర్యాః – కచటతపాది దశవర్గమునకు చెందిన సర్వజ్ఞాది దశ శక్తులు గలది
త్రిదశవింశద్వర్ణ గర్భిణీ కుండలిన్యాః – ఏబది వర్ణాక్షరములచే చుట్టబడియున్న కుండలిని
దశముద్ర సమారాధిత కౌళిన్యాః – దశ ముద్రలచే పూజించబడు కౌళినీదేవి
దశరథాదినుత గురుగుహ జనక శివబోధిన్యాః – దశరథాదులచే పూజించబడునది, గురుగుహుని తండ్రి శివునికి బోధించునది
దశకరణవృత్తి మరీచి నిగర్భ యోగిన్యాః – దశేంద్రియముల కర్మలను చేయు అవ్యక్త యోగినులచే సేవించబడునది
శ్రీ – మంగళకరము

తాత్పర్యము

పల్లవి

సంగీతము నాస్వాదించుచు ఆనందించు కమలాదేవి భక్తుడను నేను. మరియు మంగళము, సంపదల ననుగ్రహించు పద్మవదనము గల దేవికి భక్తుడను.

అనుపల్లవి

పుష్పబాణములు, చెఱకుగడ, మునికోల, ఉచ్చులను చేతులలో పట్టుకొనియుండు నీవు శర్వుని భార్యవు. నీ వాక్కు అత్యంత మధురము. నిత్య మంగళస్వరూపిణివి. అందమైన అల్లిన నీ నల్లని కురులు, పున్నాగవృక్షము చుట్టూ మూగే నల్లని ఈగలను జయించును.

చరణము

దశవిధ అగ్నుల ప్రకాశము నీకు స్వతస్సిద్ధము. సర్వరక్షాకరచక్రములో వ్యక్తమైనదానవు. మాలినీ చక్రములోని ముప్పది దేవతలచే పూజించబడుచున్నావు. ఈ చక్రములోని సర్వజ్ఞాది దశశక్తులచే వర్ణమాలలోని పది అక్షరములకు అనగా కచటతపాది వర్గములకు చెందినవి. వర్ణమాలలోని ఏబది అక్షరములచే ఆవరింపబడిన కుండలినివి. నీవు దశముద్రలచే ఉపాసించబడు కౌళినీదేవి. దశరథాదులచే పూజించబడు నీవు శివుని నిజతత్త్వమును ప్రకటించుదానవు. దశేంద్రియముల కార్యకలాపముల నాచరించు అవ్యక్తయోగినులచే సేవింపబడుచున్నావు.

సప్తమ ఆవరణము – సర్వరోగహర చక్రము

సర్వరోగహర చక్రమను నామముతో పిలువబడు ఈ ఆవరణ సమస్త రోగములను పరిహరించును. అధిదేవత త్రిపురసిద్ధ, రహస్య యోగినులచే సేవింపబడుచున్నది. అష్ట కోణములుగల ఈ ఆవరణ యొక్క వర్ణము గులాబి. ఈ చక్రమునకు వసుకోణమను నామము కూడ గలదు. అష్టకోణములు, వాగ్దేవతా రూపములోనున్న అష్టవసువులను సూచించును. మరియు అష్టకోణములు పంచభూతములు, మనస్సు, బుద్ధి, అహంకారములను ఎనిమిదింటికి ప్రతీకలు.

సహన రాగము, త్రిపుట తాళములో ఉన్న ఈ కృతి సప్తమీ విభక్తిలో కూర్చబడినది. సప్తమ ఆవరణ స్వభావమునకు తగినట్లు ఏడు క్రియలు ఉన్నటువంటి త్రిపుట తాళములో నున్నది. చరణములో రాగముద్రను చూడవచ్చును

'విరించహరీశానహరిహయవేదితరహస్యయోగిన్యామ్'

'హ్రీం' భువనేశ్వరీ మంత్రము. అనుపల్లవిలో నాలుగు పర్యాయములు దీక్షితర్ దీని నుపయోగించెను.

'పరాది–వాగ్దేవత–రూప–వశిన్యాది–విభాగిన్యామ్'
వాక్కు నాలుగు రకములు – పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ
వశిన్యాది అష్ట వాగ్దేవతలు సప్తమ ఆవరణ దేవతలు.
తిరువారూరుకు మరొక నామము కమలానగరము.

శ్రీ కమలాంబికాయామ్

సప్తమావరణ కీర్తనమ్

రాగం: సహన తాళం: త్రిపుట

పల్లవి

శ్రీ కమలాంబికాయాం భక్తిం కరోమి
శ్రితకల్పవాటికాయాం చండికాయాం జగదంబికాయామ్

అనుపల్లవి

రాకాచంద్రవదనాయాం రాజీవనయనాయామ్
పాకారినుతచరణాయామ్ ఆకాశాది కిరణాయామ్ *
హ్రీంకారవిపినహరిణ్యాం హ్రీంకారసుశరీరిణ్యామ్
హ్రీంకారతరుమఞ్జర్యాం హ్రీంకారైశ్వర్యా గౌర్యామ్

చరణమ్

శరీరత్రయవిలక్షణసుఖతరస్వాత్మానుభోగిన్యామ్
విరించహరీశానహరిహయవేదితరహస్యయోగిన్యామ్
పరాదివాగ్దేవతారూపవశిన్యాదివిభాగిన్యామ్
చరాత్మకసర్వరోగహరనిరామయరాజయోగిన్యామ్
కరధృతవీణావాదిన్యాం కమలానగరవినోదిన్యామ్
సురనరమునిజనమోదిన్యామ్
గురుగుహవరప్రసాదిన్యామ్
(*'ఆకాశాది కరణాయామ్' సుబ్బరామ దీక్షిత్ సంగీత సంప్రదాయ ప్రదర్శిని ప్రకారము)

ప్రతిపదార్థము

పల్లవి

శ్రీ కమలాంబికాయామ్ – మంగళకరమైన కమలాంబికయందు
భక్తిమ్ – భక్తి
కరోమి – చేయుదును
శ్రితకల్పవాటికాయామ్ – ఆమె ఆశ్రయము పొందగోరు భక్తులకు, కల్పవృక్షమువలె, కోర్కెలన్నిటిని ప్రసాదించును.
చండికాయామ్ – భయంకరమైన చండిక
జగదంబికాయామ్ – విశ్వమంతటికి మాత

అనుపల్లవి

రాకాచంద్ర వదనాయామ్ – పౌర్ణమి చంద్రునివంటి ముఖము కలది
రాజీవనయనాయామ్ – కలువలవంటి కన్నులు గలది
పాకారినుత చరణాయామ్ – ఇంద్రుడు కొలుచు పాదములు
ఆకాశాది కిరణాయామ్ – ఆకాశాదులను ప్రకాశింపజేయునది
హ్రీంకార విపిన హరిణ్యామ్ – హ్రీం శబ్దారణ్యములోని లేడి
హ్రీంకార సుశరీరిణ్యామ్ – హ్రీంకార స్వరూపిణి
హ్రీంకారతరు మంజర్యామ్ – హ్రీం శబ్దవృక్షము యొక్క అందమైన పుష్పగుచ్ఛము
హ్రీంకారైశ్వర్యామ్ – హ్రీంకారమునకు దేవి
గౌర్యామ్ – చక్కని గౌరి

చరణమ్

శరీరత్రయ విలక్షణ సుఖతర స్వాత్మానుభోగిన్యామ్ – స్థూల, సూక్ష్మ, కారణ శరీరముల నధిగమించు స్వీయానుభవములో పరవశించునది
విరించి హరీశాన హరి హయ వేదిత రహస్య యోగిన్యామ్ – బ్రహ్మ, విష్ణు, శివ, ఇంద్రుల నెరిగిన రహస్యయోగినులచే సేవించబడునది
పరాది వాగ్దేవతారూప వశిన్యాది విభాగిన్యామ్ – నిర్మలమైన వాక్కు, , వశిన్యాది శక్తులుగా విభజించబడిన తద్రూపములకు దేవి
చరాత్మక సర్వరోగహరనిరామయ రాజయోగిన్యామ్ – సమస్త తాత్కాలిక రోగములను నివారించు రాజయోగము

కరధృత వీణావాదిన్యామ్ – వీణను చేతిలో పట్టుకొనునది
కమలానగర వినోదిన్యామ్ – కమలానగరములో వినోదించునది
సుర నర మునిజన మోదిన్యామ్ – దేవతలు, మానవులు, మునులకు మోదము చేకూర్చునది
గురుగుహ వర ప్రసాదిన్యామ్ – గురుగుహునకు వరములు అనుగ్రహించునది

తాత్పర్యము

పల్లవి

మంగళస్వరూపి కమలాంబికకు నా భక్తిని సమర్పించుచున్నాను. ఆమె ఆశ్రయము గోరు భక్తుల కోర్కె లన్నిటిని నెరవేర్చునది విశ్వమాత, చండిక

అనుపల్లవి

ఆమె ముఖము పున్నమి చంద్రునివలె, కనులు కలువల వలె ఉండును. ఆమె పాదములను ఇంద్రుడు పూజించును. ఆమె పంచభూతములను ప్రకాశింపజేయును. ఆమె హ్రీం స్వరూపము.

చరణము

స్థూల, సూక్ష్మ, కారణ శరీరముల కతీతముగా, ఆమె స్వాఽత్మానుభవములో ఆనందించును. బ్రహ్మ, విష్ణు, శివ, ఇంద్రులకు తెలిసిన రహస్యయోగినులచే సేవింపబడుచున్నది. ఆమె నిర్మల వాగ్దేవి, వాటి రూపములు. ఇవి వశినీ మొదలగు శక్తులుగా విభజించబడినవి. తాత్కాలికమైన రోగములను నిర్మూలించు రాజయోగిని. ఆమె వీణను చేత ధరించి, దేవతలకు, మానవులకు, మునిజనులకు మోదము చేకూర్చును. ఆమె తన అనుగ్రహమును వరముగా గురుగుహునికి ప్రసాదించును.

అష్టమ ఆవరణ – సర్వసిద్ధిప్రదాయక చక్రము

అన్ని సిద్ధులను ప్రసాదించు అష్టమ ఆవరణము సర్వసిద్ధిప్రదాయక చక్రముగా తెలియుచున్నది. ఈ ఆవరణ అధిదేవత త్రిపురాంబ. సేవికలు రహస్య, అతిరహస్య యోగినులు. శుద్ధసత్త్వమును సూచించు ఈ ఆవరణ శ్వేతవర్ణము కలది.

త్రిభుజాకారములోనున్న ఆవరణ సత్త్వరజస్తమోగుణములను సూచించును. (త్రిభుజము శిఖరము తూర్పు దిక్కుగా నుండును. దీనిని స్వతంత్ర ప్రతిపత్తిగల 'కామకల' అందురు. మూడు భుజములు మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతులకు ప్రతీకలు. త్రిభుజములోని మూడు కోణములు దేవి మూడు శక్తి రూపములను సూచించును. కామేశ్వరిగా బ్రహ్మ సృజనశక్తి, వజ్రేశ్వరిగా విష్ణువు పోషకశక్తి, భగమాలినిగా రుద్రుని లయశక్తి సూచించబడుచున్నవి. త్రిభుజముయొక్క ఉత్తరదిశ కోణము జాలంధర పీఠమును సూచించును. ఈ పీఠమునందు శివుడు సతీసమేతంగా ఉండును. దక్షిణమువైపు కోణము పూర్ణగిరి పీఠమును, అందులోనుండు విష్ణువును విష్ణుపత్నిని సూచించుచుండగా, మూడవ కోణము కామగిరి పీఠమును అందులోనుండు బ్రహ్మను సతీసమేతంగా సూచించుచున్నది. త్రిభుజములోని మూడు కోణములు, మూడు వాక్స్వరూపములను – పశ్యంతి, మధ్యమ, వైఖరి – కూడ సూచించుచున్నవి. ఇవి దేవియొక్క ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తులుగా తెలియబడుచున్నవి. సర్వసిద్ధిప్రదాయక చక్రము యోనిచక్రము, శక్తిచక్రము, జీవత్రికోణము, విసర్గ అని కూడ పిలువబడుచున్నది. ఈ చక్రము అన్ని త్రయములను – త్రిగుణములు, త్రిమూర్తులు, ఇత్యాది –

సూచించును.

ఈ ఆవరణ కృతి ఘంటారాగము ఆది తాళములో ఉన్నది. ఆదితాళమందు ఎనిమిది క్రియలు ఉండును. ఈ కృతి సంబోధనా విభక్తిలో వ్రాయబడినది. చరణములో రాగముద్రను చూడవచ్చును.

'సంతతం ముక్తిఘంటామణిఘోషాయమాణకవాటద్వారే'

దీక్షితర్ దీర్ఘసమాసములను ఉపయోగించును. చిట్టచివరి ఆవరణకు ముందున్న ఆవరణ. అనేక త్రయములను సూచించుచున్నది.

'సంతాపహర త్రికోణ గేహే' ఆధిదైవిక, ఆధిభౌతిక, ఆధ్యాత్మికములనే తాపత్రయములను (మూడు తాపములను) దేవి నిర్మూలించును. ఈ మూడు తాపములనుండి సాంత్వన పొందుటకు మూడు పర్యాయములు మంత్రము (ఏ మంత్రమైనను) చివరిలో శాంతి మంత్రము నుచ్చరించుట సంప్రదాయము.

'కరాంగులినఖోదయ-విష్ణు-దశావతారే'
లలితాసహస్రనామము (80), కరాంగులి-నఖోత్పన్న నారాయణ దశాకృతిః.

శ్రీకమలాంబికే అవావ

అష్టమావరణ కీర్తనమ్

రాగం: ఘంటా తాళం: ఆది

పల్లవి

శ్రీకమలాంబికేఽవావ శివే కరధృతశుకశారికే

అనుపల్లవి

లోకపాలిని కపాలిని శూలిని లోకజనని
భగమాలిని సకృదాలోకయ మామ్
సర్వసిద్ధిప్రదాయికే త్రిపురాంబికే బాలాంబికే

చరణమ్

సంతప్తహేమసన్నిభదేహే సదాఽఖండైకరసప్రవాహే
సంతాపహరత్రికోణగేహే సకామేశ్వరి శక్తిసమూహే
సంతతం ముక్తిఘంటామణిఘోషాయమాణ కవాటద్వారే
అనంతగురుగుహవిదితే కరాంగులినఖోదయ-
విష్ణు దశావతారే అంతఃకరణేక్షుకార్ముక-
శబ్దాదిపంచతన్మాత్ర విశిఖాఽత్యంతరాగపాశ
ద్వేషాంకుశధరకరేఽతిరహస్యయోగినీపరే

ప్రతిపదార్థము

పల్లవి

శ్రీ కమలాంబికే – ఓ కమలాంబికా!
అవ అవ – (నన్ను) రక్షించు (నన్ను) రక్షించు
శివే – మంగళకరమైనవాడా!
కరధృత శుకసారికే – చేతులలో చిలుకను మైనగోరను పట్టుకొనినవాడా!

అనుపల్లవి

లోకపాలిని – లోకముల రక్షకురాలా!
కపాలిని –పుర్రెను పట్టుకొనుదానా!
శూలిని – శూలము పట్టుకొనుదానా!
లోకజనని – లోకములకు మాతా!
భగమాలిని – నీవు భగమాలినివి
సకృత్ – కేవలం ఒకసారి
ఆలోకయ – చూడుమా
మామ్ – నన్ను
సర్వసిద్ధిప్రదాయికే – సర్వశక్తులు అనుగ్రహించుదానా!
త్రిపురాంబికే – ఓ అమ్మా త్రిపురా!
బాలాంబికే – బాలాంబికా!

చరణమ్

సంతప్తహేమసన్నిభదేహే – కరగించిన బంగారమువలె మెరిసిపోవు శరీరము గలదానా!
సదాఉఖండైకరసప్రవాహే – అఖండముగా నిరంతరము ప్రవహించు ఆనందము గలదానా!
సంతాపహరత్రికోణ గేహే – సకల దుఃఖములను నిర్మూలించు త్రిభుజములో నివసించుదానా!
సకామేశ్వరిశక్తిసమూహే – కామేశ్వరి, వజ్రేశ్వరి, భగమాలిని అను మూడు శక్తులు అనుసరించుదానా!
సతతం – ఎల్లప్పుడు
ముక్తిఘంటాఘోషాయమానకవాటద్వారే – విముక్తి మార్గమును ఘంటామణితో ప్రకటించు ద్వారము గదా నీవు!
అనంత గురుగుహ విదితే – అనంతునికి గురుగుహునికి తెలిసినదానా!
కరాంగులి నఖోదయ విష్ణు దశావతారే – చేతి పదివ్రేళ్ళనుండి పుట్టిన – విష్ణువుయొక్క పది అవతారములు గలదానా!
అంతఃకరణేక్షు కార్ముక శబ్దాది పంచతన్మాత్ర విశిఖాత్యంత రాగపాశ ద్వేషాంకుశధరకరే – మనస్సుకు చిహ్నముగా చెఱకు ధనుస్సు పట్టుకొందువు, ఐదు జ్ఞానేంద్రియములకు చిహ్నముగా ఐదు బాణములు, బంధమనే ఉచ్చు, జుగుప్స కలిగించు మునికోల
అతిరహస్య యోగినీపరే – రహస్య యోగినులచే సేవింపబడుచున్నదానా!

తాత్పర్యము

పల్లవి

ఓ శ్రీ కమలాంబా! చిలుకను మైనగోరను పట్టుకొనియున్న నీవు నన్ను రక్షింపుము.

అనుపల్లవి

నీవు లోకరక్షకురాలవు. పుణ్రెను శూలమును పట్టుకొని సకల శక్తుల ననుగ్రహించెదవు.

చరణము

